



# కథామంజరి

## పది కథల సమాహారం

మార్చి 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**మార్చి 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 3



కథామంజరిని
ఆర్థికంగా బలోపేతం చేసిన
మా చందాదారులకు
హార్దికాభివందనములు



# మా జట్టు


సంపాదకుడు
జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త
అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం
ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం
ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం
Harbinger Publishing

బొమ్మలు
కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన.. | ix |
| కథాపుస్తక పరిచయం | x |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| ఎంత పని చేసావు నర్సింహా! | డా. సన్నిహిత్ | 1 |
| ప్రమీల | అశోక్ ఆనంద్ | 8 |
| అధర్మ చరిత్ర | నల్లబాటి రాఘవేంద్రరావు | 13 |
| రాలిపడ్డ పువ్వు | బలభద్రపాత్రుని ఉదయ శంకర్ | 19 |
| తన వంతు | ఎల్.ఆర్.స్వామి | 24 |
| ఋణం | వి. వి. రమణమూర్తి | 27 |
| సహజ నటుడు | ఆదోని బాషా | 31 |
| స్రవంతి | పెండ్యాల అరవింద్ | 39 |
| అయిష్టం | డా. మృణాళిని | 44 |
| గుడిలో పువ్వు | జీడిగుంట రామచంద్రమూర్తి | 49 |


★★★

Cover Page Credit : Andrey Rasp, Nefteyugansk (Russia)

# కథాకీయం

"నేటి బాలలే రేపటి పౌరులు" అనే మాట ఏదోఒక సందర్భంలో వింటునే ఉంటాం! "మొక్కై వంగనిది మానై వంగుతుందా" అనే మాట కూడా వింటుంటాం! ఇలా పిల్లల పెంపకంలో చాలా నానుడులు తెలుగునాటే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి! అంటే పిల్లల పెంపక విషయంలో అందరి అలోచనలు ఒక్కలాగే ఉంటాయి! దేశం, ప్రాంతం, భాష, ఎవరైనా సరే... తల్లిదండ్రులు అన్న తర్వాత, వాళ్ళకి వాళ్ళ పిల్లలని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉంటుంది. దాని కోసం ఎవరి స్థాయిలో వాళ్ళు పాటుపడతారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణ నేర్పడం, చిన్న చిన్న పనులు చేయించడం, వాళ్ళకి కథలు చెప్పడం... ఇలా ఎవరికి తోచిన ప్రణాళికలను వారు అమలుచేసి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. మంచి బాల్యం ఇవ్వాలనీ ప్రయత్నాలు చేస్తారు. బాల్యంలోనే వారిని మంచి మార్గంలో నడిపించి మంచి పునాది వేస్తే, వాళ్ళు జీవితంలో రాణిస్తారని, భవిష్యత్తు బావుంటుందని... గట్టి నమ్మకంతో ఉంటారు. ఐతే కాలమాన పరిస్థితులు మారిన తర్వాత ఈ నమ్మకం మాట ఎలావున్నా, అసలు ఆలోచనలలోనే మార్పు వచ్చేసింది. 'అన్నప్రాసన నాడే ఆవకాయ అన్నం' పెట్టేస్తున్నారు. బాల్యం నుండే పోటీ ప్రపంచంలోకి నెట్టేస్తున్నారు. చదువు, విజ్ఞానం, వివేకత... ఇవి రావాలనే ఆలోచనలు పక్కకు పోయి, పెద్ద ఉద్యోగం సాధించాలి, బాగా డబ్బులు సంపాదించాలి వంటి ఆలోచనలే పూర్తిగా మెదడుని అక్రమించుకుంటున్నాయి! దానికి తోడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయి, బంధాలు అనుబంధాలు కృంగిపోయి, ఎవరికి వారు బ్రతుకుతున్న రోజుల్లో క్రమంగా బాలల్లో సృజనాత్మకత కొరవడుతోంది. ఆ వయసులో సహజంగా ఉండే సున్నితత్వం, జిజ్ఞాస, కుతూహలం వంటి గుణాలకు అర్థాలు వెతుక్కునే పరిస్థితి వచ్చిసింది! పరీక్షల్లో మార్కులు, ర్యాంక్‌ల కోసం, పోటీలు పడుతూ... మనిషిగా ఎదగడాన్ని తుంగలోకి నెట్టేస్తున్నారు.

అయితే మారిన పరిస్థితుల్ని తిట్టుకుంటునో, పరిస్థితులకు అనుకూలంగా మారిపోయి కూర్చోవడం కన్నా ఏదో చేయాలనే తపన ఇప్పుడు చాలామందిలో కనబడుతోంది. ఎక్కడ పోగొట్టుకున్నామో.. అక్కడే తిరిగి విత్తు నాటడానికి నడుం కట్టుకుని పాటుపడుతున్నారు. ఆ ప్రక్రియలో భాగంగా పిల్లలకి కథలు, శతకాలు, పద్యాలు చెప్పడం, వారి చేత వ్రాయించడం, చెప్పించడం.. మనో వికాసానికి తోడ్పడే ఆట పాటలను నేర్పించడం..., ఇలా ఎవరికి చేతనైనా పనులను వారు చేస్తూ.. బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే.. ఈ దిశలో పనిచేసేవారి సంఖ్య బహు తక్కువగా ఉంది.. ప్రభుత్వం కూడా నడుం కట్టుకోవాలి!

ఈ ఆలోచనలతో... ఉడతాభక్తిగా 'కథామంజరి' కూడా 'నేను సైతం' అంటూ ఆ దిశలో కృషి చేయాలని సంకల్పించి... "బాల కథామంజరి" శీర్షికతో త్వరలో పిల్లల కథలను ప్రచురింపబోతున్నాం! పిల్లలు ఆ కథలను చదువుకోవడమే కాదు, 'నేను కూడా ఓ కథ వ్రాయాలి' అనే ఓ ఆలోచన కలిగించేలా... ముఖ్యంగా హైస్కూలు విద్యార్థుల స్థాయి నుంచే కథలు వ్రాయించగలిగే ప్రధానమైన సంకల్పంతో 'కథామంజరి' మరో అడుగు ముందుకు వేయబోతోంది.

ఈ ఆలోచనలకి పదును పట్టి, విధి విధానాలను క్రోడీకరించి.. త్వరలోనే మీ ముందుకు వస్తాం!! ఈ దిశగా మీ సలహాలను సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

ఇందుకు రచయితలు, తల్లిదండ్రులు, తాతమ్మలు, పిల్లలు – వాళ్ళ ఉపాధ్యాయులు.. ఇలా అందరి సహకారం అభ్యర్థిస్తూ.. ఇప్పటికి సెలవు!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డాక్టర్ మృణాళిని**


కథలు రాస్తారు. నవలలు రాస్తారు. పరిశోధనలు చేస్తారు. ప్రముఖుల్ని ఇంటర్వ్యూలు చేస్తారు. మంచి పుస్తకాలు వెలువరిస్తారు. అంతే కాదు.. మంచి డాక్యుమెంటరీలు తీయడం, సభలు సమావేశాల్ని నిర్వహించడం... ఇలా చాలా ప్రక్రియల మీద పనిచేస్తూ, వాటిలో ఆరితేరి, తనకంటూ ఓ ప్రత్యేకత సాధించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, విదుషీమణి డా. చుండూరి మృణాళిని గారు. ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రంలో పనిచేస్తున్న రోజుల్లో... ముందురోజు రికార్డు చేయవలసిన కథను రచయిత అందచేయకపోవడంతో, రాత్రికి రాత్రి కథ వ్రాసి, ఉదయన్నే నేరుగా చదివి వినిపించారు... అలా డా. మృణాళినిగారు కథా రచనలోకి అడుగుపెట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ. పట్టా తీసుకున్న తర్వాత, "ఉదయం" పత్రికలో పని చేసేటప్పుడు.. ఏదో ఒక వార్తో, విషయమో, కాలమో వ్రాయవలసిన అవసరం పడటంతో... వ్రాయడం అలవాటైంది. పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు, కె.యన్.వై. పతంజలిగారు, మహమ్మద్ గౌస్ గారు.. వంటి ప్రముఖుల ప్రోద్బలంతో వారపత్రికలలో కాలమ్స్ వ్రాస్తూ.. రచయిత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారు. విభిన్నమైన అభిరుచులున్న మృణాళినిగారికి... ముఖ్యంగా అధిక్షేప హాస్యం అంటే ఎక్కువ ఇష్టం. మృణాళినిగారి రచనలలో ఆ హాస్యమే ఎక్కువ కనబడుతుంది. ఆ కోవలో వ్రాసిన కాలమ్ కథలే "కోమలి గాంధారం". స్త్రీవాదాన్ని ఓ హాస్యపు కోణంతో ఆవిష్కరిస్తే ఎలా వుంటుందని ఆలోచించి వ్రాసిన, ఆ కాలమ్ కథలు చదివి వాసిరెడ్డి సీతాదేవి, అబ్బూరి ఛాయాదేవి, చేకూరి రామారావు, ఎబికే ప్రసాద్.. వంటి ప్రముఖుల్నుంచి మంచి స్పందనలు వచ్చాయి. తెలుగు నవలల మీద పరిశోధనలు చేసి పి.హెచ్.డి. సాధించిన మృణాళిని గారు.. నవలలు వ్రాయడం కష్టమనే విషయాన్ని ఘంటాపథంగా చెప్తారు. నిజానికి తెలుగులో మంచి కథలు, కవిత్వం వచ్చాయి, వస్తున్నాయి గాని.. చెప్పుకోదగ్గ నవలలు రాలేదనే అభిప్రాయం.. వంద నవలలు పరిశోధన కోసం చదివినప్పుడు ఆమెకు ఏర్పడిందిట! 'అసలు నవలలు వ్రాయడం కూడా కష్టమని' అంటారు. ఎంతోమంది తెలుగు సాహితీ ప్రముఖలను ఇంటర్వ్యూలు నిర్వహించిన మృణాళిని గార్కి కాలమ్స్ రాయడం అంటేనే ఇష్టం! ఆకాశవాణిలో దాశరథి కృష్ణమాచార్యగారిని, దూరదర్శన్‌లో అక్కినేని నాగేశ్వరరావుగారిని మొదలుకొని, ఎంతోమంది ప్రముఖులను ఇంటర్వ్యూలు చేసిన మృణాళినిగారు.. 'అధ్యాపక వృత్తికీ, రచనలు చేయడానికి జర్నలిజం

అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని' అంటారు. మృణాళినిగారు వ్రాసే ఏ రచన అయినా సరే.. క్రమశిక్షణతో, ఔచిత్యంతో ఉంటాయి! సాహిత్యం సమస్యలను పరిష్కరించకపోవచ్చు గాని, మనుషులను మార్చగలదని గట్టిగా నమ్మే మృణాళినిగారు.. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు రెండూ గొప్పవే అంటారు. ఇప్పుడు రచనలు చేస్తున్నవారి గురించి తన అభిప్రాయం చెపుతూ.. 'తమ రచనలు కలకాలం నిలవాలంటే, పాత, కొత్త రచయితలందరి రచనలు చదవాలి. లక్ష్యాలను పెట్టుకుని, తక్షణ విజయాలు గురించి పట్టించుకోకుండా ఉన్నప్పుడు మంచి రచనలు చేయగలరని' అంటారు.

1956 సంవత్సరంలో కాకినాడలో జన్మంచిన డా. సి.మృణాళినిగారు, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లీషు, ఎంఏ విమెన్ స్టడీస్, తెలుగులో ఎంఫిల్, పిహెచ్‌డిలు చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనకేంద్రంలో ఆచార్యులుగా పనిచేసి పదవీవిరమణ చేశారు. ఆమె పర్యవేక్షణలో 35 మందికి ఎంఫిల్ డిగ్రీలు, 18 మందికి పిహెచ్‌డి డిగ్రీలు లభించాయి. ప్రస్తుతం కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖకు అధ్యక్షురాలిగా ఉంటూ, తెలుగులో సర్టిఫికెట్, డిప్లొమా, ఎంఏ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదికాక, ప్రస్తుతం ఆమె కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహామండలి కన్వీనర్‌గా ఉన్నారు. డా. మృణాళిని విమర్శ, కథ, అనువాదాలు, జీవితచరిత్ర కలిపి ఆమె ఇప్పటివరకూ ఇరవైఐదు గ్రంథాలు రచించారు. కోమలి గాంధారం, తాంబూలం, మృణాళిని ప్రేమకథలు వంటి సృజనాత్మక రచనలు, మూడు హాస్యనవలికలు కాక, తెలుగు నవలలో కథన శిల్పం, ఇంతిహాసం, నిశ్శబ్ద విప్లవాలు, ప్రతిధ్వని, సకల, విశ్వమహిళా నవల అన్న విమర్శ గ్రంథాలు, మహమ్మద్ రఫీపై ఒక గ్రంథం రచించారు. పన్నెండుకు పైగా అనువాదాలు చేశారు. వాటిలో ఆర్.కె. నారాయణ్ మాల్గుడి కథల అనువాదానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ అనువాదం అవార్డు అందుకున్నారు. సాహిత్య అకాడెమీ కోసం, ప్రముఖ హిందీ భాషా పండితుడు గుల్జార్ గారి కథలను తెలుగులోకి అనువదించారు. పాతికకు పైగా అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. దూరదర్శన్ లోనూ, ఇతర టెలివిజన్ ఛానెళ్లలోనూ, యూట్యూబ్ ఛానెల్ లోనూ కలిపి రెండువేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం ఐడ్రీమ్ మీడియాలో అక్షరయాత్ర అనే సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ప్రముఖ తెలుగు సాహితీవేత్త కీ.శే. రాళ్ళపల్లి ఆనంతరాయశర్మ గారి మనమరాలుగా తాతగారి పేరు నిలబెట్టగలిగే సాహితీసేవలు అందిస్తున్న డా. మృణాళినిగారు, వర్తమాన తెలుగు సాహితీప్రపంచంలో ఉన్నతమైన స్థానంలో ఉన్నా సరే.. అతి సాధారణంగా, సౌమ్యంగా, అందరితో కలివిడిగా.. ఉన్నదున్నట్లు మాట్లాడతారు. అలాంటి ఓ అసాధారణమైన, సాధారణ మహోన్నత మహిళ డా. మృణాళినిగారు, కథామంజరి ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, మరెన్నో వారి రచనలతో ప్రపంచస్థాయిలో తెలుగుభాష వెలుగులు చిందించగలరని ఆకాంక్షిస్తున్నాం!!

**కథామంజరి బృందం**



## కీ. శే. జీడిగుంట రామచంద్రమూర్తి

భూమీ్మద కుటుంబవ్యవస్థ ఉన్నంత కాలం, కథ నిలుస్తుందని సాహితీవేత్తలు అంటుంటారు. కాలమానం మారినా, సాంకేతిక విజ్ఞానం పెరిగి మనిషిలో అనూహ్యమైన మార్పులు సంభవించినా సరే... కుటుంబ నేపథ్యంలో వచ్చే ఏ కథైనా సరే, ఏ మనిషినైనా సరే కదిలిస్తుంది... ఇది నిజం! కథలో ఏదో ఒకచోట అతడ్ని కట్టి పడేస్తుంది. వందేళ్ల క్రిందట వచ్చిన కథని ఇప్పుడు చదివినా సరే, మనిషిని చలింపచేస్తుంది. అలాంటి... కుటుంబ నేపథ్యంలో కథలు వ్రాసిన మొన్నటితరం కథకుల్లో ప్రముఖులు కీ.శే. జీడిగుంట రామచంద్రమూర్తి గారు! ఆయన వ్రాసిన నాలుగు వందల పైచిలుకు కథలలో తొంభై శాతం కథలు కుటుంబనేపథ్యంలో వ్రాసినవే! మానవ సంబంధాలు, మానవీయ విలువలతో ముడిపడి ఉండేవి. అందుకేనెమో... అరవై సంవత్సరాల క్రితం వ్రాసిన ఆయన కథలను, ఈ తరంవారు చదివినా సరే, ఏదో విధమైన అనుభూతిని పొందుతారు. ఇప్పటి పరిభాషలో చెప్పాలంటే.. 'కనెక్ట్' అవుతారు! అలాంటి కథలు వ్రాసిన రామచంద్రమూర్తి గారు తెలుగు సాహితీప్రపంచంలో సవ్యసాచిలా కొత్త కోణాలను ఆవిష్కరించారు. ఓ కథను.. చదువుతూంటే ఎలా ఉండాలి, అది పదిమంది వినడానికి చదివినప్పుడు ఎలా ఉండాలి, అదే కథను దృశ్యంగా చూపెట్టే నాటికగా ఎలా మరల్చాలి, అదే నాటిక... రేడియోలో వస్తే ఎలా ఉండాలి.. దూరదర్శన్‌లో ఎట్లా ఉండాలి... ఇలా ఎన్నో కోణాలలో కథాసాహిత్యాన్ని చూపించిన రామచంద్రమూర్తి గారిని... తెలుగు కథా ఘనపాటిగా చెప్పుకోవాలి!

ఉమ్మడి కుటుంబంలో .. అదీ దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టడం,.. బాధ్యతలు, ఇబ్బందులు, కష్టాలతో పాటు, అనుబంధాలు అనురాగాల మధ్య పెరిగిన వాతవరణమే తన సాహితీప్రస్థానానికి దారి చూపించిందని రామచంద్రమూర్తిగారు అంటుండేవారు. నిజానికి వారు పెద్దచదువులు చదువుకోలేదు... ఇంటర్ వరకే చదివారు. సాంప్రదాయ సాహిత్యం కూడా చదవలేదు. అయితే పాటలు, సంగీతం, పుస్తకాలు చదవడం అంటే ఇష్టపడేవారు. ఆ ఉత్సాహంతోనే ఇంటర్ చదువుతున్నప్పుడే... లిఖితపత్రిక ఒకటి నడిపారు. తర్వాత ఓ చిన్న ఉద్యోగంలో చేరడం, ఇరవై ఏళ్ళు రాగానే పెళ్ళి కూడా జరిగిపోయాయి. ఆ పెళ్ళి వ్యవహారం చూసి, "హంసగమన" అనే కథ వ్రాసారు. ముద్రణలో వచ్చిన ఆయన మొట్టమొదటి కథ అదే.. ఆంధ్రపత్రిక వారపత్రిక జూలై 5, 1961 సంచికలో ప్రచురించారు. ఆ కథకి

బాపుగారు బొమ్మ వేసారు. ఆంధ్రపత్రికలో కథ రచయిత పేరుతో ప్రచురింపబడటం, కథకి బాపుగారు బొమ్మ వేయడం... ఆ రోజుల్లో అపూర్వమైనది. అలా మొదటికథ తోనే పెద్దరచయితల సరసన చేరిన రామచంద్రమూర్తిగారు, అనతికాలం లోనే, కథల్లోంచి మరో అడుగు ముందుకు వేసి, "జీవనవాహిని" అనే నవల వ్రాసారు. కోడూరు కౌసల్యాదేవి గారిచే ముందు మాట వ్రాయిద్దామని అనుకున్నారుట... కాని ఆవిడ్ని కలవడం కుదరక పోవడంతో, ఆయనే ముందుమాట వ్రాస్తూ, ఈ మాట కూడా వ్రాసుకున్నారు. 1965 లో మొదటి కథలసంపుటి వచ్చింది. తర్వాత.. ఆకాశవాణిలో స్క్రిప్ట్ రైటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళితే... అక్కడ శ్రీయుతులు దాశరథి గారు, దివాకర్ల వేంకటావధాని గారు, బాలాంత్రపు రజనీకాంతరావు గారు వీరిని ఇంటర్వ్యూ చేసి, సెలెక్ట్ చేసారుట! 1971 డిసెంబరులో ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రంలో అడుగుపెట్టారు. రేడియోలో ప్రసారమయే కుటుంబనియంత్రణ కార్యక్రమాలకు స్క్రిప్ట్‌లు వ్రాస్తూ, మరోవైపు రచనలు చేసేవారు. ఆ రోజుల్లో కార్మికుల కార్యక్రమం చాలా ప్రాచుర్యంలో ఉండేది. ఆ కార్యక్రమంలో "బాలయ్య"గా అవతారం ఎత్తి, పద్నాలుగు సంవత్సరాలు ఆ కార్యక్రమానికి స్క్రిప్ట్‌లు కూడా వ్రాసారు. అలాగే ప్రముఖుల నవలలను రేడియోలో ప్రసారం చేయడానికి వీలుగా నాటకీకరణ చేయడం, బయటి రంగస్థల నాటకాలను రేడియోకరణ చేయడం, రేడియోలో నవలలను, కథలను శ్రావ్యంగా వినిపించడం, ప్రముఖులను ఇంటర్వ్యూ చేయడం, తర్వాతకాలంలో దూరదర్శన్‌లో ఎపిసోడ్‌లకు స్క్రిప్టులు, టెలిప్లేలు వ్రాయడం... ఇలా ఎన్నో సాహితీప్రక్రియలకు పనిచేసి, తన ముద్ర వేసుకున్నారు. అలాగే భర్తృహరి సుభాషితాలలోని పద్యాలకు కథలల్లి, టెలిప్లే చేసి, వాటిని దూరదర్శన్‌లో ప్రదర్శించారు. మరోవైపు ఓ నాలుగు సినిమాలకు పనిచేసారు.! గొలుసు కథ, ఫోటో సీరియల్, సితార పత్రిక కోసం ఇంగ్లీషు సినిమాలు, ఆ నటుల జీవితాలు, సమీక్షలు, తెలుగు చిత్రసీమలో పనిచేయడానికి వచ్చి, చితికిపోయిన వారి జీవితాలను "వెండితెర జీవితాలు" పేరిట వ్యాసాలు, ఈనాడు దినపత్రిక 'అంతర్యామి'లో ఆధ్యాత్మిక వ్యాసాలు వ్రాసారు. అలాగే శ్రీశైలం, భద్రాచలం వంటి దేవాలయాలలో జరిగే కల్యాణకార్యక్రమాలకి 'కామెంటరీ' లకు స్క్రిప్టులు రాసుకుని, వ్యాఖ్యానం చేసేవారు. నలభైకి పైగా నాటికలు, నాటకాలు, ఎనిమిది నవలలతో బాటుగా.. రేడియో, దూరదర్శన్, సినిమా మాధ్యమాలకు అనేకమైన రచనలు అందించిన రామచంద్రమూర్తి గారు 1940లో జన్మించి తన ఎనభయ్యవ ఏట 2020లో కరోన బారిపడి తుదిశ్వాస విడిచారు.

ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న రామచంద్రమూర్తి గార్కి ముగ్గురు కొడుకులు.. అందులో పెద్దకొడుకు విజయసారథి గారు మంచి రచయిత, గాయకుడు. వీరి కుమారుడు వరుణ్‌సందేశ్ సినిమా నటుడు. రామచంద్రమూర్తి గారి రెండో అబ్బాయి శ్రీధర్ కూడా టీవి నటుడే.

బహుముఖ ప్రజ్ఞాశాలి కీ.శే. జీడిగుంట రామచంద్రమూర్తిగారి గురించి వ్రాయలంటే.. అదో నవల అవుతుంది. సాహితీప్రక్రియలలో తనదైన ముద్ర వేసుకుని, నిరంతరం తెలుగుకథ గురించి పాటుపడిన రామచంద్రమూర్తిగారికి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం!

***కథామంజరి బృందం.***

## కల్పనా రెంటాల గారి కథ "అయిదో గోడ"

నాలుగు గోడల మధ్య బంధింపబడే మన ఆలోచనలకు, ఆచరణలకు మధ్య మరో గోడ ఒకటుంటుందా? ముఖ్యంగా స్త్రీ సంబంధమైన సమస్యలు ప్రతిబింబించే కథల్లో రచయితలు రచయిత్రులు తమ ఆలోచనల్ని ఈ అయిదో గోడను దాటించి స్వేచ్ఛగా పాత్రలపై పాఠకుల సానుభూతి ప్రమేయం లేకుండా నిజాయితీగా రాయగలరా? అలాంటి గోడ ఉంటుంది, దాన్ని స్త్రీవాద రచయితలు అధిగమించాలని అంటారు రచయిత్రి కల్పనా రెంటాల – ఈ 'అయిదవ గోడ' కథలో.

కల్పన అమెరికాలో స్థిరపడ్డ ప్రముఖ రచయిత్రి. ఆమె రాసిన ఈ అయిదో గోడ కథ ఎందరో సాహితీ విమర్శకుల మెప్పు పొందింది. 2009 లో ఈ కథ వంగూరి ఫౌండేషన్ వారి 14వ ఉత్తమ కథల పోటీలో మొదటి బహుమతి గెల్చుకుంది. 2012 లో 'వందేళ్ళ కథకు వందనాలు' అనే శీర్షికతో వెలువడిన యూట్యూబు వీడియోలలో 36వ ఎపిసోడ్‌గా గొల్లపూడి మారుతీరావు గారు పరిచయం చేశారు. ప్రముఖ అనువాదకులు నౌడూరి మూర్తి గారు, తదితరులు ఈ కథను ఆంగ్లంలోకి తర్జుమా చేశారు.

ఇక కథకి వస్తే....

ఇండియాలో నివసిస్తున్న శారద భర్త మరణించిన నెల తిరగకుండానే పేపర్లలో ప్రకటన ఇస్తుంది "తోడు కావాలి – పెళ్ళి లాంటి ఫార్మాలిటీస్ లేకుండా కలిసి జీవితం పంచుకోవటానికి, నెల క్రితం భర్త చనిపోయిన, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న యాభై అయిదేళ్ళ రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు, సంస్కారవంతుడై, స్నేహితుడిగా మెలగగలిగే వ్యక్తి కావాలి. సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలన్న ఉత్సాహమున్న వారికీ, సంగీతం, సాహిత్యమంటే అభిరుచులున్న వారికి ప్రాధాన్యత." – సంప్రదించాల్సిన చిరునామా – కె. శారద, తన ఇంటి ఎడ్రసు.

అమెరికాలో ఉండే కూతురుకి నచ్చలేదు. తండ్రి పోయిన మూడో నెలలో ఇండియా వచ్చింది. తల్లిని నిలదీసింది. ఇన్నేళ్ళ కాపురం తరవాత ఆమె భర్తకిచ్చే గౌరవం ఇదేనా? ఇంత తొందరగా ఇంకో పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనకి సిగ్గు లేదా? తల్లి కోరికలతో అంత కాలిపోతోందా? కూతురు చెంప ఛెళ్ళుమనిపించింది శారద బాధతోనే.

నెల రోజులు తిరగకుండానే తల్లి ఇచ్చిన ప్రకటన చూసి 'తన తల్లికింత ధైర్యమా?' అనుకుంది.

ఇల్లంతా నీట్‌గా సర్ది ఉంచబడింది. ఫ్లవర్‌వేజ్‌లో తాజా పూలు, గోడలమీద కొత్త పెయింటింగ్స్ – మూడు నెలల క్రితం తండ్రి పోయిన గుర్తులేమీ లేకపోవడం కూతురు ఆర్తికి విస్మయం కలిగించింది. ఒక్క బెడ్రూములో మాత్రం తండ్రి ఫోటో ఉంది. తన తల్లికి తనన్నా, తండ్రన్నా ప్రేమే లేదా? ఇన్నాళ్ళ కాపురానికి అర్థమేమిటో బోధపడలేదు ఆర్తికి.

అమ్మ తిండి తినకుండా, నీరసంతో చిక్కిపోయి, మానసికంగా డిప్రెస్ అయి ఉంటుందనుకుని వచ్చిన ఆర్తికి, నిజమైన షాక్! బహుశా ఒప్పించి అమెరికా తీసుకెళితే, తల్లి తొందరపాటుతో ఇచ్చిన ప్రకటన కార్యరూపం దాల్చకపోవచ్చు కదా అని అనుకుంది.

సాయంత్రం చాయ్ తాగుతూ, 'సలాం హైదారాబాద్' పుస్తకాన్ని చదువుతూన్న శారదతో సంభాషణకు ఉపక్రమించింది ఆర్తి. ఇలా మూడు నెలలలోనే ఎవరి తోడో వెతుక్కోవడం ఏం బాగు? శారద గుర్తు చేసింది. ఆర్తి పిన్ని పోయినప్పుడు తనే బాబాయిని ఓదార్చి, నెల లోపే పేపర్లో పెళ్ళి ప్రకటన ఇస్తే ఎంత సంతోషించిందో! మరి తన తల్లి అదే పని చేస్తే ఎందుకంత కష్టమేస్తుంది? దానికి ఆర్తి సమాధానం.. బాబాయి వేరు, శారద వేరు. ఎందుకంటే, బాబాయికి, లేదా మగవాళ్లకి ఇంట్లో ఆడమనిషి లేకుండా ఉంటే బతుకు దుర్భరమవుతుంది. అదే ఆడవాళ్ళకా సమస్య లేదు. ఎందుకంటే మొదటి నుండీ, వాళ్ళేగా అన్ని పనులు చేసేదీ!

పైగా తను జీవితాన్ని ఎంజాయ్ చెయ్యడానికి ఎంతైనా డబ్బివ్వగలదు తల్లికి. కారు, డ్రైవరు పెడుతుంది. అమెరికా వస్తే సరే, రాకపోయినా ఎలా కావాలంటే అలా బతకొచ్చుగా! ఈ వయసులో మళ్ళీ జీవిత భాగస్వాములేమిటి?

"ఆర్తి, నాకు కావలసింది డబ్బు, నగలు, చీరలు, కారు లాంటి సౌకర్యాలు కాదు. ఓ మనిషి తోడు. నన్ను నన్నుగా అర్థం చేసుకునే మనిషి. నాకు నచ్చిన విధంగా నాతో స్నేహంగా, ఆత్మీయంగా, అభిమానంగా, ప్రేమగా ఉండగలిగే మనిషి," అంది శారద. ఇన్నాళ్ళ తన ఒంటరి బతుకు చాలని, మిగిలిన జీవితాన్ని వృథా చేసుకోకుండా తన కోసంగా బతకాలని చెప్తుంది.

మరి తల్లి, తండ్రి ఇన్నాళ్ళూ హాయిగా లేరా? లేరనే నిజాన్ని ఆర్తి మొదటిసారిగా తెలుసుకుంటుంది. తల్లీ, తండ్రీ ఏదైనా కలిసి పంచుకుంటే అది ఆర్తి మాత్రమే. ఒక రకమైన ఒంటరి జీవితాన్నే గడిపింది శారద. ఏ విషయంలోనూ, మొగుడికి అవహేళన తప్ప ఇద్దరూ ఆనందంగా కలిసి చేసిన పని లేదు. మరి ఇన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదు? చెప్పడానికి ఆర్తి సమయం ఇస్తే కదా! తన జీవితం తనది. చనిపోయిన భర్త జ్ఞాపకాలతో మిగిలిన జీవితాన్ని గడిపేయాలన్న ఆలోచన తనకి లేదని కూతురికి దృఢంగా చెప్పేసింది శారద.

తనకు నచ్చిన వ్యక్తి దొరికాడని, అతని భార్య పోయి ఏడాది అయిందని, అతను, తను, పెళ్ళి కాకుండా సహజీవనం చేసే నిర్ణయం తీసుకున్నామని, ఉత్సాహంతో వెల్లడిస్తుంది శారద. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతున్న తల్లి మరింత అందంగా కనిపించింది ఆర్తికి.

ఇక్కడితో ఒక భాగం పూర్తయింది. రచయిత్రి చేసిన ప్రయోగం రెండో భాగం.

అంతవరకూ కథ రాసిన శ్రీవిద్యకు కథలో ఏదో వెలితి కనిపిస్తోంది. కథ చదువుతున్న శశి ఇది ఏ అమెరికాలోనో జరిగితే అర్థముంటుంది కానీ, ఇక్కడా, అన్న సంశయాన్ని వ్యక్తం చేస్తాడు. రాత్రి పది గంటలకు శ్రీవిద్యకు ఎదురుగా నిలబడి నిలదీసింది శారద పాత్ర — "నేను నీచేతిలో మైనపు బొమ్మను కదా, నేను చేసిన పనికి సామాజిక ఆమోదం లభించాలని నువ్వు ప్రయత్నించలేదా కథలో" అంటూ.

అవును. పాఠకుల దృష్టిలో శారద పాత్ర చౌకబారు కాకుండా వీలైనంత డిగ్నిఫైడ్‌గా కనిపించాలనే కదా తను చేసింది? అదే అంది పాత్రతో. అయితే పాత్ర నిర్ణయం మీద రచయిత్రికి గౌరవం లేదా? మొదట్లో ఆనందంగా జీవితాన్ని ఎంజాయ్ చేయటం కోసం తోడు వెతుక్కుంటున్నట్లు రాసి, సంగీతం, సాహిత్యం, సామాజిక సేవ అంటూ ఏవేవో రాసి, పాఠకుల్ని, పాత్రని, తనను తననే మోసం చేసుకున్నట్లేగా?

శారద అన్న చివరి మాటలివి:

“చూశావా? నీకు ఉన్న విషయం రాసే ధైర్యం లేకపోయింది. ఓ స్త్రీ ఎందుకు పెళ్ళి చేసుకోవాలో? ఎలా చేసుకోవాలో ఈ సమాజం ముందే నిర్ణయించేసింది. నీకు ఆ చెలియలి కట్ట దాటాలని ఉంది. కానీ నీకు తెలియకుండానే నువ్వు ఒక సరిహద్దుని గీస్తున్నావు. నన్ను ఓ సరిహద్దు నుండి మరో సరిహద్దుకు పంపుతున్నావు. నీ లోపల ఉన్న గోడ చూసుకో,”

ఈ మాటలతో రెండవ భాగం ముగుస్తుంది.

ఈ కథ రాయడంలో కల్పన గారు చేసిన ప్రయోగం గమనించదగ్గది. ఈ రెండో భాగం రాయడం మొదటి భాగం రాసిన తరవాత వచ్చిన ఆలోచన కావచ్చు. రాసిన కథలో తను సృష్టించిన పాత్రకి ఎంత న్యాయం చేకూర్చాననే ప్రశ్న ప్రతీ రచయితా నిజాయితీగా ఆలోచించవలసిన విషయం. కల్పన గారు ఆ ఆలోచనను కథలో రెండో భాగంగా, పాఠకుల ముందుంచడం మెచ్చుకోదగ్గ విషయం. అయితే ఒకటి. శారద ఇచ్చిన ప్రకటన పాఠకులు చదివినప్పుడు రెండో భాగంలో రచయిత్రి చూపించిన సూక్ష్మమైన తేడా కనిపించదు – అది పాఠకుల ఆలోచనా సరళి వల్లా? రచయిత్రి పాత్రకెంత న్యాయం చేకూర్చిందా అన్నది పాత్ర ప్రశ్నించినప్పుడు మాత్రమే ‘ఓ అలాగా!’ అని అనిపిస్తుంది.

ప్రముఖ రచయిత్రి పి. సత్యవతి గారు ఈ కథ గురించి రాస్తూ “పురుషస్వామ్య నిర్మిత సంస్కృతి , స్త్రీల మెదళ్ళ పై చేసే నియంత్రణ , వారి జీవితాల చుట్టూ వేసే కంచే అయిదవగోడ.” అంటారు.

మంచి ప్రశ్నలను లేవనెత్తిన ఈ కథ ఎన్నో ప్రశంసలనందుకుంది. చదవాల్సిన కథల్లో ఇదొకటి.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*

కథామంజరి వారికి, మంచి కథలు అందిస్తునందుకు ముందుగా అభినందనలు. “పితృ ఋణం”లో ఆస్తి పేపర్లలో చూపిన శ్రద్ధ అస్థికల మీద ఉండదు అన్నది సత్యం. సాంప్రదాయంలో అవకతవకలైతే ఏమవుతుందో అన్న భయం సహజంగా ఉంది. “పరిణితి”లో తాత హంసను తీసుకు రమ్మనడం పరిణితి చెందిన ఆలోచన. ‘తెరవెనుక’ ‘లవ్ క్వీన్’ కథలలో సినిమావారిలో ఉన్న మంచితనం, అవకాశవాదం బాగా ఉంది. పునర్ముద్రిత కథలూ బాగున్నాయి. కథామంజరిలో ప్రతి అంశమూ నచ్చేలా ఉంటున్నాయి. ధన్యవాదాలు.

**డా. లక్ష్మీ రాఘవ**

---

ప్రకాశ శర్మగారూ నమస్తే. ఈసారి కథామంజరిలో విశిష్ట అతిథిగా ఇంద్రగంటి జానకీబాల గార్ని పరిచయం చేసి, ఆమె రాసిన ఆలోచనాత్మకమైన “కళ్ళు” కథను పరిచయం చేయటం బాగుంది. ఇటీవలే ప్రతిష్టాత్మకమైన సుశీలా నారాయణరెడ్డి పురస్కారం, చలసాని వసుమతి పురస్కారం అందుకున్న సందర్భంలో ఈ విధంగా ఆమెని మరోసారి గౌరవించారని భావిస్తున్నాను. మరొక గొప్ప కథకుడు అల్లం శేషగిరిరావుగారిని కథా మార్గదర్శిగా పరిచయం చేయటమేకాక ఆయన ముద్ర కలిగిన “శిథిల శిల్పాలు” కథను మరోసారి చదివే అవకాశం కల్పించినందుకు అనేక ధన్యవాదాలు. అల్లం శేషగిరిరావుగారు అనగానే వారి వేట కథలు, వరదు కథ గుర్తుకు వస్తుంది. తెలుగు సాహిత్యంలో పేరెన్నిక గల కథకుడు ఆయన! మంచికథల సంచికగా కథామంజరిని తీసుకువస్తున్నందుకు మరోసారి అభినందనలు

**శీలా సుభద్రాదేవి**

---


కథామంజరి ఉత్తమ రచనలను ఎంపిక చేసి పత్రిక స్థాయిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న యాజమాన్యానికి అభినందనలు. ఉత్తమమైన కథను రచించిన శ్రీమతి వాడేపల్లి పూర్ణకామేశ్వరి గార్కి అభినందనలు. హరి లాంటి ఉత్తమ కొడుకుని కలిగిన ఆ తల్లి ఎంతటి అదృష్టవంతురాలో. ఓ కొడుకు చేయని సాహసం చేసి, తన సర్వస్వాన్ని తల్లి కోసమే వదిలి , డాక్టర్లు కూడా చేయలేని వైద్యాన్ని, తాను ఒక్కడే మానసికంగా తల్లికి దగ్గరై తల్లి ఆయుష్షను పెంచుకున్నాడు. ఎంత అనారోగ్యంతో ఉన్నా, ఎంత మానసిక పరిస్థితి బాగోలేక పోయిన ప్రతి తల్లీ తన కొడుకు గురించే ఆలోచిస్తుంది.తను ఏ టైమ్‌లో చనిపోతానని తెలిసిన ఆ తల్లి ,ఉత్తరం రాయడం ద్వారా తను చనిపోయాక తన కొడుకుని కూతురుకు అప్పగించడం ద్వారా ముగింపు అద్భుతంగా ఉంది.

ఈనాటి తరం యువత ఇంతటి త్యాగం చేయకపోయినా, కొంచెమైనా తల్లిదండ్రులను అర్థం చేసుకుంటే బావుంటుంది. ఎంతో ఉత్తమమైన కథను రచించిన శ్రీమతి వాడేపల్లి పూర్ణకామేశ్వరి గార్కి అభినందలు.

ఇంత ఉన్నతమైన కథను అందించినందుకు కథామంజరికి ధన్యవాదాలు.

**బి ఎస్ టి కుమారి**

---




## *జీవనరేఖలు*

ప్రముఖ కథా రచయిత శ్రీ ఇంద్రగంటి నరసింహమూర్తి కాలం నుంచి జాలువారిన మానవతా విలువలను తట్టి లేపే 24 కథల సమాహారం. ఈ కథా సంపుటి వెల రూ.250/-

ప్రతులకు

శ్రీ ఇంద్రగంటి నరసింహమూర్తి
డోర్ నెం. 66-5-12,
అశోక్ నగర్,
**కాకినాడ - 533003**
✆ 9959352900

## *33 ముప్పై మూడు*


సిసింద్రీలాంటి 42 గల్పికల ఈ సంపుటి రచయిత శ్రీ దర్భముళ్ల చంద్రశేఖర్. ఈ పుస్తకం వెల రూ.100/-

ప్రతులకు

శ్రీ దర్భముళ్ల చంద్రశేఖర్
303, ఆర్. ఆర్. టవర్స్, రైతు బజార్ ఎదురుగా,
గోపాలపట్నం,
**విశాఖపట్నం - 530027**
✆ 9491850718



## నేనూ నా వరం





భార్యాభర్తల అనుబంధాల వలలో నిత్యం కనబడే నవరస రాగాల సరిగమల సంకలనం. రచన: శ్రీమతి సరస్వతి కరవది. వెల రూ.150/-

ప్రతులకు

ఎం. వి. ఎల్. ఎస్. సరస్వతి,
ఫ్లాట్ నెం. 305, బ్లాక్ 7, మై హోమ్ విహంగా,
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, **హైదరాబాద్ – 500046**
✆ 9849530000, 7799201203

అచ్చంగా తెలుగు – ✆ 8558899478

నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, **హైదరాబాద్**




## రామచిలుక

ప్రస్తుతం గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్న మలయాళ కథారచయిత శ్రీ శ్రీధరణ్ పిళ్ళై రాసిన ఏడు కథల 150 వ కథాసంకలనాన్ని ప్రముఖ తెలుగు, మళయాళ కథారచయిత శ్రీ ఎల్.ఆర్. స్వామి, తెలుగులోకి అనువాదం చేసి ఫిబ్రవరి 2024 లో విడుదల చేసారు. వెల ₹ 100/-.

ప్రతులకు

పాలపిట్ట బుక్స్,
ఇంటి నెం. 16-1120/6/1/1
403, విజయసాయి రెసిడెన్సీ, సలీం నగర్,
మలకపేట, **హైదరాబాదు – 500036**
✆ 98487 87284

*palapittabooks@gmail.com*

# ఎంతపని చేశావ్ నరసింహా!

డా. సన్నిహిత్
✆ 9490956012

***జీవితం ఎంత చిత్రమైనది. ఒక చెక్క ముక్కని అందమైన శిల్పంలా మార్చగల నర్సింహ తన బ్రతుకుని మాత్రం అందంగా చెక్కు కోలేకపోయాడు. భయంతో లోకాన్ని విడిచిపోయాడు. క్రూరమైన ఈ సమాజం అనే శిల్పి చెక్కిన ఒక చెక్క బొమ్మ అయ్యాడు .***

అతను చేస్తున్న పనిని నిశ్శబ్దంగా గమనిస్తున్నాను.

సన్నగా, రివటలా ఉన్న నర్సింహ, చెక్కను జాగ్రత్తగా కట్ చేస్తున్నాడు. అప్పటికే తీసుకున్న మెజర్మెంట్స్ ప్రకారం, పెన్సిల్‌తో లైన్లు కొట్టుకుంటూ... తర్వాత ఒడుపుగా కోస్తున్నాడు.

సిటీలోని... ఒక మంచి కోలనీలో, రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇల్లు మాది! ఇంట్లో వుడ్‌వర్క్ చేయిద్దామని ఎప్పటినుండో అనుకుంటున్నాం! కానీ ఆఫీసులో నాకు ఎప్పుడూ పని ఒత్తిడి... తీరిక ఉండదు. లీవ్ దొరకదు. ఇంట్లో వుడ్‌వర్క్ అంటే మనం దగ్గరుండి చేయించుకోవాలి కదా, అందుకే ఆ పనిని వాయిదాలు వేస్తూ వచ్చాం. కానీ ఇన్నాళ్ళకు ఓ సంఘటన వలన, ఆ పని సాధ్యం అయింది!

★★★

పొద్దున్నే ఆఫీసుకి చేరుకోవడానికి ట్రాఫిక్‌లో ఈదుకుంటూ బైక్ మీద వెళ్తున్నాను. తొమ్మిది గంటలలోపు ఆఫీసుకి వెళ్ళి బయోమెట్రిక్ పంచ్ కొట్టాలి. లేట్ అయితే లీవ్ కట్ అవుతుంది లేదా జీతం కట్ అవుతుంది. అందుకే జాగ్రత్తగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నా. ఆఫీసు ఇంకా రెండు కిలోమీటర్లు ఉందనగా... రాంగ్ రూట్‌లో స్పీడ్‌గా ఒక బైక్ నాకు ఎదురు వచ్చింది. నేను తేరుకుని తప్పించుకునే లోపే నా బైక్‌ని గట్టిగా ఢీకొంది. అదుపు తప్పి పడిపోయాను. నన్ను ఢీకొట్టిన కుర్రాళ్ళు, నవ్వుకుంటూ బైక్ మీద పారిపోయారు. 'అరె.. ఏమయింది.. ఏమయింది' అంటూ నా చుట్టూ జనం మూగారు. ఎవరో నా బైక్‌ని లేపి, సరిగ్గా నిలబెట్టి సైడ్ స్టాండ్ వేసారు. ఇంకెవరో నన్ను పట్టుకుని లేపి నించోబెట్టారు. కుడికాలు నేల మీద పెట్టలేకపోతున్నాను. ఆ కాలికి ఉన్న బూట్‌కి రంధ్రం పడింది. ఆ కుర్రాళ్ళ బైక్, నా బైక్‌ని కొట్టినప్పుడు ఏదో మెటల్ పార్ట్ నా కుడి కాలి బూట్‌కి గుచ్చుకుంది. అందుకే రంధ్రం పడింది. ఆ దెబ్బకి బహుశా నా కాలికి గాయం అయిఉంటుంది. అందుకే కాలు నేల మీద పెట్టలేకపోతున్నాను. ఎవరో కుర్రాడు నన్ను బైక్ మీద కూర్చోబెట్టుకుని, హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు.

రిసెప్షన్‌లో ఫీజ్ కట్టి ఆర్థోపెడీషియన్ కన్సల్టేషన్ కోసం వెయిట్ చెయ్యసాగాను. కాసేపటికి నా వంతు వచ్చింది. లోనికి వెళ్ళాను.

"ఎలా జరిగింది?" అడిగాడు డాక్టర్.

"ఆఫీసుకి వెళ్తుంటే ఆకతాయి కుర్రాళ్ళు బైక్‌తో వచ్చి కొట్టారండీ..." చెప్పాను.



"సరే ఎక్సామిన్ చేస్తాను." అని చెప్పి మొత్తం కుడి పాదాన్ని రకరకాలుగా పరీక్షించాడు. తర్వాత ఎక్స్‌రే వ్రాశాడు.

"ఎక్స్‌రే తీసుకుని రండి.. అది చూసి మెడిసిన్స్ వ్రాస్తాను!" అని స్లిప్ మీద వ్రాసి ఇచ్చాడు. అక్కడే ఉన్న ఎక్స్‌రే రూంకి వెళ్ళి తీసుకున్నాను. ఫిల్మ్ ఇచ్చాడు టెక్నీషియన్. అది తీసుకొచ్చి డాక్టర్‌కి చూపించాను.

"చిన్న హెయిర్‌లైన్ క్రేక్ ఉందండీ... కట్టు కడతాను!" అని చెప్పి, నా కుడి కాలి పాదానికి, చక్కగా కట్టు కట్టాడు. "పదిహేను రోజులు బెడ్‌రెస్ట్ తీసుకోవాలి. కాలు కింద పెట్టకూడదు. పూర్తిగా అతుక్కున్నాక మళ్ళీ ఎక్స్‌రేలో చూసాక, అప్పుడు కాలు కింద పెట్టి నడవాలి!" అని చెప్పి మెడిసిన్స్ వ్రాసి ఇచ్చాడు డాక్టర్. ఆ స్లిప్ తీసుకుని ఫార్మసీలో మందులు కొనుక్కుని ఇంటికి వచ్చేసాను. నన్ను ఇంటి దాకా తీసుకొచ్చిన కుర్రాడికి థాంక్స్ చెప్పి, కొంచెం డబ్బులు ఇచ్చి పంపేసాను.

నా పరిస్థితి చూసి లబోదిబోమని ఏడ్వసాగింది నా భార్య. 'చిన్న దెబ్బే కదా... తగ్గిపోతుంది' అని సర్ది చెప్పి ఆఫీసు వాళ్ళకి ఫోన్ చేసి "కాలికి ఫ్రాక్చర్ అయింది... పదిహేను రోజులదాకా రాను" అని చెప్పాను.

ఆ విధంగా ఇప్పుడు తీరిక దొరికింది నాకు. అందుకే దగ్గరుండి చేయించవచ్చని ఈ వుడ్‌వర్క్ పని పెట్టుకున్నాను.

★★★

ఒకరి సమస్య... ఇంకొకరికి జీవనాధారం అన్నట్టు, నాకు కాలు ఫ్రాక్చర్ కావడం, నర్సింహాకి పని కల్పించింది. ఎప్పటి నుండో 'పని ఇవ్వండి సార్' అని బ్రతిమాలుతున్నాడు నర్సింహా. మంచి కార్పెంటర్ అని అతనికి పేరు ఉంది మా కాలనీలో! కానీ నాకే కుదరక ఇన్నాళ్ళూ పని ఇవ్వలేదు, ఇప్పుడు బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సి రావడంతో ఇక తప్పలేదు.

రోజూ పొద్దున్నే వచ్చి పని మొదలెడతాడు. నేను నా కార్యక్రమాలన్నీ అయ్యాక... అతని పని గమనిస్తూ ఉంటాను.

"నర్సింహా.. నువ్వు ఉండేది ఎక్కడ?" అడిగాను.

“ఇక్కడికి దగ్గరే సార్! మెట్రో స్టేషన్‌కి ఆనుకుని ఒక లేబర్ బస్తీ ఉంది కదా... అక్కడ ఉంటాను సార్!”

“సొంత ఇల్లా...”

“కాదు సార్, అద్దె ఇంట్లో ఉంటాను. నాది ఈ ఊరు కాదు సార్... దగ్గర్లో ఉన్న ఒక పల్లె! పెళ్ళి అవగానే బ్రతుకుతెరువు కోసం ఇక్కడికి వచ్చి ఉంటున్నాను!”

“మరి పని బాగా దొరుకుతుందా?”

“ఆ... ఏం పని సార్, ఏదో అప్పుడప్పుడు దొరుకుతుంది! ఇంట్లో నా పెళ్ళాం కూడా చెబుతోంది ‘అనవసరంగా ఈ టౌన్‌కి వచ్చి ఉంటున్నామని’! సొంత ఊళ్లో ఉంటే ఏదో ఒక దొరికిన పని చేసుకుంటూ... కలో, గంజో తాగి బతకాలి! బాగా బతికేద్దామని ఆశపడి కదా ఇక్కడికి వచ్చాం, కానీ చేతినిండా పని లేదు... జేబు నిండా డబ్బు లేదు!” నిరాశగా చెప్పాడు.

మనసు చివుక్కుమంది నాకు.

ఇంట్లో నేను కుంటుకుంటూ అటూ... ఇటూ తిరుగుతూ, టీవీ చూసుకుంటూ అతని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. కులవృత్తిని నమ్ముకుని ఒకప్పుడు జనాలు బాగానే బతికారు. కానీ కాలంతో పాటూ వస్తున్న మార్పులు, కరోనాలాంటి పేండమిక్‌ల వల్ల ఆ అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ఇప్పుడు కరోనా తగ్గుముఖం పట్టింది. జనాలు మళ్ళీ మామూలు జీవితం కొనసాగిస్తున్నారు. కానీ ఉన్న ఊళ్లో ఉంటే ఎప్పటికీ ఎదగలేమని భావించి ఇలా నర్సింహలాంటి వాళ్ళు పట్నం దారి పడుతున్నారు. అయినా వాళ్ళ బతుకులు బాగుపడటం లేదు. అవకాశాలు అంతగా రావడం లేదు. అందుకే చాలా మంది కులవృత్తి మానేసి, వేరు వేరు పనుల్లో కూలీలుగా లేదా కాంట్రాక్టర్స్ దగ్గర అసిస్టెంటుల్లా కుదురుకున్నారు. ఏదో రకంగా బతుకు బండిని నడిపిస్తున్నారు. నర్సింహలాంటి వాళ్ళే ఇంకా కులవృత్తిని నమ్ముకున్నారు. బాగుపడాలని ఎండమావుల వెంట పరుగు పెడుతున్నారు.

“సార్... లంచ్‌కి వెళ్ళి వస్తా!” అంటూ తన సైకిల్‌ని తీసాడు నర్సింహ.

ఒక్కసారిగా నా ఆలోచనలు చెదిరిపోయాయి. “సరే... పోయి తొందరగా రా!” అని చెప్పి అప్పటిదాకా అతను చేసిన పనిని పరిశీలించసాగాను. బెడ్‌రూములో షెల్ఫ్‌లకి చక్కటి బోర్డర్ పెట్టాడు. అరలకు సన్నటి లైనింగ్ ఇచ్చాడు. డోర్స్ కూడా చాలా చక్కగా పెట్టాడు. ముఖ్యంగా ఎంతో కళాత్మకంగా కనిపిస్తున్న బోర్డర్. చెక్క మీద అంత ఫైన్‌గా డిజైన్ చెక్కడం నిజంగా కష్టం. చేతిలో ఎంతో నైపుణ్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. ఏ చిన్న తేడా అయినా చెక్క మొత్తం వృథా అవుతుంది. నర్సింహలో ఆ నైపుణ్యం మెండుగా ఉంది. గొప్ప ‘శిల్పి’ అతను. కానీ దానికి తగ్గ ఆదాయం లేదు. చిన్నగా నిట్టూర్చి, నేను కూడా లంచ్ చేద్దామని కూర్చున్నాను.

లంచ్ తర్వాత చాలా ఆలస్యంగా వచ్చాడు నర్సింహ. అతని సైకిల్ చప్పుడుకి బయటకు వచ్చాను. గేటు తీసుకుంటూ లోనికి వస్తున్నాడు. మొహం బాగా వాడిపోయి ఉంది. అన్నం తిన్నాడో లేదో!

“ఏమయింది నర్సింహా... ఇంత లేటుగా వచ్చావు. ఇలా అయితే అనుకున్న టైముకి పని పూర్తవుతుందా?” అని కసురుకున్నాను.

కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. "ఇంట్లో బాగా గొడవ అయింది సార్! శాశ్వతంగా ఊరికి పోదామంటుంది నా భార్య. చేసిన అప్పులన్నీ తీర్చిన తర్వాతే పోదామని నేనంటాను. రోజుకో అప్పు చేస్తా ఉంటే అవి ఎప్పటికి తీరేను? ఊరికే ఆమెను మభ్యపెట్టడానికి నేను చెప్పిన అబద్ధం అది. ఊరి నుండి వచ్చేటప్పుడు... కోటి ఆశలతో ఎంతో గొప్పగా వచ్చాము. ఇప్పుడు తిరిగి ఉత్తి చేతులతో ఊరికి పోవాలంటే మనసు రావడం లేదు. అంతకంటే అవమానం ఇంకేముంటుంది సార్? ఇవన్నీ ఎంత చెప్పినా అర్థం చేసుకోదు నా పెళ్ళాం. రోజూ చస్తూ బతికే కంటే, అదే నయం అంటాంది. నా మనసు ఒక దారిలో ఉండడం లేదు సార్!" అని ఏడ్వసాగాడు. బాధగా అనిపించింది నాకు. అతడు భోంచేయలేదని అర్థం అయింది. ఒక ప్లేట్లో అన్నం పెట్టి తీసుకొచ్చి ఇచ్చాను. వద్దంటూనే తీసుకుని తిన్నాడు. తర్వాత నెమ్మదిగా పని చేసుకోసాగాడు.

"నర్సింహా... ఈ కార్పెంటరీ పని మానేసి ఇంకేదైనా చేసుకోవచ్చు కదా, ఎన్నాళ్ళు ఇలా బాధపడతావు!" అన్నాను

"ఏమో సార్. నా ప్రాణమంతా ఈ పనిలోనే ఉన్నట్టు అనిపిస్తాది. వదులుకో బుద్ధి కాదు. నా తాతల కాలం నుండి వంశపారంపర్యంగా వస్తున్న విద్య! మేమందరం ఈ విద్య మీదే పెరిగి పెద్ద అయ్యాము... బతికి బట్టకట్టాం!" అన్నాడు

"సరే... కాలం మారింది కదా, మనమూ మారాలి!" అన్నాను

"అవును సార్! ఈ పని మీదే ఒక షాప్ పెడదాం అనుకున్నాను. కుర్రాళ్ళని పెట్టుకుని పని నడిపిద్దాం అనుకున్నాను. షాప్ రెంట్ కి ఎడ్వాన్స్ కూడా ఇచ్చాను. కుర్రాళ్ళను కూడా పెట్టుకున్నాను. కానీ సరిపడా పని దొరకలేదు. ఆదాయం లేదు. షాప్ వెంటనే మూతపడింది. కుర్రాళ్ళు వెళ్ళిపోయారు. ఇప్పటి దాకా వడ్డీలు కడుతూ వచ్చాను. అప్పుగా తెచ్చిన అసలు ఇంకా తీరనే లేదు. ఫైనాన్స్ ఇచ్చిన వాళ్ళు రోజూ వచ్చి తిట్టి, తిట్టి వెళ్తున్నారు. కాళ్ళా వేళ్ళా బ్రతిమాలుకుంటే కొంచెం టైము ఇచ్చారు. ఇప్పుడు వాళ్ళు ఇచ్చిన గడువు కూడా అయిపోయింది. ఏమవుతుందో... ఏమో!" దిగులుగా అన్నాడు.

ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. కానీ విపరీతమైన బాధలో ఉన్నాడని అర్థమైంది. బయటపడలేని అప్పుల ఊబిలో కూరుకుపోయాడని తెలుస్తోంది. సాయంకాలం అయింది. టీ టైము కావడంతో నాతో పాటూ అతనికి కూడా టీ ఇచ్చాను. నేల మీద కూర్చుని నెమ్మదిగా టీ తాగుతున్నాడు.

పడమట దిక్కున సూరీడు కొండల్లోకి జారిపోతున్నాడు. వేడి తగ్గి చల్లగా గాలి వీస్తోంది. ఆకాశంలో మబ్బులు కమ్ముతున్నాయి. నెమ్మదిగా చెప్పాను.

"చూడు నర్సింహా... ఇక ముందు నీకు ఏ సమస్య వచ్చినా నాకు చెప్పు, మొహమాట పడకు!" అన్నాను.

"అలాగే సార్... తప్పకుండా! అదే పదివేలు" అని చెప్పి, టీ గ్లాసు నేల మీద పెట్టాడు. తర్వాత ఆ రోజు పని కంప్లీట్ చేసి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

ఎందుకో నా మనసు భారంగా అనిపించింది.

★★★

చీకటి పడింది. సడన్‌గా వర్షం మొదలైంది. ఉన్నట్టుండి ఉరుములు మెరుపులతో ఉధృతంగా కురవసాగింది. 'ఏంటీ అకాల వర్షం' అనుకుంటూ తలుపులన్నీ బిగించుకుని ఇంట్లో ఉన్నాం. ఉన్నది ఏదో వండుకుని, డిన్నర్ పూర్తిచేసాము.

తొమ్మిది దాటింది. కరెంట్ పోయింది. ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. ఇన్వెర్టర్తో కాసేపు కరెంటు ఉంది. తర్వాత అదీ లేదు. టీవీ రావడం లేదు. చేసేదేం లేక ముసుగు తన్ని నిద్రకు ఉపక్రమించాం.

"సార్... సార్..." అంటూ గేటు మీద గట్టిగా కొడుతూ, ఎవరో పిలుస్తుండటంతో మెలకువ వచ్చింది నాకు. టైము చూసాను. అర్ధరాత్రి కావస్తోంది. 'ఇప్పుడెవరబ్బా' అనుకుంటూ బయటకు వచ్చాను.

హోరున కురుస్తున్న వర్షంలో గేటు బయట నర్సింహ. "సార్ నేను సార్" అంటూ పిలుస్తున్నాడు. వర్షంలోకి వస్తే, కట్టు కట్టిన నా కాలు తడుస్తుందని, నా భార్యను పిలిచి గేటు తాళం తియ్యమని చెప్పాను. గొడుగు వేసుకెళ్ళి ఆమె తాళం తీసింది. లోనికి వచ్చాడు నర్సింహ.

"చెప్పు నర్సింహా... ఏంటి ఈ టైములో..." అన్నాను

"సార్... నాకు కొంచెం డబ్బులు కావాలి సార్, అర్జెంట్ సార్!" అన్నాడు ఆయాసపడుతూ.

నేను నా భార్య వైపు చూసాను. 'ఇద్దాం' అన్నట్టు ఆమె నన్ను చూసి లోనికి వెళ్ళింది. కాసేపట్లో వచ్చి 'వెతికితే ఇంట్లో ఇవే ఉన్నాయండీ' అని ఇరవై వేలు నా చేతికిచ్చింది. వాటిని నర్సింహాకి ఇస్తూ "తీసుకో... సరిపోతాయి కదా!" అన్నాను.

ఏ సమాధానమూ చెప్పకుండా 'థాంక్యూ సార్' అని దండం పెట్టి వెళ్ళిపోయాడు. ఇంత రాత్రి వేళ... అదీ ఈ భీకర వర్షంలో సైకిల్ తొక్కుకుంటూ వచ్చాడంటే... పీకల మీదికి వచ్చిన పరిస్థితే అయుంటుంది అని సర్ది చెప్పుకుని మేము ఇంట్లోకి వచ్చి, మంచాల మీద వాలిపోయాం!

తెల్లగా తెలవారింది. వర్షం తగ్గి లేత భాను కిరణాలు మరింత స్వచ్ఛంగా నేలను తాకుతున్నాయి.

మేము బ్రేక్ఫాస్ట్ కార్యక్రమాలు అన్నీ ముగించుకుని, నర్సింహ వచ్చి పని మొదలెడతాడని ఎదురు చూస్తున్నాము. అతను వస్తున్న జాడలేమీ కనిపించలేదు. నెమ్మదిగా నాకు అనుమానం మొదలైంది. 'నిన్న ఇచ్చిన డబ్బులతో కొంపదీసి ఊరికి ఉడాయించలేదు కదా!' అని. అసలు అతను చెప్పిన విషయాలన్నీ నిజమేనా? ఇద్దరు వ్యక్తులున్న చిన్న కుటుంబం కోసం అన్ని అప్పులు చెయ్యడం అవసరమా? అంత బాధలు ఏముంటాయి? ఇట్లాంటి సందేహాలన్నీ నామదిలో గింగిరాలు తిరుగుతున్నాయి.

"ఏంటండీ... అంతలా ఆలోచిస్తున్నారు?" అంటూ వచ్చింది నా భార్య.

"నర్సింహ ఇంకా రాలేదు. నాకు ఏదో అనుమానంగా ఉంది!" అన్నాను.

"అతని ఇంటి ఎడ్రస్ చెప్పాడు కదా... ఒకసారి వెళ్ళి చూసొద్దాం రండి!" అంది

"సరే" అంటూ నేను డ్రెసప్ అయ్యాను. తను స్కూటీ బయటకు తీసి నన్ను వెనక ఎక్కించుకుని ముందుకు కదిలింది. అతను చెప్పిన ఎడ్రస్ ప్రకారం మెట్రో స్టేషన్ దగ్గరున్న లేబర్ బస్తీలోకి ప్రవేశించాం.

"బాబూ... కార్పెంటర్ నర్సింహ ఇల్లెక్కడ?" అనడిగాను దారిన పోతున్న ఒక వ్యక్తిని. అతను చెప్పాడు. అతను చూపించిన దారిలో అలాగే ముందుకు వెళ్ళి అతని ఇంటిని సమీపిస్తుండగా నా మనసు కీడుని శంకించింది.

రేకుల షెడ్‌లాంటి ఆ ఇంటి బయట వాకిట్లో పడుకోబెట్టి ఉన్న ఒక శవం! చుట్టూ శోకాలు పెడుతున్న జనం. దగ్గరకు వెళ్ళి చూసాను. గుండె బద్దలైన ఫీలింగ్ కలిగింది. ప్రశాంతంగా దీర్ఘ నిద్రలో ఉన్నాడు నరసింహ! శవం పక్కన అందమైన లక్ష్మీదేవి చెక్కబొమ్మ. అతడు మనసు పెట్టి చెక్కినది.

పక్కనే అతని భార్య కాబోలు నిశ్శబ్దంగా ఏడుస్తోంది. నిన్న రాత్రే కదా నరసింహ నాతో మాట్లాడి డబ్బులు తీసుకెళ్ళింది. ఇంతలో ఏమయింది? సమస్యలకి భయపడి తిరిగిరాని లోకాలకి పారిపోయాడా? లేక ఇంకేదైనా జరిగిందా? సందేహ నివృత్తి కోసం పక్కనున్న వ్యక్తి వైపు చూసాను.

"నిన్న అర్థరాతిరి దాటాక ఉరేసుకున్నాడట సార్" అని చెప్పాడు అతను. గుండె ఝల్లుమంది.

నిన్నటి దాకా నాతో తన కష్టసుఖాలు చెప్పుకున్న వ్యక్తి, ఈరోజు భూమ్మీద లేడంటే నా మనసు నమ్మడం లేదు. కరోనాలాంటి విపత్తుతో చనిపోవడం వేరు. ఇలా తన ఉసురు తానే తీసుకోవడం వేరు. ఏం జరిగిందో మరి?

"నమస్తే సార్.." అంటూ నా దగ్గరకు వచ్చింది నర్సింహ భార్య. మూర్తీభవించిన శోకదేవతలా ఉంది.

ఎందుకో సూటిగా ఆమె కళ్ళల్లోకి చూడలేకపోయాను. తప్పు నాది కాకపోవచ్చు... కానీ అతన్ని ఆదుకోవడానికి వెనుకంజ వేసిన ఈ సమాజానిదే కదా తప్పు... నేను కూడా అందులో ఓ భాగమే కదా... నర్సింహ భార్య అంది "రాతిరి ఆ పైసలు ఇచ్చినోళ్ళు వచ్చినారు సార్... ఆళ్ళని కాళ్ళా ఏళ్ళా బతిమాలాడు... పొద్దున్నకల్లా డబ్బులు ఇచ్చేత్తానన్నాడు. అయినా ఆళ్ళు ఒప్పుకోలేదు.. అందుకే ఎంటనే సైకిలేసుకుని అంత వర్షంలో మీ దగ్గరకు వచ్చినాడు కదా సార్" అంటూ ఆగింది

"అవును... తర్వాత ఏమైంది చెప్పు!" ఆత్రంగా అన్నాను

ఆమె వెక్కివెక్కి ఏడ్చుకుంటూ "నా మానం మంట గలిసిపోయింది సార్... కుక్కల్లా మీద పడ్డారు!" అని చెప్పింది.

ఉవ్వెత్తున ఎగిసిన కెరటం మొహమ్మీద కొట్టినట్టు నిశ్చలంగా అయిపోయాను. నా పిడికిలి బిగుసుకుంది. ఎవరి మీదో చెప్పలేనంత కోపం వచ్చింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో నామీద నాకే జాలి కలుగుతోంది. 'దొంగ లంజకొడుకులసలే మెసలే ఈ ధూర్తలోకంలో...' అన్నట్టు, ఏ ఆధారమూ లేని నర్సింహలాంటి వాళ్ళ బ్రతుకులు ఇంతే అనుకున్నాను.

ఆమె చెబుతోంది "మీ దగ్గర్నుండి డబ్బుతో వచ్చాడు. నా వాలకం చూసి పిచ్చెక్కినట్టు నేల మీద పడి, పొర్లి పొర్లి ఏడ్చాడు సార్. 'నీ బతుకుని పాడు చేసింది నేనే... నేనే! ఊరి నుండి తీసుకొచ్చి ఇక్కడ పెట్టాను... నువ్వు పోదామన్నా వద్దన్నాను' అంటూ ఏదేదో అన్నాడు సార్! 'నన్ను క్షమించవే' అంటూ నా కాళ్ళు పట్టుకున్నాడు సార్! పానం చచ్చినట్టు అయి, అలాగే సొమ్మసిల్లి పోయాను సార్! తెల్లారి కళ్ళు తెరిచి చూసేసరికి శవంలా మిగిలాడు..." అంది.

విన్నాక నేను కట్రాట అయ్యాను

ఆమె "ఇదిగోండి సార్... మీరు ఇచ్చిన డబ్బులు!" అని నా చేతిలో పెట్టింది.

ఆ డబ్బు నోట్లు... మనిషి ప్రాణం తీసే కట్లపాముల్లా అనిపించాయి. కానీ మనిషికి వాటితోనే కదా అవసరం!

అందుకే "ఫర్వాలేదమ్మా... ఈ డబ్బు ఉంచుకో! వెంటనే మీ ఊరు వెళ్ళిపో... జరిగింది ఒక పీడకల అనుకుని మరచిపో.

జరిగిన దాంట్లో నీ తప్పేమీ లేదు కదా! మనం ఈ రాక్షసులతో పోరాడలేము.” అని చెప్పాను. ఒప్పుకున్నట్టు తలూపింది.

తర్వాత ఆమె ఊరు వెళ్ళడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసాం నేను నా భార్య. మా మనసుకి కొంత శాంతి కలిగింది.

జీవితం ఎంత చిత్రమైనది. ఒక చెక్క ముక్కని అందమైన శిల్పంలా మార్చగల నర్సింహ తన బ్రతుకుని మాత్రం అందంగా చెక్కుకోలేకపోయాడు. భయంతో లోకాన్ని విడిచిపోయాడు. క్రూరమైన ఈ సమాజం అనే శిల్పి చెక్కిన ఒక చెక్క బొమ్మ అయ్యాడు .

ఇక అక్కడ ఉండలేక “ఎంత పని చేసావు నర్సింహా!” అని బాధపడుతూ అక్కడి నుండి వచ్చేసాము నేనూ నా భార్యా.

# ప్రమీల

## అశోక్ ఆనంద్

> ***"ప్రత్యేకంగా పెన్ను పట్టుకు రాసేంత ఆసక్తిగా మా బతుకులుండవులే సారు. ఈ ప్రపంచంలో మన దగ్గర లేనిది మనక్కావాలంటే మన దగ్గరున్నది మనం అమ్ముకోక తప్పదు! కూడుకీ, మా కడుపుకీ మధ్య దూరం ఆరంగుళాలు. మా శరీరం మీ ఆహారం, మీ ఆయాసం మా ఆకలి తీర్చుకునే ఆధారం."***

"ఆరొందలు ఇస్తానంటున్నాడు"

"మరి రూమ్ సంగతి ఏటట"

"ఆ వోల్వో బస్సు ఎనక తుప్పల్లోకి రమ్మంటున్నాడు"

"ఏం చేద్దాం అనుకుంటున్నావ్"

"వెళ్ళనా?"

"నోర్మూయ్‌వే! నలభై ఏళ్లున్న నేనే ఏనాడు వెయ్యికి తక్కువ ఎల్లలేదు. సూపర్ ఫిగర్‌వి. నిండా పద్దెనిమిదేళ్ళు కూడా లేవు. ఇలాంటి సీప్ నా కొడుకుల పక్కన పడుకుంటావా! గమ్మునుండు. ఏదొక మంచి బేరం తగులుద్ది!" కొత్తగా వచ్చిన ప్రమీలకి అనుభవంతో చెప్తుంది తల్లి సరళ.

వైజాగ్ ఆర్.టి.సి. కాంప్లెక్స్ బస్టాపు. రాత్రి పదకొండున్నర అవుతుంది. బండి మీద ఉడుకుతున్న ఇడ్లీ, వాతావరణంలో కమ్మటి పొగలు నింపుతోంది. దూరపు ఊర్ల నుంచి వచ్చి ఆగిన బస్సుల్లో టీ అందిస్తున్నాడు టీ షాపువాడు.

'అబ్బా! ఈ చలికాలపు రాత్రి వేడి వేడిగా రెండిడ్లీ తిని, మాంచి మసాలా టీ తాగితే ఉంటది....' మనసులో అనుకుంటుంది ప్రమీల.

ఇంతలో లాల్చీ, కాటన్ ప్యాంటు ధరించిన ఒకతను వీళ్ళ ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. జేబులో ఉన్న పెన్ను తీసి చేతిలో పట్టుకుని, పళ్ళ మధ్య ఉంచి తదేకంగా చూస్తున్నాడు.

"ఎంతసేపని చూస్తావ్, ఏదోటి మాట్లాడు!" విసుక్కున్నట్లు చెప్పింది సరళ.

"ఎంత?" అడిగాడతను.

"నేనా? ఇదా?"

"ఈ పిల్లే"

"ఎంతసేపటికి?"

"ఫుల్‌నైట్"

"ఓయబ్బో! ఇదైతే పదిహేనొందల రూపాలకి ఒక్క పైసా తగ్గేది లేదు"

"రెండు వేలు తీసుకో!"



"హాఁ.. నిజమా సారూ!" అడక్కుండానే మాటకి గౌరవం తోడైంది. నోటిపై నోటు చేస్తున్న పెత్తనం.

"నిజం!"

"సారూ... మరి రూమూ అది? పిల్ల కూడా ఏవీ తిన్లేదు"

"అవన్నీ నేను చూస్కుంటాను! ముందు పంపించు"

బైక్ బయలుదేరింది. ఆ రెండిడ్లీ, వేడి టీ దగ్గరే ఆగిపోయాయి అమాయకపు ప్రమీల కళ్ళు.

చీకటిని కప్పుకుని ప్రమీల పగిలిన పెదాల కౌగిలి కోసం వేచి చూస్తున్నాయి ఆ రెండిడ్లీ, మసాలా టీ.

కొన్ని అంతే. దగ్గరగానే ఉంటాయి గానీ దగ్గరవ్వవు!

త్రీ స్టార్ హోటల్లో ఒక రూమ్ తలుపు తెరుచుకుంది. ఇద్దరూ లోపల అడుగుపెట్టారు.

అరగంట గడిచింది. ఒంటి నిండా చెమటలతో దుప్పట్లోంచి బయటకొచ్చాడు కవేశ్వర్.

"నువ్వుండు. నేను కిందకెళ్ళి తినడానికి ఏవైనా తీస్కొస్తా!" అన్నాడు.

"ఇడ్లీ ఉంటే తీసుకురండి"

మాట్లాడకుండా వెళ్ళి, పది నిమిషాల తర్వాత పైకొచ్చాడు.

"చీప్‌గా ఇడ్లీ ఏం తింటావ్! ఇదుగో ఈ దమ్ బిర్యానీ తిను"

'ఆకలికి కూడా పేద, ధనిక భేదాలుంటాయా?' అనుకుంది.

"ఏం చూస్తున్నావ్ తిను, నీ లైఫ్లో ఇలాంటి త్రీ స్టార్ హోటల్లో ఇంత మంచి బిర్యానీ... అదీ నాతో తినే అవకాశం రావడం నీ అదృష్టం!" గర్వంగా చెప్పాడు.

తీసుకుని తినడం ప్రారంభించింది ప్రమీల.

లాల్చీలోంచి పెన్ను, ఒక చిన్న నోట్ బుక్ తీశాడు కవేశ్వర్.

"హ్మ్... ఇప్పుడు చెప్పు నీ కథేంటో?"

"ఏం కథ సారు!"

"నీ కథే! అసలు నీ పేరేంటి, ఊరేంటి, ఏం చదువుకున్నావ్, ఈ వృత్తిలోకి ఎందుకు రావాల్సి వచ్చింది, వగైరా వగైరా..."

"నా వివరాలన్నీ మీకెందుకు సారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎందుకేవిటి! నేనెవరనుకున్నావ్! ఈ విశాఖ జిల్లాలోనే పేరు మోసిన పెద్ద కవిని"

"ఏం పేరో?"

"కవేశ్వర్."

"నా కథ తెల్సుకుని ఏం చేస్తారు అయినా..."

"ఏం చేస్తాను. నీ కథని వస్తువుగా తీస్కుని, అద్భుతమైన కథనంతో, మధ్య మధ్యలో కవిత్వాలతో రాసి న్యూస్‌పేపర్ వాళ్ళకిస్తే, వీక్లీ పుస్తకాల్లో ప్రచురించుకుంటారు!"

"ప్రచురిస్తే?"

"జనం చదువుతారు!"

"చదివి?"

"నీ కథ తెల్సుకుంటారు"

"తెల్సుకుంటే?"

"మీ వేశ్యలపై ఉన్న చిన్న చూపు పోయి, సానుభూతి కలుగుతుంది"

"ఆ సానుభూతి అన్నం పెడుతుందా సారు?" ముద్ద చేతిలో పట్టుకుని అడిగింది.

కవేశ్వర్ మొహంలో ఏదో ఎక్స్ప్రెషన్. కోపమా! అవమానమా! ఏమో...

"సానుభూతి కలిగితే మీ పైన గౌరవం పెరుగుతుంది."

"గౌరవం పెరిగితే మాకాడికెవరొస్తారు సారు."

నిశ్శబ్దం.

"మాట్లాడండి"

"అయితే ఇప్పుడు నీ కథ చెప్పనంటావ్"

"హహ్హా... చెప్పను అన్లేదు సారు. దాని వల్ల మాకొరిగేదేం లేదు. మా కథలు చదివి 'ప్చ్ అయ్యోపాపం' అనే వాళ్ళకి పెళ్ళాలు ఊర్లెళ్తేనో, పురుడుకెళ్తేనో గుర్తొచ్చేది మేమే! కాలేజీ కుర్రాళ్ళు రూపాయి రూపాయి పోగు చేసుకుని పోగొట్టుకునేదీ మా కాడే! అచ్చరాలు రాసేవాడి బతుకు మారుద్దేమో గానీ మా బతుకులింతే. పోనీ మీకన్నా పొట్ట నింపుద్ది అంటే చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు."

"నాన్సెన్స్! నీ కథ మీద బతకాల్సిన గతి నాకు లేదు. చిన్నపిల్లవని చూస్తున్నాను లేదంటేనా!"

"ఏం చేసేవారు?"

కవేశ్వర్ మొహం ఎరుపెక్కింది.

"ఈ చిన్నపిల్లనే... ఒళ్ళు మొత్తం హూనం చేసిన మగ మారాజులు మీరు. ఇంకా చేయడానికేముంది!"

మళ్ళీ కవేశ్వర్ మొహంలో ఏదో ఎక్స్ప్రెషన్. డౌట్ లేదు. ఈసారి అవమానమే.

"ఒక్కో వేశ్య కథ ఒక్కోలా ఉండదు సారు. మావందరివీ ఒకే కథలు, అన్నీ అవే వ్యథలు." బిర్యానీలో చేయి కడిగేసుకుందామనుకుంది. కవేశ్వర్ ప్రమీలని చూస్తున్నాడు. ప్రమీల కంచం వైపు చూస్తుంది.

"మా కథల పేరు... ఆకలి! మా వ్యథల పేరు... నిస్సహాయత!" బిర్యానీ కంచాన్ని పక్కకి జరిపింది.

పెన్ను చుట్టూ వ్రేళ్ళను బిగించాడు కవేశ్వర్. లేచి నిల్చుని నిశ్శబ్దంగా అడుగులేసుకుంటూ అతని దగ్గరగా వచ్చి నిలబడి పెన్ను తీసుకుని మంచంపై పడేసింది.

“ప్రత్యేకంగా పెన్ను పట్టుకు రాసేంత ఆసక్తిగా మా బతుకులుండవులే సారు. ఈ ప్రపంచంలో మన దగ్గర లేనిది మనక్కావాలంటే, మన దగ్గరున్నది మనం అమ్ముకోక తప్పదు! కూడుకీ, మా కడుపుకీ మధ్య దూరం ఆరంగుళాలు. మా శరీరం మీ ఆహారం, మీ ఆయాసం మా ఆకలి తీర్చుకునే ఆధారం.” చెప్పింది.

కాసేపటికి కథ ముగిసింది. కొత్తగా ఏం లేదు.

వారం దాటింది!

సేమ్ రూమ్. సేమ్ ప్రమీల. సేమ్ కవేశ్వర్.

వీక్లీ పుస్తకం తీసి ప్రమీల ఒళ్ళో కొట్టి, ప్రమీల తొడపై భుజం మోపి గర్వంగా పడుకున్నాడు.

రెండు పేజీలు తిప్పింది.

‘కన్నీటితో తడిచిన కొంగు, మగాడి చేత్తో బరువెక్కిన రొమ్ము’

అని మూడో పేజీలో హెడ్డింగ్.

చదవబోయింది.

“ఇంకెంతసేపని చూస్తావ్, ఇటివ్” కసురుకున్నాడు కవేశ్వర్.

జాకెట్ తెగి నేలపై పడింది. రొమ్ము బరువెక్కింది. కొంగు తుడుచుకునేంత దగ్గరలో లేదు.

ఏ రాతలూ ఎవ్వరి బ్రతుకుల్నీ మార్చలేవు.

‘అక్షరాలను అమ్ముకోవడం కంటే అవయవాలను అమ్ముకోవడం పవిత్రమైన పని’

కామం రాజ్యమేలుతున్న ఆ చీకట్లో, శంఖం మ్రోగింది ప్రమీల మనసులోని మాటతో.

# అధర్మ చరిత్ర

నల్లబాటి రాఘవేంద్రరావు

✆ 9966212386

***పార్వతి అక్క పడిపోయి కనపడింది. అందరు కంగారుగా, ఆవిడని పట్టుకుని సపర్యలు చేస్తున్నారు. పరమేశ్వరం వాళ్ళ మాటలు వింటున్నాడే కానీ, వెనక్కి రాకుండా అలాగే నిలబడిపోయాడు.. ఆమె మీద పెంచుకున్న కోపం, ద్వేషం.. ఆతడ్ని కట్టిపడేశాయి.***

"పార్వతీ.. మీ నాన్నగారి మరణానికి మీ తమ్ముళ్ళే కారణమని, సరిగా చూడలేదని వాళ్లతో పోట్లాట వద్దు. ఆయనికి గుండెపోటు వచ్చి, వైద్యం అందే లోపల ప్రాణం పోయింది. ఎవరు ఏం చేయగలం చెప్పు! ఇప్పుడు మృత శరీరం కదిపే సమయంలో మీ తమ్ముళ్లను నిందించటం మంచిది కాదు!" అనునయిస్తూ అన్నాడు ఆమె భర్త పరమేశ్వరం.

''ఆ విషయం నాకు తెలుసు.. మీరూరుకోండి! గుండెపోటు వచ్చిన మనిషిని కుదుపు లేకుండా వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలన్న కనీసం జ్ఞానం వీళ్ళకి తెలియకపోతే ఎలా?' అంది కోపంగా.

"ఒక్కోసారి ఎంత ప్రయత్నించినా, దారిలో కూడా ప్రాణం పోవచ్చు'' భార్యను శాంతపరచడానికి అన్నాడు. ''ప్రయత్నం చేయాలండీ. ఆ సమయంలో దగ్గర ఉన్నవాళ్లే పేషెంట్ బాధ్యత వహించాలి. వీళ్లు ఆస్తి కొట్లాటతో, నాన్న బాధ్యతను గాలికి వదిలేసారు! నాన్నకు గుండెపోటు వచ్చిన ఆ సమయంలో, వాళ్ళు సరిగ్గా స్పందించలేదండి. ఆ ఆలస్యానికి నాన్న చచ్చిపోయాడు. నాన్న చావుకి నా తమ్ముళ్లు కారణం! నాన్నను చూశాను కదా, ఇక మనం వెళ్ళిపోదాం నడవండి!" అంది పార్వతి ఉగ్రరాలై ఊగిపోతూ.

"కడసారి చూపు కోసం వచ్చావు, ఓ గంటలో కార్యక్రమాలు ఎలాగూ అయిపోతాయి కదా.. ప్రశాంతపడు! మీ నాన్నగారి మృత శరీరాన్ని కదిపాక మనమూ వెళ్ళిపోదాం!'' భార్యను ఓదారుస్తూ అన్నాడు పరమేశ్వరం.

★★★

సంవత్సరం తర్వాత.

"పార్వతి! నేను నీకు ఇచ్చిన ఆ ఫోన్ నెంబర్ల చిన్ని పోకెట్ బుక్.. ఎక్కడ పెట్టావు?"

"దాని విషయం రోజు పదిసార్లు అడుగుతారు. అదేమైనా బంగారమా! బీరువాలో పట్టుచీరలు మధ్య జాగ్రత్త పెట్టాను.. ఇదిగో!" తీసి ఇస్తూ, పార్వతే మళ్ళీ అంది.. "మీ స్నేహితులందరికీ ఏ కష్టం వచ్చిన సహాయం చేస్తారు... డబ్బులు కూడా అడిగి వాళ్ళకి ఇస్తారు...?"

భార్య మాటలు వింటూనే "ఇన్ని డబ్బులతో ఏం చేసుకుంటాం చెప్పు! మన హితుల గురించి డబ్బు ఖర్చుపెడితే తప్పేముంది. నాకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే నువ్వు ఎవరిని పిలుస్తావు... నా మిత్రులనే కదా... క్షణంలో వచ్చి వాలుతున్నారు! అలా

నీకు అలవాటు చేశాను! సంవత్సరం క్రితం మీ నాన్న గుండె పోటుతో చనిపోతే సరిగ్గా స్పందించలేదని మీ తమ్ముళ్లని నిందించావు. అలాంటి ఇబ్బంది ఎవరికి రాకూడదని, వెంటనే స్పందించే రక్షకుల్ని నేనిప్పుడు తయారు చేస్తున్నాను! వాళ్ళందరికీ అవగాహన కల్పిస్తున్నాను. అందులో నువ్వు కూడా!" అన్నాడు.

"ఆరోగ్యం గురించి మీరు చెప్పేవన్నీ బాగానే ఉంటాయి.. ప్రశాంత జీవనమే ఆరోగ్యానికి మంచిదని అంటారు! అంటారు. కానీ మన ఇంటి పక్కల వాళ్లతో నాకు ఏమాత్రం ప్రశాంతత లేదు. వాళ్లతో సర్దుకుపోవడం నా వల్ల కావడం లేదు!" ముఖం చిరాకుగా పెడుతూ అంది పార్వతి.

"నిజమే నీవల్ల ఏమీ కాదేమో అనిపిస్తుంది! లేకుంటే ఫోన్ నెంబర్ల పాకెట్ బుక్ చూడు బల్లకింద ఎలా పడేసావో... మొబైల్



అలవాటు చేసుకోవు, ఆ ల్యాండ్‌లైన్ చాలు అంటావు! మొబైల్ అయితే ఫోన్ నెంబర్లు అన్ని ఫీడ్ చేసుకోవచ్చు... ఈ పాకెట్ పుస్తకంలో రాసుకోవలసిన అవసరం ఉండదు! ప్రపంచం చాలా మారిపోయింది పార్వతి... ఏమీ తెలియనివాళ్ళు కూడా అన్ని రంగాల్లో కనీస పరిజ్ఞానం సంపాదించుకుంటున్నారు. నువ్వు మాత్రం...!" భార్యకి సెల్‌ఫోన్ అలవాటు చేయాలనే ప్రయత్నంలో అన్నాడు పరమేశ్వరం.

అలా అతను నిత్యం చెబుతూనే ఉంటాడు. 'నాకు అన్నీ తెలుసు' అంటూ పార్వతి అంటూనే ఉంది.

★★★

ఆరోజు ఆదివారం..

పరమేశ్వరం తన ఇంట్లో డ్రాయింగ్ రూములో స్నేహితులతో కూర్చున్నాడు.

"గుండెపోటును ముందుగా గుర్తించడం ఎలా?'' శీర్షికతో ఉన్న చిన్న పుస్తకాలు వాళ్ళందరికీ పంచి, భార్యకు కూడా ఒకటి ఇచ్చి చదవమన్నాడు. 'ఇదంతా నాకు తెలుసున్నదేగా...' అన్నట్టు చూసి, ఆమె పుస్తకం పట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"వినండి ఫ్రెండ్స్! అసలు గుండెపోటు వచ్చిన వాళ్లలో నూటికి డెబ్బై మంది, వాళ్ల పక్కన ఉన్నవాళ్ళు చేసే ఆలస్యం వల్లనే చనిపోతున్నారు. ఆ గోల్డెన్ మినట్స్ గురించి అవగాహన ఉండడంలేదు! ఏభై దాటిన ప్రతి వ్యక్తి ఎక్కువ శ్రమ పడకూడదు. ఉద్వేగానికి, ఉద్రేకానికి అసలు లోనుకాకూడదు. మానసిక ఆలోచనలు, ఒత్తిడి పనికిరావు. ఇవన్నీ గుండె కొట్టుకునే విధానాన్ని మార్చి పడేస్తాయి. అది గుండెపోటుకి దారి తీస్తుంది! ఇది గుర్తు పెట్టుకుని, మన కుటుంబంలో వ్యక్తులు పట్ల కూడా మనం తగు జాగ్రత్తగా మెలగవలసి ఉంది!" పరమేశ్వరం అలా అన్ని విషయాల గురించి మాట్లాడి ముగించాడు. అలా వాళ్ళందరూ కలిసిన ప్రతిసారి ఈ విషయాన్ని ఒక పాఠంలా చెప్పుకోవడం అలవాటు.

"ఇవన్నీ నువ్వు వింటున్నావు కదా నీకు అర్థం అవుతున్నాయి కదా!" అంటూ భార్యను మధ్య మధ్యలో అడుగుతుంటాడు పరమేశ్వరం. ఆవిడ బిస్కెట్లు టీ అందిస్తూ.. "ప్రతిసారి చెప్పినవే చెప్పుకుంటూ వస్తున్నారు కదా... ఎలా మర్చిపోతాం నాకు అన్నీ తెలుసు!" అంటూ మళ్ళీ వంటింట్లోకి వెళ్లి పోతుంటుంది.

అప్పుడప్పుడు వాళ్ళందరికీ దగ్గరగా ఉండే డాక్టర్ ఏకాంబరంతో మాట్లాడిస్తూ, అతను ఎలాంటి సమయంలోనైనా అందుబాటులో ఉండేటట్టు ఏర్పాటు కూడా చేశాడు పరమేశ్వరం.

"ఈ గుండె సమస్య విషయంలో ఏదో మన జాగ్రత్తలో మనం ఉందాం... అంత వరకే. ఒకవేళ నాకే గనుక ఇప్పుడే గుండెపోటు వచ్చేస్తే మీరు ఏం చేస్తారు?'' చిలిపిగా అడిగినట్లు ప్రశ్నించింది ఓరోజు పార్వతి.

'పార్వతీ బాగా అడిగావు! ఎవరికైనా రావచ్చు. ఒక మాట... నేను ఏ పరిస్థితుల్లోనూ నీకు గుండెపోటు వచ్చే పరిస్థితి తీసుకురాను! అంత అవగాహన పెంచుకున్నాను నేను! నీ గుండె లయకు భంగం కలిగించే, ఏ కఠిన చర్య తీసుకోను.. అలా ప్రతి నిమిషం నీ పట్ల అలా ప్రవర్తించడానికి నేను ప్రయత్నిస్తూ ఉంటాను! ఒకవేళ నేను చేసే చర్యలవల్ల నీకు కోపం వచ్చి ఉద్వేగం, ఉద్రేకం వచ్చే పరిస్థితి అంటూ ఏర్పడితే.. నీకు నిజంగా గుండెపోటు వస్తే, నా గుండె నీకు ఇచ్చి బ్రతికిస్తాను. తెలిసిందా!" పరమేశ్వరం నవ్వుతూ అన్నాడు.

★★★

ఆరోజు ఉదయం పరమేశ్వరం తన రూమ్‌లో నడుస్తూ పడిపోయాడు. పక్కనే ఉన్న పార్వతి ఒక్కసారిగా కంగారు పడిపోయింది. భర్తను అతి కష్టం మీద లేవదీసి మంచం మీద పడుకోబెట్టింది.

"ఏవండీ ఏమైందండీ?" ఆత్రుతగా అడిగింది.

"వచ్చే..సింది రాకూడదు.. అనుకున్న గుండె.. వచ్చేసింది. పా..ర్వతి.. గుండెలో అదేదోలాగుంది. మెలి పెడుతుంది. ఊ.. ఊపిర... నువ్వు ప్రయత్నం... చెయ్ ఫోన్..."

"గుండెపోటా.. మీకా.. పనివాళ్ళు అందరూ వెళ్ళిపోయారు. ఇప్పుడేం చేయను భగవంతుడా! మీరు కంగారు పడకండి... డాక్టర్ గారికి, మీ ఫ్రెండ్స్, డ్రైవర్లకు, పనివాళ్లకు ఫోన్లు చేస్తాను!" అంటూ పార్వతి కంగారుగా ఫోన్ నెంబర్ పాకెట్ బుక్కు కోసం బీరువా తెరిచింది. పట్టుచీరలన్నీ పైకెత్తి చూసింది. కంగారులో చీరలన్ని కింద పడిపోయాయి. బుక్కు ఎంత వెతికినా కనిపించలేదు.

"అయ్యో.. రోజు కనిపించే బుక్.. ఈరోజు కనిపించడం లేదు.. ఎలారా భగవంతుడా!" మనసులో గొణుక్కుంది.

ఆమెలో అసహనం పెరిగిపోతుంది. అప్పటికే పావుగంట గడిచిపోయింది! బెడ్ మీద ఉన్న పరమేశ్వరం గుండెల మీద చేత్తో రుద్దుకుంటూ, మెలి తిరిగిపోతూ నిస్సహాయంగా ఉన్న పార్వతి వైపు, బేలగా చూస్తున్నాడు.

పార్వతికి ఫోన్ నెంబర్ల పాకెట్ బుక్ మాత్రమే కాదు, కనీసం ఎమర్జెన్సీ టాబ్లెట్స్ ఉన్న చిన్ని కవర్ తీద్దామన్నా, అది కూడా బట్టలలో ఎక్కడో కలిసిపోయి కనిపించడం లేదు. ఆమె చేతులు వణుకుతూ, ఏడుస్తూ, ఇంకా వెతకడానికి ప్రయత్నం చేస్తూ పిచ్చిదానిలా, జుట్టు పీక్కుంటూ నేలమీద కూలబడిపోయింది.

అప్పటికే పరమేశ్వరం మంచం మీద ఇబ్బబంది పడుతూ. ముప్పావు గంట గడిచిపోయింది! నోట మాట రావడం లేదు, చేత్తో గుండె రుద్దుకుందామన్న చెయ్యి సహకరించడం లేదు. మరో చేత్తో తడిమి తడిమీ, అతి కష్టం మీద బల్ల మీద ఉన్న సెల్ఫోన్ అందుకున్నాడు. ఏదో నెంబర్ నొక్కేశాడు ఆ నెంబర్ డాక్టర్ ఏకాంబరం గారిదే.

డాక్టర్ ఏకాంబరంగారు తనకు కాల్ వచ్చింది పరమేశ్వరంగారి నుండి అని గ్రహించి.. ఫోన్లో మాట వినబడక పోవడంతో, కంగారుపడి వెంటనే వచ్చి, తన కారులో పరమేశ్వరాన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

డాక్టర్ చాలాసేపటికి ఎమర్జెన్సీ రూమ్లో నుంచి బయటకు వచ్చాడు.

"పార్వతి గారు మీరు అదృష్టవంతులు. పరమేశ్వరంగారిది గుండెదడతో కూడిన గుండెనొప్పి మాత్రమే. గుండెపోటు కాదు! ఆందోళన అధికమైనా, రక్తహీనత ఉన్న... ఇంకా చాలా కారణాల వల్ల ఇలా రావచ్చు. పరీక్షలన్నీ పూర్తయ్యాయి నెమ్మదిగా క్రమం తప్పకుండా వైద్యం చేయించుకోవడం అత్యవసరం! ఆయనను ప్రశాంతంగా పడుకోనివ్వండి. మరేం ఫరవాలేదు, ఈ రాత్రికి మీరు పరమేశ్వరంగారిని ఇంటికి తీసుకెళ్ళి పోవచ్చు కూడా! నిజంగా గుండెపోటయితే, మా వైద్యం అందే సమయానికి గంటన్నర ఆలస్యం అయ్యింది చాలా ప్రమాదం సంభవించేది!" అని చెప్పి, ఆయన లోపలకు వెళ్లిపోయాడు.

లోపలికి వెళ్ళిన పార్వతి భర్త కాళ్ల దగ్గర కూర్చుని, మంగళసూత్రాలు కళ్లకు హత్తుకుంటూనే ఉంది. కొంచెం కుదుటపడిన పరమేశ్వరం ఆమె ప్రవర్తన చూసి నవ్వుకున్నాడు.

ఆ రాత్రి ఇంటికి వచ్చేసారు.

ఆ మర్నాడు ఉదయమే పరమేశ్వరం ఇంటికి స్నేహితులందరూ మళ్ళీ వచ్చారు. అప్పటికే పరమేశ్వరం సూట్ కేస్‌లో బట్టలు సర్దుకుని, ఎక్కడికో వెళ్ళే హడావిడిలో ఉన్నాడు।

"అమ్మయ్య వచ్చేసారా.. మీరొస్తారు నాకు తెలుసు! నిన్న మీకు నా కబురు అంది ఉంటే, ఆ సమయంలోనే రెక్కలు కట్టుకొని రెండు నిమిషాలలో వచ్చి ఉండేవారు. మీరందరూ విశ్వాసపాత్రులే కాదనను..।" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు పరమేశ్వరం.

"సార్! అది సరే.. రాత్రే కదా హాస్పిటల్ నుండి వచ్చారు. ఈ అనారోగ్యంతో ఎక్కడికి మీ ప్రయాణం? మీరు కొన్నాళ్లు రెస్ట్ తీసుకోవాలని డాక్టర్ గారు చెప్పారు కదా!" ఓ మిత్రుడు అడిగాడు.

అంతలో అక్కడికి పార్వతి వచ్చి.. "అన్నయ్యగారు మీరైన చెప్పండి!" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"పార్వతి... ఏడవకు. చావడానికి మాత్రం కాదు. ఈ దేశంలో హృద్రోగిని కానీ, ఇతర రోగిని కానీ... బాధ్యతతో తపనతో మరునిమిషం వైద్యుని దగ్గరకు తీసుకెళ్ళ గలిగే సహచరులు ఉన్న ఆశ్రమాలు, సంస్థలు, శిబిరాలు చాలా ఉన్నాయి. ఎక్కడో చోట బ్రతికేస్తాను. లేదా.. అప్పుడు చచ్చిపోతాను. అంతేకానీ భర్తకు అన్యాయం చేసిన నీలాంటి భార్య దగ్గర ఉండలేను! కోట్ల విలువ ఉండే ఆస్తంతా నువ్వే సంరక్షించుకో... లేదా దానధర్మాలు చేసుకో. అదీ కాదంటే నీ సంతానానికి ధారపోసుకో. అంతా నీ ఇష్టం. నీకు సర్వహక్కులు సంక్రమించేలా, నీ మాట చెల్లుబాటు అయ్యేలా, కాగితాలు రాశాను!ఇదిగో.. " అంటూ చేతిలో ఉన్న కాగితాలను, బల్ల మీద పెట్టేడు పరమేశ్వరం.

"ఏమండీ తప్పు చేశానండి!" కుంచించుకుపోతూ గుండె లయ తప్పుతున్నట్టుగా నీరసపడిపోతూ అంది పార్వతి.

అక్కడే ఉన్న వాళ్ళందరికీ విషయం అర్థం అయిపోయింది.

వాళ్ళలో ఒకాయన పరమేశ్వరంగారి దగ్గరికి వచ్చి, భుజం మీద చెయ్యి వేసి, "పార్వతిగారు పెద్ద తప్పు ఏం చేసారండి! ఆ చిన్న తప్పు కూడా పాపం ఒప్పుకుంటున్నారు కదా! ఇది చాలా చిన్న విషయం. అన్ని తెలుసుండి కూడా మీరు ఇంకా పెద్దతప్పు చేస్తున్నారేమో! ఈ వయసులో ఆవిడని ఇబ్బంది పెట్టి, హృదయక్షోభ, ఉద్వేగాలు కలిగించడం అంత మంచిది కాదేమో! మానసిక ప్రశాంతతత గురించి మనం ఎన్నోసార్లు చెప్పుకున్నాం కదా... అవన్నీ గుర్తు చేసుకోండి! మీరు చేస్తున్నది మంచి పనికాదు!" అన్నారు.

"దయచేసి మీరెవరు మాట్లాడవద్దు! భార్యలకు భరోసా భర్తలు. మరి భర్తలకు..? వారి ఆరోగ్య రక్షణకు భరోసా, బాధ్యత భార్యలే తీసుకోవాలి కదా! అలా మనసులో అనుకొని సమయం వచ్చినప్పుడు, ఆ భార్యలు స్పందించక పోతారా.. అన్న ధైర్యంతో బ్రతికేస్తుంటాడు ప్రతి భర్త! కానీ నా భార్య అసమర్థురాలు. రోజూ అన్ని విషయాలు చెపుతున్నా, నిర్లక్ష్యంతో పట్టించుకోలేదు! ఇంత అసమర్ధురాలైన భార్య దొరకడం నా ఖర్మ! ఇక నా నిర్ణయం తిరుగులేనిది. దయచేసి మీరెవరు మాట్లాడకండి!" అంటూ పరమేశ్వరం వెనుకకు తిరిగి చూసే ప్రయత్నం చేయకుండా, ఇంట్లో నుంచి బయటకు అడుగు వేశాడు.

పరమేశ్వరం నిశ్చయంతో వేసిన ఆ అడుగుతో, స్నేహితులందరికి నోటంట మాటలే రాలేదు!

"ఏవండీ ఏవండీ ఏవండీ.. నన్ను క్షమించరా?" ఆవేదనతో అంటూ, బిగ్గరగా ఏడుస్తూ ఒక్క పరుగున పరుగెత్తి, భర్తకి ఎదురుగా వెళ్ళింది.

పరమేశ్వరం ఆమెని పక్కకు నెట్టి, ముందుకు వెళ్ళాడు. కాస్త దూరం అతను నడిచేసరికి, వెనక నుండి స్నేహితుల కంగారు అరుపులకు, అతను ఆగి వెనక్కి చూశాడు.

పార్వతి అక్కడ పడిపోయి కనపడింది. అందరు కంగారుగా, ఆవిడకి సపర్యలు చేస్తున్నారు.

పరమేశ్వరం వాళ్ళ మాటలు వింటున్నాడే కానీ, వెనక్కి రాకుండా అలాగే నిలబడిపోయాడు.. ఆమె మీద పెంచుకున్న కోపం, ద్వేషం.. ఆతడ్ని కట్టిపడిశాయి.

"ఇప్పుడు ఆవిడకు అత్యవసర వైద్యంతో పాటు మీ ఆండ అవసరం సార్! మీ పట్టుదలను పక్కన పెట్టండి సార్!" అంటూ కోరారు, పరమేశ్వరం దగ్గరకు వెళ్ళి బతిమలాడారు! చివరికి బలవంతంగానే ఆయన్ని తీసుకు వచ్చారు. అప్పటికే సమయం పది నిమిషాలు గడిచిపోయింది.

ఇంతలో కబురు అందిన డాక్టర్ ఏకాంబరం వచ్చి ఆమెను పరీక్షించాడు. అతను పెదవి విరిచి "సారి పరమేశ్వరం గారు!" అంటూ పక్కకు జరిగాడు.

ఈ హఠాత్పరిణామానికి కొంచెంసేపు తన శరీరంలో రక్తప్రసరణ ఆగిపోయిన వాడిలా అయిపోయిడు పరమేశ్వరం. కళ్ళల్లోంచి కన్నీటిధారలు కారుతుండగా భార్య మృత శరీరం దగ్గరకు వచ్చి ఆమెపై పడ్డాడు గట్టిగా రోదిస్తూ.

"పార్వతీ.. నా కోపం, పట్టుదలతో నేనే నీ ప్రాణాన్ని హరింపచేశాను. ఇలా జరుగుతుందని ఊహించలేకపోయాను. నేను తెలివైన మూర్ఖుడిని. నీచుడుని, ద్రోహిని! గుండెపోటు రక్షణ పట్ల నువ్వు కాదు... నేనే నిజమైన అసమర్ధుడిని! నువ్వు నా పట్ల చేసింది నేను క్షమించరాని తప్పు అన్నాను. కానీ నేను నీ పట్ల చేసింది క్షమించకూడని నేరం! విచక్షణ కోల్పోయి, నీ సున్నితమైన హృదయ గమనాన్ని వక్రరీతిలో చలించిపోయేలా చేశాను! నువ్వు నమ్ముకున్న నీ భర్త నిన్ను చంపేశాడు. నీ రక్షణ కవచమే నిన్ను చంపేసింది. నన్ను క్షమించకు పార్వతీ!" అంటూ.. భార్య శవంపై పడి, ఆమె చేతులతో తన చెంపలపై కొట్టుకుంటూ, ఆమె మీదకు ఒరిగిపోయాడు పరమేశ్వరం!

# రాలిపడ్డ పువ్వు

బలభద్రపాత్రుని ఉదయ శంకర్
✆ 9494536524

*నీలో ఇంకా విచక్షణా జ్ఞానం ఉంది కనుకనే ఆలస్యంగానైనా కళ్ళు తెరిచావు.
ఇక నీ నాట్య కౌశలాన్ని మన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించటానికి ఉపయోగించు.
కళ మనుషుల్లోని కుళ్ళుని కడిగి మానవత్వాన్ని పెంచుతుంది!"*

ఆ తోటంతా చిందరవందరగా ఉంది. దాపున ఉన్న కొలను కన్నీటి మడుగులా ఉంది. వాడిపోయిన పూల తీగలు, యవ్వనం కోల్పోయిన స్త్రీలకి ప్రతీకలుగా ఉన్నాయి. ఆకులు రాలిన చెట్లు, శిశిరం చెక్కిన దారు శిల్పాల్లా గోచరిస్తున్నాయి.

నేను దేశాంతరం వెళ్ళొచ్చిన ఈ నెల రోజుల్లో, కంచె లేని తోటను అడవి దున్నలు ఛిద్రం చేసినట్లున్నాయి. నేను నా నిర్లక్ష్యానికి చింతిస్తుంటే "గాలి వీచి పువ్వుల తీగ నేల వాలిపోగా, జాలి వీడి అటులే దాని వదిలివైతువా" అంటూ ఎక్కడి నుంచో శ్రీశ్రీ ఆవేదన ఘంటసాల స్వరంలో శ్రవణేంద్రియాలను తాకి గుండెని పిండేసింది.

తక్షణమే నేను కర్తవ్యోన్ముఖుడినై, ఒక్కొక్క తీగను సుతారంగా తీసి పందిరి వేశాను. పాదులు చేసి, నీళ్ళు చిలకరించాను. కొలను నుంచి పిల్ల కాలువలు త్రవ్వి జలహారం వేశాను. వారం రోజుల్లోనే తోటంతా పచ్చగా కళకళలాడింది. ఆ సౌందర్యాన్ని కాన్వాసుపై చిత్రించి సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను.

అక్కడి గాలి పూల పరిమళాలతో నన్ను ఆప్యాయంగా తడుముతుంటే వళ్ళు పులకలు రేగింది. 'ఇప్పటికి నా జన్మ ధన్యమైంది' అని ఆనందిస్తుంటే, "ఇంత మాత్రానికే పొంగిపోకు నేస్తం!" అన్నది నా అంతరాత్మ. "ఇంతకన్నా ఎవరైనా ఏం చేయగలరో చెప్పు" అంటూ అంతరాత్మని నిలదీశాను. జవాబు లేదు.

అశాంతితో అంతరాంతరాలలో నిక్షిప్తమైన జ్ఞాపకాల్ని వెలికి తీసి, కుంచె అందుకున్నాను. కాళ్ళకి గజ్జెలు కట్టి, శరీరం కింది భాగం పట్టుచీర, పైన టీషర్ట్ ధరించి ఒక చేతిలో సిగరెట్, మరో చేతిలో విస్కీ గ్లాసు పట్టుకుని ఉన్మాదంగా ఊగిపోతున్న వనిత బొమ్మని చిత్రించాను. మతి చలించినట్లున్న నా విపరీత ధోరణికి, నాకే చిరాకొచ్చింది. ఇంతలో కొలనులో ఏదో పడినట్లు భళ్ళున శబ్దం వచ్చింది. కొలను దగ్గరకి పరిగెత్తాను.

అల్లకల్లోలంగా కదులుతున్న నీటి అలలపై ఒక చీర చెంగు కనిపించింది. తక్షణం కొలనులోకి దూకి, మునిగి పోతున్న ఆ స్త్రీని ఒడ్డుకి చేర్చాను.

ఆమె కాసేపటికి తెప్పరిల్లి నా వంక చూసి, అవమాన భారంతో తల దించుకుని "నన్నెందుకు బతికించావు మధూ?" అంటూ రోదించింది.

నన్ను పేరు పెట్టి పిలిచిన ఆ అభాగ్యురాలిని తేరిపార చూశాను. ఆమె.... కుసుమ! కాలేజీలో ఉన్నప్పుడు నన్ను ఒక

ఛాందసుడిగా హేళన చేసి, నాకు దూరమైన ఒకప్పటి నా ప్రియురాలు. కుసుమ తాలూకు జ్ఞాపకాలు నా మనోఫలకంపై తళుక్కున మెరిసాయి.

★★★

రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత శోభాయమానంగా జరుగుతున్నాయి. వేదిక మీద ప్రదర్శించబడుతున్న కూచిపూడి భామాకలాపం నృత్య నాటికను మైమరచి తిలకిస్తున్నారు ప్రేక్షకులు.

ఒక మహాశిల్పి అద్భుతంగా తీర్చిదిద్దిన శిల్పంలా ఉన్న ఆ నర్తకి పేరు కుసుమ అని కరపత్రంలో చూశాను. కళాసరస్వతికి నీరాజనం పడుతున్న ఆమెని చూడగానే నాలోని చిత్రకారుడు చెలరేగిపోయాడు. వారం రోజుల్లో ఆమె తైలవర్ణ చిత్రం వేశాను.



ఆ పెయింటింగ్ తీసుకుని ఆమె ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. గుమ్మం దగ్గర గులాబీ రంగు శాటిన్ గౌన్‌లో దొరసానిలా ఎదురైన అమ్మాయిని చూసి "కూచిపూడి డాన్సర్ కుసుమ?" అన్నాను సందేహిస్తూ. ఆమె నవ్వి "నేనే కుసుమని. ఏం కావాలి?" అన్నది వీణ మీటినట్లు.

ఆమె వంక ఆరాధనగా చూస్తూ "రామాలయంలో మీ నాట్యం చూసి అభినందించాలని వచ్చాను!" అని నేను వేసిన చిత్రం ఆమెకి బహూకరించాను. ఆమె వెన్నెలలా నవ్వి "ఎంత అందంగా ఉంది...!" అంటూ తన చిత్రాన్ని గుండెలకి హత్తుకుంది. అలా మొదలైన మా పరిచయం ఆమె మా కాలేజీలో చేరగానే స్నేహంగా మారింది.

వేదిక మీద గొప్పగా శాస్త్రీయ నృత్యం చేసే కుసుమ, కాలేజీకి బిగుతుగా ఉండే జీన్స్, టాప్ ధరించి వచ్చేది. ఒక్కోసారి మోకాళ్ళ పైకి ఉండే షార్ట్‌లు, స్కర్టులు వేసి పిచ్చెక్కించేది. "క్లాసికల్ డాన్స్ చేసే నీకు మోడ్రన్ డ్రెస్సు నప్పదు" అన్నాను ఒకసారి మొహమాటం లేకుండా.

ఆమె నన్ను ఒక వింత జంతువుని చూసినట్లు చూసి "నువ్వు ఏ కాలంలో ఉన్నావు మహాశయా? జీన్స్, టాప్ వదిలేసి ఈ వయసులో ఎనిమిది గజాల చీర కాశపోసి కట్టుకుని కాలేజీకి రమ్మంటావా?" అంటూ నవ్వింది.

ఆమె నవ్వు చిరాకు తెప్పించింది. "మరీ అంతొద్దు కానీ, ఆరు గజాల చీర... లేదా లంగా ఓణీ!" అన్నాను. తన జీన్స్ టాప్

చూపిస్తూ "ఇవైతే నాకు కంఫర్టబుల్‌గా ఉంటుంది" అని నవ్వి "లంగా ఓణీలో నా అందాలన్నీ కళ్ళతో జుర్రుకోవచ్చని నీ ఆశ కదూ!" అన్నది చిలిపిగా.

కుసుమ మా కాలేజీలో అబ్బాయిలు ఎవరు పిలిచినా వాళ్ళతో సినిమాలు, షికార్లకు నిస్సంకోచంగా వెళ్ళేది.

ఆమె అలా వెళ్ళటం నాకు నచ్చేది కాదు. సూటిగా అడిగితే ఈర్ష్య అనుకుంటుందని "ఇంట్లో నీకు స్వేచ్ఛ ఎక్కువ ఇచ్చారనుకుంటా!" అన్నాను ఒకసారి నర్మగర్భంగా.

తన వంటికి అతుక్కుపోయిన టీషర్టుని ముందుకి లాగి వదిలి "ఇదిగో బంధిస్తే ఇలాగే ఉంటుంది. లోపలే మగ్గి చావాలి. స్వేచ్ఛ అనేది ఒకళ్ళు ఇచ్చేది కాదు. మనమే తీసుకోవాలి" అని నవ్వింది. కాసేపట్లో ఆమె మొహంలో నవ్వు మాయమై విషాదం తొంగి చూసింది. "అయినా మా వాళ్ళకి నన్ను పట్టించుకునే ఓపిక, తీరిక ఎక్కడివి? మమ్మీ బ్యూటీ పార్లర్లో బిజీగా ఉంటుంది. డాడీనేమో ఎప్పుడు చూసినా బిజినెస్ అంటాడు!" అన్నది.

కుసుమ నాట్యం చూసి ఆమెకు సినిమాలో హీరోయిన్ అవకాశం ఇచ్చాడు ఓ దర్శకుడు. ఆ సినిమా సక్సెస్ కావటంతో వరుస అవకాశాలు వచ్చాయి. ఆమె మకాం భాగ్యనగరానికి మారింది. ఆమె బలహీనతలు తెలుసు కనుక "అదొక రంగుల వలయం. అందులో చిక్కుకోకు!" అన్నాను చిన్న హెచ్చరికలా.

ఆమె గుండెల మీద చెయ్యి పెట్టుకొని "నా మనసులో ఎలాంటి చెడు ఆలోచనలు ఉండవు, కాబట్టి నా జోలికి ఎవరూ రారు. నువ్వు నిశ్చింతగా ఉండు!" అన్నది.

కుసుమని చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. "ఈ ఉదాసీనత వల్లే కొన్ని వందల ఏళ్ళుగా మన దేశం తన అస్తిత్వాన్ని కోల్పోతూ వచ్చింది. దానికి నువ్వే సజీవ సాక్ష్యం. ఎంతసేపూ మనం స్వచ్ఛంగా ఉన్నామని సంబరపడటమే కానీ, ఎదుటి వారి మనసులో ఉన్న కుట్రను గ్రహించలేకపోతున్నాం!" అన్నాను అసహనంగా.

నా వాదనను కొట్టిపారేస్తూ "ఊరుకోవయ్యా మగడా! మరీ ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకోకు. నిన్నటి రోజుని ఒక కలగా మర్చిపో. ఎలా ఉంటుందో తెలియని రేపటి రోజుని అస్సలు ఊహించకు. ఈరోజు మాత్రమే సత్యం. హాయిగా అనుభవించు!" అన్నది.

ఒకే హీరోతో కుసుమ నటించిన మూడు సినిమాలు హిట్ కావటంతో ఆమెపై గాసిప్స్ రావటం మొదలైంది. షూటింగ్ నిమిత్తం వైజాగ్ వచ్చిందని తెలిసి, ఆమె బస చేస్తున్న హోటల్‌కి వెళ్ళాను. నన్ను బాగానే రిసీవ్ చేసుకుంది. స్కాచ్ విస్కీ రెండు గ్లాసులో పోసి, ఒకటి తను తీసుకొని రెండోది నాకు ఇచ్చింది.

ఆమె వంక సూటిగా చూసి "నిజం చెప్పు. నువ్వు ఇంకా నన్ను ప్రేమిస్తున్నావా?" అని అడిగాను. ఆమె మూత పడుతున్న కనురెప్పలను బరువుగా పైకిలేపి, కైపుగా చూస్తూ "అదేంటి బాసూ? అలా అడిగావు? ఎందుకు వచ్చింది ఆ డౌటు?" అన్నది ముద్దగా.

ఆమె వంటిపై ఉన్న షర్ట్ గుండీలు ఊడిపోయి ఛాతీ సగం కనిపిస్తోంది. ఆమె అందాలను చూసి ఆనందించే స్థితిలో నేను లేను. "నన్ను ప్రేమించే దానివైతే ఎవడితో పడితే వాడితో బెడ్రూమ్ సీన్లలో లీనమై నటించటం ఏంటి?" అన్నాను ఉక్రోషంతో.

కుసుమ నవ్వుతూ “అదా నీ కడుపు మంట! అదంతా నటనలో భాగమే! వాళ్ళెవర్నీ పెళ్ళి చేసుకోన్లే. నువ్వేం భయపడకు! ఎప్పటికైనా నువ్వే నా ప్రియుడివి, నాకు కాబోయే మొగుడివి!” అని నా పెదాలపై గాఢంగా ముద్దు పెట్టి, నన్ను అదో రకమైన మత్తులోకి తోసేసింది.

కొంతసేపటి వరకు ఆ మైకంలోనే ఉన్నాను. కాసేపటికి తేరుకుని “నీకు ఎన్ని బలహీనతలున్నా అంగీకరించే విశాల హృదయం నాకుంది. కానీ ఒక శాస్త్రీయ నృత్య కళాకారిణి నటన పేరుతో బరితెగించటాన్ని ఈ సంఘం ఆమోదించదు!” అన్నాను.

అంత మత్తులో ఉండి కూడా ఆమె తన మనసులోని మాట స్పష్టంగానే చెప్పింది. “ఈ సెంటిమెంట్లు నాకు నచ్చవు బాసూ! నాకు ఇలా ఉండటమే ఇష్టం. అలాగని నన్ను కారెక్టర్ లేని దాన్ని అనుకోకు. నేను తప్పు చేయనంత వరకు ఈ సంఘానికి భయపడను!” అన్నది.

తన విశృంఖలత్వాన్ని నిస్సిగ్గుగా సమర్ధించుకుంటున్న కుసుమను చూస్తే ఏవగింపు కలిగినా సాధ్యమైనంత సహనం వహించి “నిజాయితీగా ఉంటేనే చాలదు. అది మన ప్రవర్తనలోనూ కనిపించాలి. మన హావభావాలు ఎదుటి వారికి తప్పుడు సంకేతాలు పంపేలా ఉండకూడదు” అని హెచ్చరించాను.

ఆమె ఏమనుకుందో ఏమో, కొద్ది క్షణాల మౌనం తర్వాత “ఒక్క విషయం గుర్తుంచుకో మధూ! నువ్వు అన్నట్లు నా ప్రవర్తన వల్ల నా శీలమే పోయే పరిస్థితి వస్తే, నేను జీవించి ఉండను!” అని బెడ్ మీద వాలిపోయింది. అదే నేను కుసుమను ఆఖరిసారిగా కలిసి మాట్లాడటం!

★★★

మళ్ళీ ఐదేళ్ళ తర్వాత ఆమెనిలా చూడాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. లేచి వెళ్ళటానికి సమాయత్తం అవుతున్న కుసుమ చెయ్యి పట్టుకొని ఆపి “నీకు అభ్యంతరం లేకపోతే, ఇంత తీవ్రమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నావో తెలుసుకోవచ్చా?” అన్నాను.

ఆమె శూన్యంలోకి చూస్తూ “నిన్న జరిగిన పార్టీలో మత్తు మందిచ్చి నా సర్వస్వం దోచుకున్నాడు ఒక నీచుడు. ఇప్పుడు నేను అశుద్ధం మీద రాలిన పువ్వుని! ఇన్నాళ్ళు నా హద్దుల్లో నేను పవిత్రంగా ఉన్నానని భ్రమ పడ్డానే కానీ, చుట్టూ ఉన్న తోడేళ్ళ కుట్రలని గ్రహించలేక పోయాను. ఇప్పుడు మైల పడ్డ దేహంతో ఈ లోకంలో పవిత్రురాలిగా ఎలా జీవించగలను?”అన్నది కన్నీళ్ళతో.

నేను ఆమె కళ్ళు తుడిచి “నువ్వంటే కేవలం నీ దేహం మాత్రమే కాదు. అసలైన ‘నువ్వు’ నీలో ఉన్న నీ అంతరాత్మ! నీ ప్రమేయం లేకుండా నీ దేహానికి అంటిన మలినం అంతరాత్మను అపవిత్రం చేయలేదు!” అన్నాను ఒక వేదాంతిలా.

నేను వేసిన చిత్రం వంక చూస్తూ “ఇది నా బొమ్మే కదూ! నా అంతరంగాన్ని ఎంత చక్కగా చిత్రించావు!? నిజమే! మన సంస్కృతి పట్ల గౌరవం మనసులో దాచుకున్నాను కానీ, దాన్ని మాటల్లో, చేతల్లో చూపలేక పోయాను!” అని నిర్వేదంగా నవ్వింది.

నేను అసంకల్పితంగా వేసిన చిత్రాన్ని ఆమె సరిగ్గా అర్థం చేసుకున్నట్లుంది. నా తల నిమురుతూ “నా మీద ప్రేమ కొద్దీ అలా అంటావు కానీ నా ప్రమేయం లేకపోవటం ఏంటి? స్వేచ్ఛకి, విచ్చలవిడి తనానికి ఉన్న వ్యత్యాసం గ్రహించకనే కదా దారుణంగా మోసపోయాను!” అన్నది పశ్చాత్తాపంతో.

నేను ఆమెను ఓదార్చి “నీలో ఇంకా విచక్షణా జ్ఞానం ఉంది కనుకనే ఆలస్యంగానైనా కళ్ళు తెరిచావు. ఇక నీ నాట్య కౌశలాన్ని మన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించటానికి ఉపయోగించు. కళ మనుషుల్లోని కుళ్ళుని కడిగి మానవత్వాన్ని పెంచుతుంది!” అన్నాను.

ఆమె కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోగా “ఇప్పుడు నాకు ప్రశాంతంగా ఉంది. మైలపడ్డ ఈ దేహాన్ని ఎవరూ ఆదరించక పోయినా నాట్య వేదంతో పునీతం చేస్తాను. నీ మాటలతో జీవితాంతం ఒంటరిగా గడిపేయగలనన్న ధైర్యం వచ్చింది!” అన్నది ఆత్మ విశ్వాసంతో.

నాకు కుసుమ పట్ల ప్రేమ అణువంతైనా తగ్గలేదు. ఆమె కళ్ళు తుడిచి “రాలి పడ్డ పూలనే ఎరువుగా మార్చి, శిథిలమైన తోటకి జీవం పోసిన వాడిని. జీవితాంతం నీకు తోడుగా నేనుంటాను. నువ్వు అంగీకరిస్తే నిన్ను నా జీవిత భాగస్వామిగా....” నా మాటలు పూర్తవక ముందే నా పాదాలపై వాలిపోయి తన కన్నీళ్ళతో నా పాదాలని కడిగింది కుసుమ.

ఆమెను పైకి లేపి నా హృదయానికి హత్తుకున్నాను. ఒక అలౌకిక ఆనందంతో నా కళ్ళు చెమ్మగిల్లాయి. నా అంతరాంతరాలలో నుంచి “ఇప్పుడు నువ్వొక పరిపూర్ణ మానవుడివి” అని వినిపించింది.

# తన వంతు

**ఎల్.ఆర్.స్వామి**
✆ 9949075859

**మలయాళ మూలం: పులరి**

***అప్పుడు మెడ నరకటం కనబడినప్పుడు, నెత్తురు పారటం చూసినప్పుడు ఆర్తనాదాలు, మూలుగులుగా మౌనంలో కలసిపోవటం... వింటున్నప్పుడు, అమ్మమ్మ ప్రార్థన చెవుల్లో మారు మ్రోగుతుంది.***
***అప్పుడు కళ్ళు మూసుకొని చుట్టూ చీకటి సృష్టిస్తాను. రేపటి సూర్యకిరణాల కోసం వేచి ఉంటాను.***

"గాంధీ నగరం, గాంధీ నగరం" గట్టిగా కేక వేసాడు బస్సు కండక్టర్! గబగబా బస్సు దిగారు దిగవలసిన వాళ్ళు. వాళ్ళు బస్సు నుంచి దిగలేదు, బస్సు నుంచి దూకారని చెప్పటమే సబబు! ఆగిందా, లేదా అన్నట్లు కదా బస్సులు ఆపుతారు... దిగవలసిన వాళ్ళు మొత్తం దిగక ముందే బెల్లు మ్రోగించాడు కండక్టర్. దూసుకు వెళ్ళిపోయింది బస్సు!

రోడు రద్దీగా ఉంది. వాహనాలు చేసే శబ్ద కోలాహలం భరించలేనంతగా ఉంది. పెంట కుప్పల్లోని పురుగుల వలె పాకుతున్నాయి బైకులు. వేలు పెట్టడానికి చోటు ఇస్తే తల దూర్చేలాంటి ఆటోలు, వాటి మధ్య దూరుతున్నాయి!

నూనె జిడ్డుతో కూడిన కొప్పు మీద మల్లెపూలు తురుముకున్న తమిళ స్త్రీలు, ఎడం వైపుగా ధోతీ కట్టి, పై కండువా సవరించుకుంటూ, తాంబూలం నవులుతూ, రోడ్డు మీద ఉమ్ముతూ నడిచే గ్రామీణ ముఖంతో కూడిన మగవాళ్ళు రోడ్డు మీద తిరుగుతున్నారు! ఫాంటు తొడుక్కుని, చెప్పుల్స్ వేసుకొకుండా తిరిగేవారు కూడా కొందరు ఉన్నారు.

"రండి, రండి" అని పిలిచి జనాలను తమ కొట్టు వైపు తిప్పుకుంటున్నారు దుకాణం వాళ్ళు.

"అమ్మా, మాలఛ్మీ, ధర్మం చేయండమ్మా తల్లీ" అని కేకేస్తూ మానవ హృదయంలో దాగివున్న జాలిని మేలుకొల్పడానికి ప్రయత్నించే యాచకుల జీరబోయిన గొంతు.

గాలిలో మధుర పలహారాల సువాసన, ఫిల్టర్‌కాఫీ తాలూకు సుగంధం!

"తినాలని ఉంది" సుందరి మనసులో అనుకుంది. "కానీ, తిండి తగ్గించాలి. బరువు పెరిగితే త్వరగా వస్తుంది చావు."

సొరంగం అవతల పాలక్కాడ్ మట్టిలో పుట్టినదానికి, ఆ తమిళనాటి మట్టి వాసన నచ్చలేదు. తన ఊరు గురించి ఆలోచిస్తూ కూర్చుంది పాపం!

తన సావాసగాడైన రాముడు గుర్తుకొచ్చాడు. పెరట్లో ఆడుతున్నప్పుడు 'సుందరీ, సుందరీ' అని ప్రేమగా పిలిచేవాడు.

తన తలపై వున్న ఊదారంగు కలసిన యెర్రటి పువ్వు, తన అందానికి తొడిగిన కిరీటమని చెప్పేవాడు. అందువల్లనే తనకు

సుందరి అనే పేరు పెట్టాడట!

పిలవగానే పరిగెత్తి వెళ్తే, వాడికి అందిన పలహారంలో ఒక్క వంతు ఇస్తాడు.

పొద్దున లేవగానే పరిగెత్తించి, పట్టుకోవడానికి ప్రయత్నించేవాడు, ఎంతో వేదన భరించి బయటికి తెచ్చే గుడ్డు కోసమే వాడు వెనక్కి పరిగెత్తుకొచ్చేవాడు.

మంచి తిండి పెట్టేవాడు. ముద్దులాడేవాడు. బడిలో జరిగినవన్నీ కథలు కథలుగా చెప్పేవాడు. ఒక్కసారి క్లాసుకి కొంత ఆలస్యంగా వెళ్ళటం వల్ల, క్లాసు బయట నిలబడవలసిందనీ, అప్పుడు రాగిణి అనే అమ్మాయి ఎగతాళి చేసి నవ్విందని కూడా చెప్పాడు. ఎగతాళి చేసినందుకు కాదు బాధ అనీ, ఏదైనా అల్లరి చేసినందుకు క్లాసు బయట నిలబెట్టి వుంటే గొప్పగా ఉండేదని కూడా చెప్పాడు.



ఎంత వేగంగా పరిగెట్టింది కాలం!

రాము ఊరి నుంచి వెళ్ళిపోయాడు! చదువు కోసమేనని అన్నారు. ఏ ఊరు వెళ్లిపోయాడో ఎవరూ చెప్పలేదు. నన్ను బుజ్జగించేవారు కరువైనారు. నా ఉత్సాహం కూడా సన్నగిల్లింది.

ఒకరోజు ఇంటికి వచ్చిన బండివాడికి నన్ను అమ్మేసారు... వాడు అరవవాడు!

నాకు చాలా బాధ వేసింది. వాడి చేతికి అందకుండా ఎగిరాను. ఇంటి చుట్టూ పరిగెత్తాను, నా సహాయానికి ఎవరూ రాలేదు... అంత కాలం అక్కడ, వాళ్ళతో ఉన్నాను కదా!

ఆ అరవ అతడు ఇచ్చిన డబ్బు లెక్క చూస్తూ కుర్చున్నాడు రాముడు తండ్రి.

నాలాగే గూడూ, ఇల్లూ పోగొట్టుకున్న దురదృష్టవంతులు ఎందరో ఇక్కడ!

అరవతను తిండి బాగా పెడుతాడు. మేం అందరూ బాగా బరువు పెరగాలన్నది అతని లక్ష్యం!

నేను రోజూ చూస్తున్నాను కదా, బాగా బరువుగా, చురుకుగా వున్న కోడే కావాలి అందరికీ! మమ్మల్ని గూటిలో పెట్టి రోడ్డు వారగా వుంచినది అమ్మడానికే!

గూటిలోని ప్రపంచం గురించి బయటి వాళ్ళకు ఏం తెలుసు? ఒకరికొకరు తగులుతూ, అలా కూర్చుని ఉన్నాం. ఒకే గూటిలో వున్నప్పుడు పరస్పర స్నేహం పుట్టుకురావటం మామూలే కదా. మిత్రులు వీడ్కోలు చెప్పేటప్పుడు తెలుస్తోంది స్నేహం దు:ఖమేనని!

దారిలో వెళ్ళినవాళ్ళల్లో ఒక్కడు చేతి వేలుతో కానీ, తాళం చెవుల గుత్తితో కానీ, గూడు మీద పొడిచి చూస్తాడు. అప్పుడు ఒక్క భూకంపం వచ్చినట్లు అనిపిస్తుంది. అతని లక్ష్యం నేనేమో అనే భయం కూడా వేస్తుంది.

ఎవరైనా వచ్చినప్పుడు నేను వెనక్కి వెళ్లిపోతాను. కళ్ళు మూసుకొని కునుకు తీస్తున్నట్లు ఉంటాను. ఎదుట జరిగే హత్య చూడలేను నేను. చురుకుగా లేనని వచ్చినవాడు అనుకుంటే, నన్ను ఎన్నుకునే అవకాశం తక్కువ కదా!

విసుగు వచ్చినప్పుడు చస్తే బాగుంటుందని గుండె కోరుకుంది కానీ, కళ్ళ ఎదుట రోజూ చావు కనబడుతున్నప్పుడు, చావు అంటే భయం వేస్తుంది! “దేవుడా, అనాయాసేన మరణం వినా దైన్యేన జీవితం” అని అమ్మమ్మ రోజూ దేవుడ్ని వేడుకోవటం గుర్తుకొస్తుంది. అప్పుడు మెడ నరకటం కనబడినప్పుడు, నెత్తురు పారటం చూసినప్పుడు ఆర్తనాదాలు, మూలుగులుగా మౌనంలో కలసిపోవటం... వింటున్నప్పుడు, అమ్మమ్మ ప్రార్థన చెవుల్లో మారు మ్రోగుతుంది. అప్పుడు కళ్ళు మూసుకొని చుట్టూ చీకటి సృష్టిస్తాను. రేపటి సూర్యకిరణాల కోసం వేచి ఉంటాను.

కానీ...

ఎన్ని రోజులు ఇలా తప్పించుకోగలను? ఈరోజు, లేకపోతే రేపు, కాకపోతే మరునాడు నా వంతు కూడా వస్తుంది. ఒక్కటి ఖచ్చితం. జన్మ ఎత్తినవాడు మరణించటం తప్పదు.

ఏదో ఒక్క అదృష్టవంతుడి భోజనం బల్లపైన, చిల్లీ చికన్ గానో, బట్టర్ చికన్ గానో చేరుతుంది ప్రాణం వదిలిన నా శరీరం! నన్ను సంతోషంగా ఆరగిస్తాడు. అతడు చెత్తకుప్పలోకి విసిరేసిన నా నరాల కోసం, ఊర కుక్కలు పోటీ పడుతాయి!

నా మరణం ఎందరికో సంతోషదాయకం!

నేను రాము భోజనం బల్లపైన చేరుతానా? అలా చేరుతే...

నా జీవితం వ్యర్థం కాలేదనీ, మిత్రునికైనా పనికి వచ్చానని సంతోషిస్తాను!

గూటిలోకి వచ్చే చేతులు తప్పించుకొని చివరికి జరిగింది... ‘సుందరి రాకూడదు’ అని ప్రార్థిస్తూనే వున్నా, వస్తుందని ఖచ్చితంగా తెలిసిన తన వంతు కోసం ఎదురు చూస్తూ!

# ఋణం

వి. వి. రమణమూర్తి
✆ 9959382754

***ఇంటికి వెళ్ళి, తాళం తీసి లోపలకి వెళ్ళాను! ఇంట్లో ప్రతి గోడ నన్ను పలకరించినట్టే అనిపించింది. ఇంట్లో కొంచెం దుమ్ము పట్టి ఉంది. పెరట్లో మొక్కలకి నీళ్ళు లేకపోవడంతో, ఎండిపోయి ఉన్నాయి. గబగబా అక్కడే ఉన్న నూతిలో నీళ్ళు తోడి, వాటికి నీళ్ళు పోసాను. మరో అరగంట ఆ ఇంట్లో తిరిగి, వచ్చేశాను. స్వర్గం నుంచి బయటకు వచ్చినట్టనిపించింది***

మా ఊళ్లో బస్సు దిగగానే, అలా అలా పిల్లతెమ్మెరలా బాగా పరిచయం ఉన్న దోశె, చనగపచ్చడి వాసన.. నా ముక్కుపుటాలను తాకింది! నాకు ఈ రెంటి కాంబినేషన్ అంటే నాలుక కోసుకునేంత ఇష్టం. చిన్నతనంలో అమ్మ ఈ పచ్చడి చేసి, దోశెలు పోస్తూ ఉంటే, పొట్ట పగిలేలా తినేవాడిని. తర్వాత అమ్మ నాకు దిష్టి కూడా తీసేది. హైదరాబాదులో మా ఆవిడ, తనకు వీలైనప్పుడు, అలా చేసి పెట్టినా మా అమ్మ చేతి రుచి రాదు. అసలే రాత్రంతా ప్రయాణం చేసి అలసిపోయి, ఆకలితో అలమటిస్తున్నానేమో... ఈ ప్రియమైన సుగంధం తగలగానే నరమాంసానికి అలవాటుపడిన పులిలా ఆత్రంగా అటూ ఇటూ వెతికాను.

"రిక్షా కావాలా సార్" అంటూ వచ్చిన వాడిని, "ఆ సంగతి తరువాత, ముందు ఈ వాసనలు ఎక్కడినుంచి వస్తున్నాయో చెప్పు!" అని అడిగాను.

నన్ను విచిత్రంగా చూస్తూ, "ఊరికి కొత్తా బాబూ! అదుగో, ఆ కనిపించే సుబ్బయ్యగారి బండి నుండి వచ్చే వాసనలు కదూ!" అన్నాడు అతడు.

సుబ్బయ్య బండి అనగానే చిన్ననాటి జ్ఞాపకాలు కళ్ల ముందు తిరిగాయి.

సుబ్బయ్యశెట్టిగారిది ఒక్కప్పుడు బాగా కలిగిన పెద్ద కుటుంబం! కాలక్రమేణ తన పిల్లలతో పాటూ అక్కచెల్లెళ్ల కుటుంబాల బాధ్యతలు కూడ తోడవడంతో, ఉన్న ఆస్తి కరిగిపోగా భార్యా పిల్లల తోడ్పాటుతో ఉదయం, సాయంత్రం బండి మీద ఇడ్లీ, వడ, దోశె వంటివి అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. రుచి, శుభ్రత పాటించడంలో రాజీ పడేవాడు కాదు. పదార్థాలు కూడ రుచికరంగా వండడంతో కొద్దికాలంలోనే మంచి పేరు తెచ్చుకున్నాడు. ఇడ్లీ, దోశెల్లో అతను చేసే చనగపచ్చడి ప్రత్యేక ఆకర్షణ! మా అమ్మ చేతి రుచిని పోలి ఉండేది. అప్పట్లో మిగతా హోటళ్లలో ఇది చేసినా ఇంత రుచి ఉండేది కాదు. దాంతో మంచి పేరుతో పాటూ ఆదాయం కూడ బాగా వచ్చి కుటుంబం హాయిగా బ్రతికేది. వారి కొడుకు సూర్యం బడిలో నాకు మంచి దోస్తు. పొద్దస్తమానం తండ్రికి సహాయపడడంతో చదువులో అంతంత మాత్రమే ఉండేది. సాయంత్రం పూట, వాడు బండి దగ్గరున్నప్పుడు నేను వెడితే, తండ్రి చూడకుండా బజ్జీ, పకోడి వంటివి ఉచితంగా తినిపించేవాడు. బదులుగా వాడికి నేను చదువులో సహాయపడేవాడిని! అలా నా పదవ తరగతి పరీక్షలవ్వగానే మా నాన్నకు బదిలీ జరగడంతో ఆ ఊరు విడిచిపెట్టేసాము. తరువాత వాడు నా జ్ఞాపకాల్లో అప్పుడప్పుడు కదలాడేవాడు. ఈపాటికి బాగా సంపాదించి పెద్ద

హోటల్ పెట్టే ఉంటాడని ఊహించుకుంటూ ఉండేవాడిని. చదువయ్యాక ఉద్యోగరీత్యా హైదరాబాద్ లోనే సెటిల్ అయ్యాను. చాలాసార్లు మా ఊరికి వెళ్లాలని ప్రయత్నించినా ఎందుకో సాధ్యపడలేదు. ప్రస్తుతం ఊరికి ఇలా రావడానికి కారణం, అమ్మానాన్నలు గతించాక, ఆ ఊళ్లో మాకున్న చిన్న ఇల్లు అమ్మేదామని నా ప్రయత్నం! అప్పట్లో నాన్న మా ఇంటి ముందు చిన్న దుకాణం కట్టించి అద్దెకు ఇచ్చేవాడు. మేము ఊరు మారిపోయేక ఆ ఇంటి బాగోగులు చూడడానికి, మా నాన్న అక్కడికి అప్పుడప్పుడు వెళ్లి వస్తుండేవారు. తరువాత ఆ ఇంట్లో అద్దెకు ఉన్నవారు వారికి వీలైనప్పుడు అద్దె ఇస్తుండేవారు. నాకు డబ్బుతో అంత అవసరం లేకపోయినా, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ ఇంటిని అమ్మేదామని




నిశ్చయించాను. ఆ ఊరితో ఆఖరి బంధం కూడా పోతుందన్న బాధ ఉన్నప్పటికి, అందుకు సిద్ధపడ్డాను.

వాసనలు వస్తున్న బండి వైపు వడివడిగా అడుగులు వేసాను. నల్లగా, పెరిగిన గడ్డం, మాసిన పంచె, తలకు గుడ్డ చుట్టుకున్న వ్యక్తిని చూడగానే షాక్‌కి గురయ్యాను. నా స్నేహితుడు సూర్యంలా ఉన్నాడు. ఉండడమేవిటి, వాడే!

“ఒరేయ్ సూర్యం!” గట్టిగా కేకేసాను.

చటుకున నావైపు తిరిగి నన్ను తేరిపార చూసిన అతడు “రాము, రామం నువ్వేనా!” అంటూ అనుమానంగా చూశాడు.

“ఔనురా!” అనగానే, ఆనందంగా నన్ను కౌగిలించుకోబోయి ఆగి, తన జిడ్డు చేతులు, మాసిన దుస్తుల వంక చూసుకుంటూ “ఎన్నాళ్లకెన్నాళ్లకురా?” అంటూ కంటనీరు పెట్టుకున్నాడు.

“మమ్మల్ని, ఊరిని మరచిపోయావా రామం, అమ్మా నాన్న అంతా బాగున్నారా?” అని అడిగాడు.

నా సంగతులన్నీ చెప్పి, “ఏంట్రా ! ఇలా ఉన్నావు. అంత వ్యాపారం చేసేవారు, ఇలా ఉన్నావేమిటి, అంతా బాగున్నారా?” అని నేనూ ఆత్రంగా అడిగాను.

“ఏం చెప్పమంటావురా! వ్యాపారం బాగా వృద్ధి చెందుతున్న సమయంలో నాన్న హఠాత్తుగా పోయారు. పెద్దదిక్కు లేని ఇల్లు, పిల్లలు, ఖర్చులు… కొద్దికాలంలోనే పరిస్థితి దిగజారిపోయింది. మళ్లీ కాలు, చేయి కూడదీసుకున్నాక… ఇదుగో ఈ బండి ఆదుకుంది. కాకపోతే ఊరు పెరగడంతో, ఇటువంటి వ్యాపారాలు కూడ బాగా పెరిగాయి! కొత్త రుచులకు అలవాటు పడ్డ జనం, ఇటు చూడడం తగ్గించారు. ఏదో అలా నడుస్తుందిలే!” అంటూ, ”ముందు నీవు మా ఇంటికి వెళ్లి ఫ్రెష్ అయ్యి రా! కాకపోతే నీకు అంత సౌకర్యంగా ఉండదు!” అంటూ ఓ కుర్రవాడినిచ్చి పంపాడు.

చిన్న అద్దె ఇంట్లో భార్య, ఎదిగిన ఇద్దరు కూతుళ్లతో బతుకు సాగిస్తున్నాడు. ఆప్యాయంగా పలకరించిన సూర్యం భార్య, నా స్నానానికి ఏర్పాటు చేసింది. కాఫీ ఇవ్వబోతే, వద్దని ‘ముందు వాడి చేతి టిఫిన్ తిని అప్పుడు తాగుతానని’ చెప్పి సూర్యం దగ్గరకొచ్చాను.

వాడు వేసి ఇచ్చిన దోశె, పచ్చడి తనివితీరా తింటుంటే మళ్లీ నేను చిన్ననాటి రోజుల్లోకి వెళ్లిపోయాను! ఆ రుచిలో ఎటువంటి మార్పూ లేదు. తండ్రి దగ్గర మెళుకువలు బాగా తెలుసుకున్నట్టున్నాడు… చాలా రుచికరంగా ఉన్నాయి.

కాసేపయ్యాక వచ్చి పక్కన కూర్చున్న వాడి పరిస్థితి విపులంగా కనుక్కున్నాను.

“భార్య, పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలతో ఆ అద్దె కొంపలో ఈ బండితో బతుకుబండి లాగిస్తున్నాను. ఎక్కడైనా దుకాణం దొరికితే కాస్త స్థిరమైన వ్యాపారం సాగిద్దామంటే అద్దెలు ఆకాశంలో ఉన్నాయి. భగవంతుని దయ ఎలా ఉంటే అలా జరుగుతుంది!” అంటూ నిట్టూర్చాడు.

కాస్సేపు ఏదో పిచ్చాపాటీ మాట్లాడిన తర్వాత… “నువ్వు పెట్టింది అరగాలి కదరా… అలా ఊర్లోకి వెళ్ళి వస్తాను!” అంటూ ఊర్లోకి దారితీశాను. ఊరు బాగానే మారిపోయింది! నడుచుకుంటూ మా ఇంటికీ వెళ్ళాను. ఇంటి చుట్టూ పెద్ద పెద్ద బిల్డింగ్స్, షాపులు వచ్చాయి. వాటి మధ్య మా ఇల్లు కొంత పాతబడిపోయినట్టు కనబడింది! అయితేనేమి? రాతికట్టడం… చెక్కు చెదరకుండా, కోటలా కనబడింది నా కళ్ళకి!

ఇంటికి వెళ్ళి. తాళం తీసి లోపలకి వెళ్ళాను! ఇంట్లో ప్రతి గోడ నన్ను పలకరించినట్టే అనిపించింది. ఇంట్లో కొంచెం దుమ్ము పట్టి ఉంది. పెరట్లో మొక్కలకి నీళ్ళు లేకపోవడంతో, ఎండిపోయి ఉన్నాయి. గబగబా అక్కడే ఉన్న నూతిలో నీళ్ళు తోడి, వాటికి నీళ్ళు పోసాను. మరో అరగంట ఆ ఇంట్లో తిరిగి, వచ్చేశాను. ఒక్కసారిగా… స్వర్గం నుంచి బయటకు వచ్చినట్టనిపించింది

రాత్రి భోజనాలు చేసాక. మళ్ళీ ఇద్దరం కబుర్లలో పడ్డాం!

"అన్నట్టు నువ్వో సహాయం చేయాలిరా!" అంటూ మొహమాటపడుతూ నా వైపు చూశాడు.

"అదేమిటి... నా దగ్గర మొహమాట పడతావు? అడగరా!" అంటూ, దగ్గరగా జరిగి వాడి భుజం తట్టాను.

"నాకు మీ పట్నంలో ఏదైనా ఉద్యోగం చూడు!" ఆ మాటలు రావడానికి చాలా కష్టపడ్డాడు.

నవ్వుతూ... "సరే... ఇంతకీ..." అంటూ వాడి వ్యాపారం గురించి అడిగి, తెలుసుకున్నాను.

అలా కబుర్లు చెపుతూనే, నిద్రపోయాను!

ఉదయాన్నే లేచి, కాలకృత్యాలు ముగించి, బ్యాగు సర్దుకుంటుంటే... "అదేమిటి వెళ్లిపోతున్నావా? వచ్చిన పనయిందా?" అంటూ అడిగాడు సూర్యం.

నవ్వుతూ, "అయిందిరా! ఇదిగో... ఈ తాళం తీసుకుని, మా ఇంట్లోకి మారిపోయి, ఈ వ్యాపారాన్ని అక్కడే పెట్టుకో... బాగుంటుంది! పైసా అద్దె కూడా ఇవ్వొద్దు!" అంటూ వాడి చేతిని బలవంతంగా తీసుకుని, తాళం వాడి చేతిలో పెట్టాను.

సూర్యం దగ్గర మాటలు కరువయ్యాయి. నా చేతులు పట్టుకుని, బావురుమన్నాడు!

"ఒరేయ్! ఇందులో నా స్వార్థం కూడా ఉంది. అప్పుడప్పుడు ఈ ఊరొచ్చి, మీ నాన్న నాకు రుచి చూపించిన ఈ శనగపచ్చడి రుచి నీ చేతిలో కూడా చూడవచ్చు! అలా ఆయన ఋణం తీర్చుకోవడంతో పాటూ నీతో, ఈ ఊరితో నా అనుబంధం కూడ కొనసాగించవచ్చు! అన్నట్టు... ఆ ఇంటి ముందు 'ఈ ఇంటిని అమ్మబడును' అన్న బోర్డు ఉంది, దాని తీసి, అవతల పారేయి!" అంటూ తృప్తిగా, బస్టాండ్ వైపు అడుగులు వేశాను!

# సహజ నటుడు

ఆదోని బాషా
✆ 9440239828

*మాటలు విని ఇనస్పెక్టర్ విజయ్‌తో పాటు అక్కడే వున్న డైరెక్టర్ వినోద్ ముసిముసిగా నవ్వుకున్నారు. "నీ కథ కూడా ఓ సినిమా స్టోరీలా ఉందోయ్. కాని నువ్వు తయారుచేసిన స్క్రిప్టును మేం ముందే పసిగట్టి మాకు అనుకూలంగా నీ స్క్రిప్టును మార్చేశాం. మారిన స్క్రిప్ట్ గురించి డైరెక్టర్ వినోద్ వివరంగా చెబుతాడు, వినండి!"*

"లైట్స్... కెమెరా... యాక్షన్..."

డైరెక్టర్ వినోద్ ఆదేశించగానే లైట్లు వెలిగాయి. కెమెరా ఆన్ అయింది. సీన్ మొదలైంది. చేతిలో పిస్తోల్‌తో నిల్చున్న విలన్ తన ఎదురుగా వున్న హీరోకి పిస్తోల్ గురిపెట్టి కటువుగా అన్నాడు.

"రాజూ, నేను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన లతను ఏదో మాయ చేసి నీ వలలో వేసుకున్నావు. లత నాకు దక్కనప్పుడు నీకూ దక్కకూడదు. అందుకే నిన్ను అంతం చేయబోతున్నాను. నీ ఇష్టదైవాన్ని తలచుకో!"అంటూ ట్రిగ్గర్ పై వేలు బిగించాడు విలన్.

"ఆగు కిషోర్! నువ్వు లతను ప్రేమించావు గాని, లత నిన్ను ప్రేమించలేదు. నన్ను చంపినంత మాత్రాన లత నీకు దక్కదు. పైగా నీ మీద ఆమెకు వున్న సానుభూతి కూడా ద్వేషంగా మారుతుంది!" అన్నాడు హీరో.

"ప్రేమించిన వ్యక్తి సానుభూతి కన్నా ఆమె ద్వేషాన్నే నేను ఇష్టపడతాను!" మొండిగా అన్నాడు విలన్. అప్పుడే హీరోయిన్ అక్కడికి పరిగెత్తుకొచ్చింది.

"వద్దు కిషోర్! తొందర పడొద్దు. రాజును చంపవద్దు. అతను లేకపోతే నేను జీవించలేను. కావాలంటే నన్ను చంపి నీ కసి తీర్చుకో!" అంటూ హీరోకి అడ్డుగా నిలుచుంది.

"ఇందులో నీ తప్పు లేదు లతా! నువ్వు మా మధ్య రావద్దు!" అంటూ హీరో ఆమెను పక్కకి తోశాడు. అయినా ఆమె మళ్ళీ వచ్చింది. హీరో ఆమెను మళ్ళీ తోశాడు. ఇలా ఆ ప్రేమికులు చావటానికి పోటీ పడుతుంటే హఠాత్తుగా విలన్ ట్రిగ్గర్ నొక్కాడు.

"ఢాం..." అంటూ పెద్ద శబ్దంతో పిస్తోల్ పేలింది. పొగలు కక్కుతూ తూటా దూసుకెళ్లింది. సూటిగా హీరో ఛాతీకి తగిలింది. అతను ఆర్తనాదం చేస్తూ చేత్తో ఛాతీ పట్టుకొని నేలపై పడిపోయాడు. బాధతో గిలగిలా తన్నుకున్నాడు.

"కట్" అన్నాడు డైరెక్టర్. ఈ సన్నివేశాన్ని డైరెక్టర్ వినోద్ ఎన్నోసార్లు వివిధ నటీనటులపై చిత్రీకరించాడు. ఎందుకో తెలియాలంటే ఫ్లాష్‌బ్యాక్ లోకి వెళ్ళాలి.

★★★

నిర్మాత, దర్శకుడైన వినోద్ కుమార్‌కి సొంత స్టూడియో వుంది. అతను లోబడ్జెట్ సినిమాలు తీస్తుంటాడు. ఈసారి తను నిర్మించబోయే ఒక సినిమా కోసం పూర్తిగా కొత్త నటీనటులను తీసుకోవాలనుకున్నాడు. కొత్త వాళ్ళ కోసం ప్రకటన వేశాడు. దానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ముప్పై మంది నటులు, పది మంది నటీమణులను ఎన్నుకొని వారికి ఆడిషన్ ఏర్పాటు చేశాడు. ఆడిషన్‌కి ముందే వినోద్ తను తీయబోయే సినిమా కథను వారికి మూడు ముక్కల్లో చెప్పాడు.

"ఈ సినిమా పేరు ప్రతీకారం! ఇదొక ట్రైయాంగిల్ ప్రేమ కథ. హీరోయిన్ని హీరోతో పాటు విలన్ కూడా ప్రేమిస్తాడు. విలన్ అసూయతో హీరోను పిస్తోల్‌తో కాల్చి చంపుతాడు. తర్వాత హీరో దెయ్యంగా మారి విలన్‌పై పగ తీర్చుకుంటాడు. టూకీగా



ఇదీ కథ. ఇందులో ముఖ్య పాత్రలు మూడు. హీరో, హీరోయిన్, విలన్. మరో మూడు ముఖ్య పాత్రలున్నాయి. విలన్ మిత్రులు ఇద్దరు, హీరోయిన్ స్నేహితురాలు ఒకరు. ఇక చిన్న చిన్న పాత్రలు నాలుగు వున్నాయి. విలన్ హీరోని పిస్తోలుతో కాల్చి చంపటం ఈ సినిమాలో ఒక ముఖ్యమైన సన్నివేశం. ఇదే సన్నివేశాన్ని మేం ఆడిషన్లో పెడుతున్నాం. ఒకరి తర్వాత ఒకరికి హీరో, విలన్, హీరోయిన్ అవకాశం ఇస్తాం. వారి నటనా సామర్థ్యాన్ని పరిశీలించి మార్కులు వేస్తాం. మార్కులను బట్టి వారిని ఆయా పాత్రలకు ఎన్నుకుంటాం!" అన్నాడు వినోద్. అందరు బుద్ధిగా తలూపారు.

తర్వాత ఆడిషన్ మొదలైంది. రోజంతా కొనసాగింది. విలన్ హీరోపై పిస్తోలు పేల్చే దృశ్యాన్ని ఒకరి తర్వాత ఒకరిపై చిత్రీకరించారు. తర్వాత వినోద్ ఆ దృశ్యాలను తెర మీద ప్రదర్శించి చూశాడు. అందరి నటనను నిశితంగా పరిశీలించాడు. వారి నటనాసామర్థ్యానికి తగ్గట్టు మార్కులు వేశాడు. వారిలో అందరి కన్నా ఎక్కువ మార్కులు పొందిన వారికి ముఖ్య పాత్రలు ఇచ్చి తర్వాతి నంబర్ల వారికి మిగతా పాత్రలు ఇచ్చాడు. అలా హీరో పాత్రకి రవి, హీరోయిన్ పాత్రకు పద్మ, విలన్ పాత్రకు మధు సెలెక్ట్ అయ్యారు. మిగతా మూడు ముఖ్య పాత్రలకు మోహన్, రాంబాబు, లలిత ఎన్నికయ్యారు. నాలుగు చిన్న పాత్రలకు కూడా నలుగురిని ఎన్నుకోవటం జరిగింది.

"సోమవారం షూటింగ్ మొదలవుతుంది. విలన్ హీరోని చంపే ఈ సన్నివేశంతో పాటు మరో ఐదారు సన్నివేశాల షూటింగ్ జరుగుతుంది. కాబట్టి ఎన్నికైన వారంతా సోమవారం ఖచ్చితంగా రావాలి!" అన్నాడు వినోద్.

అందరూ వెళ్లిపోయిన గంట తర్వాత వినోద్.... ఆడిషన్‌లో సెలెక్ట్ కానివారికి కూడా ఫోన్లు చేశాడు. ఇంకా కొన్ని పాత్రల కోసం నటుల అవసరముంది గనుక, సోమవారం వారు కూడా స్టూడియోకి రావాలని కోరాడు.

వినోద్ కోరినట్టుగానే ఆడిషన్‌లో సెలెక్ట్ అయిన వారితో పాటు మిగతావారు కూడా షూటింగ్ రోజు హాజరయ్యారు. ముందుగా విలన్ హీరోని చంపే సీన్ చిత్రీకరణ మొదలైంది.

"షాట్ నంబర్ 20... లైట్స్... కెమెరా... యాక్షన్..."

డైరెక్టర్ వినోద్ సూచించగానే షూటింగ్ మొదలైంది. చేతిలో పిస్తోలుతో నిల్చున్న విలన్ మధు తన ఎదురుగా వున్న హీరో రవికి పిస్తోల్ గురిపెట్టి డైలాగ్ చెప్పాడు. ఇద్దరి మధ్య సంభాషణ సాగుతుండగా హీరోయిన్ పద్మ ప్రవేశించింది. హీరో హీరోయిన్ల డైలాగులు, తోపులాట తర్వాత మధు ట్రిగ్గర్ నొక్కాడు.

"ఢాం..." అంటూ పెద్ద శబ్దంతో పిస్తోలు పేలింది. పొగలు కక్కుతూ తూటా దూసుకెళ్లింది. సూటిగా రవి ఛాతీకి తగిలింది. అతను గట్టిగా ఆర్తనాదం చేస్తూ నేలపై పడిపోయాడు. బాధతో గిలగిలా తన్నుకున్నాడు.

"కట్ ఇట్... ఎక్సలెంట్ యాక్షన్" అంటూ ప్రశంసగా రవి వైపు చూశాడు వినోద్. కాని రవిలో ఉలుకూ పలుకు లేదు. నేలపై అలాగే పడి వున్నాడు. వినోద్ గాభరాగా రవి దగ్గరికి పరిగెత్తాడు. "అరే, రవి ఛాతీలోంచి రక్తం కారుతోంది. ఇదెలా సాధ్యం? మేం కలర్ ప్యాకెట్ పెట్టలేదు కదా" అంటూ కంగారుగా వంగి రవిని కదిలించి చూశాడు. అతనిలో కదలిక లేదు. నాడి కూడా కొట్టుకోవటం లేదు. వినోద్ ముఖం తెల్లగా పాలిపోయింది. వెంటనే మధు వైపు తిరిగి "ఎంత పని చేశావ్? నకిలీ పిస్తోలుతో కాల్చమంటే నిజం పిస్తోలుతో కాల్చి, ఇతన్ని చంపేశావా?" అని అరిచాడు. ఆ మాట విని మధు అదిరిపడ్డాడు.

"ఏమిటి సార్ మీరనేది? మీరు తాళంచెవి ఇస్తే మీ స్టోర్‌రూంలో వున్న పిస్తోలే నేను తీసుకొచ్చాను. ఇది నకిలీ పిస్తోలు. మొన్న ఆడిషన్‌లో దీన్నే వాడాం కదా!" తన చేతిలో ఉన్న పిస్తోల్ వైపు భయంగా చూస్తూ అన్నాడు మధు.

"ముందు ఆ పిస్తోల్ టేబుల్‌పై పెట్టు!" అన్నాడు వినోద్.

మధు పిస్తోలు టేబుల్‌పై పెట్టాక వినోద్ అతన్ని సోదా చేశాడు. కాని అతని వద్ద నకిలీ పిస్తోలు దొరకలేదు.

"ఇది మర్డర్ కేసు! ఇప్పుడే పోలీసుల్ని పిలుస్తాను. పోలీసులు వచ్చేవరకూ ఎవరూ ఇక్కడి నుంచి కదలకూడదు. అందరు పక్క హాల్లోకి వెళ్ళండి!" అంటూ ఆదేశించాడు వినోద్. మధుతో పాటు అక్కడున్న సాంకేతిక సిబ్బంది, నటీనటులు పక్క హాల్లోకి వెళ్ళిపోయారు. వినోద్ హాల్లోంచి ఎవరూ బయటికి రాకుండా దాని తలుపు మూసి పోలీసులకు ఫోన్ చేశాడు.

★★★

పోలీస్ ఇనస్పెక్టర్ విజయ్‌కుమార్ రవి దేహాన్ని పరీక్షించాక, పోస్టుమార్టం కోసం దాన్ని మార్చురీకి పంపించాడు. హత్యకు వాడిన పిస్తోలును స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత గది తలుపు తెరిచి అందర్నీ బయటికి పిలిచాడు. తర్వాత ఒక్కొక్కరిని ప్రశ్నించాడు. ముందుగా డైరెక్టర్ వినోద్ తన స్టేట్‌మెంట్ ఇచ్చాడు. "మా స్టూడియోలోని బీరువాలో ఓ నకిలీ పిస్తోలు వుంటుంది సార్! షూటింగులో అవసరమైనప్పుడు దాన్ని వాడుతాం. దాన్ని పేలిస్తే అచ్చం నిజం పిస్తోలు మాదిరి శబ్దం చేస్తూ పేలుతుంది. కాని అందులో వుండేవి నకిలీ తూటాలు కాబట్టి ఎవరికీ హాని కలగదు. మొన్న ఆడిషన్‌లో చాలాసార్లు ఇదే పిస్తోలుని వాడటం జరిగింది. ఈరోజు షూటింగ్‌కి ముందు నేను ఆ పిస్తోలు తీసుకురమ్మని విలన్ పాత్రధారి మధుకి స్టోర్ రూం కీ ఇచ్చాను. కాని అతను తెచ్చిన పిస్తోలుతో పేల్చగానే రవి చనిపోయాడు. నకిలీ పిస్తోలు స్థానంలో నిజం పిస్తోలు ఎలా వచ్చిందని అడిగితే తనకేం తెలీదంటున్నాడు!" అన్నాడు.

"స్టోర్ రూంకి వెళ్ళే దారిలో సీసీ టీవీ కెమెరా వుందా?" విజయ్ అడిగాడు. లేదంటూ వినోద్ అడ్డంగా తల ఊపాడు.

తర్వాత విజయ్ మధును ప్రశ్నించాడు. అతను "సార్, ఇందులో నా తప్పేం లేదు! డైరెక్టర్ సార్ తాళంచెవి ఇస్తే, నేను స్టోర్ రూంకి వెళ్ళి పిస్తోలు తీసుకొచ్చాను. దాన్ని పేల్చే వరకు అది నిజం పిస్తోలు అని నాకు తెలీదు. నన్ను నమ్మండి!" అన్నాడు.

"ఎలా నమ్మేది? స్టోర్ రూం కెళ్ళి పిస్తోలు తెచ్చింది నువ్వే. నకిలీ పిస్తోలు ఎక్కడో దాచిపెట్టి నీ దగ్గరున్న రియల్ పిస్తోలుతో రవిని కాల్చి చంపావు. చెప్పు, రవిని ఎందుకు చంపావు?" కటువుగా అడిగాడు విజయ్.

"నేను నిజం చెబుతున్నాను సార్. నాకేమీ తెలియదు!" ఏడుపు గొంతుతో అన్నాడు మధు.

"నటించకు, ఇది సినిమా కాదు! నిజం చెప్పకపోతే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తాను. ఆ నకిలీ పిస్తోల్ ఎక్కడ దాచావో చెప్పు!" అన్నాడు విజయ్.

"నాకేమీ తెలియదు సార్" అన్నాడు మధు.

విజయ్ అక్కడున్న పోలీసులతో "స్టూడియోలో వున్న ప్రతి ఒక్కర్ని సోదా చెయ్యండి. స్టూడియో మొత్తం జల్లెడ పట్టండి. ఆ నకిలీ పిస్తోలు ఇక్కడే దొరుకుతుంది!" అన్నాడు.

పోలీసులు అందర్నీ సోదా చేశారు. స్టూడియో మొత్తం గాలించారు. కాని ఎక్కడా నకిలీ పిస్తోలు దొరకలేదు. తర్వాత విజయ్ అక్కడున్న వారందరి ఫింగర్‌ప్రింట్స్ నమూనాలు తీసుకున్నాడు. అనుమతి లేకుండా ఎవరూ నగరం వదిలి వెళ్లకూడదని షరతు విధించి అందరినీ వదిలేశాడు. కాని మధుని మాత్రం అరెస్ట్ చేసి స్టేషన్‌కి తీసుకెళ్ళాడు.

★★★

రెండ్రోజుల తర్వాత ఓ సాయంత్రం పూట డైరెక్టర్ వినోద్ రాంబాబు, మహేష్‌లను పిలిచి మాట్లాడాడు. "ఈ కేసు ఇప్పట్లో తెగేటట్టు లేదు. హీరో పాత్రధారి చనిపోయాడు. విలన్ పాత్రధారి జైల్లో ఉన్నాడు. అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను. వారిద్దరి స్థానంలో మీరిద్దర్ని పెట్టి సినిమా తీస్తాను. పోలీసుల అనుమతి కూడా తీసుకున్నాను!" అన్నాడు.

ఆ మాట వినగానే మిత్రులిద్దరూ ఎగిరి గంతేశారు. "థాంక్యూ సార్. మేం వారిద్దరి కన్నా ఇంకా బాగా నటించి చూపిస్తాం!" ఉత్సాహంగా అన్నాడు రాంబాబు.

వినోద్ వారి చేత ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకొని కొంత పారితోషికం అడ్వాన్సుగా ఇచ్చాడు. త్వరలో షూటింగ్ మొదలెడతానన్నాడు. ఇద్దరు మిత్రులు ఆనందంతో పొంగిపోతూ స్టూడియో నుండి బయటికొచ్చారు. హోటల్లో భోజనం చేశాక, ఖరీదైన విస్కీ కొనుక్కొని నగర శివారులో తాము నివాసముంటున్న అద్దె ఇంటికి వెళ్ళారు. ముందు గదిలో కూర్చొని తాగుతూ అర్ధరాత్రి వరకు సెలబ్రేట్ చేసుకున్నారు.

"ఒకే దెబ్బకి రెండు పిట్టలంటే ఇదేరా మోహన్! మనకు అడ్డుగా వున్న రవి పోయాడు. అతనిపై పిస్తోలు పేల్చిన నేరానికి మధు జైలుపాలయ్యాడు. వారిద్దరి స్థానంలో మనకు అవకాశం దొరికింది. అంతా మనం ఊహించినట్టే జరిగింది!" అన్నాడు రాంబాబు.

"అవును గురూ! కాని ఆ ఇనస్పెక్టర్ అందరితో పాటు నీ ఫింగర్‌ప్రింట్స్ కూడా తీసుకెళ్ళాడు కదా. ఒకవేళ పిస్తోలుపై నీ ఫింగర్‌ప్రింట్స్ దొరికితే ఎలా?" మోహన్ సందేహం వెలిబుచ్చాడు.

"నేను ఆ పిస్తోలు మార్చేముందు దాన్ని కర్చీఫ్‌తో బాగా తుడిచాన్రా! దానిపైన మధు ఫింగర్‌ప్రింట్స్ మాత్రమే వుంటాయి!" నవ్వుతూ అన్నాడు రాంబాబు.

మోహన్ కూడా నవ్వబోయి అంతలో కిటికీ వైపు చూసి ఉలిక్కిపడ్డాడు. "ఒరేయ్ రామ్, అటు చూడు" అన్నాడు భయంగా.

రాంబాబు వెంటనే కిటికీ వైపు చూశాడు. చూడగానే అదిరిపడ్డాడు.

కిటికీ బయట వరండాలోని మసక చీకట్లో ఒక ఆకారం నిల్చొని ఉంది. ఆ వ్యక్తి బాగా చూసిన మనిషిలా కనిపించాడు. అతనెవరో పోల్చుకోవటానికి ఇద్దరు కళ్ళు విప్పార్చి చూశారు. ఆ వ్యక్తి మెల్లగా నడుస్తూ కిటికీని సమీపించాడు. అప్పుడతని ముఖం స్పష్టంగా కనిపించింది. మోహన్ భయంతో కెవ్వున అరిచాడు.

ఆ వ్యక్తి ఎవరో కాదు, చనిపోయిన రవి! కాని అతని ముఖం భయంకరంగా వుంది. కళ్ళు ఎర్రగా మండుతున్నాయి. చిందర వందరగా వున్న జుట్టు గాలిలో నాట్యం చేస్తోంది. ఛాతీ మొత్తం రక్తంతో ఎర్రగా తడిసింది. అతని వెనక వైపు దట్టమైన తెల్లటి పొగ కమ్ముకుంటోంది. ఆ దృశ్యాన్ని చూసి మిత్రులిద్దరికీ గుండె దడదడ కొట్టుకుంది. "ఒరేయ్ ఆ రవి చచ్చి దెయ్యమయ్యాడు. ఆ సినిమా కథలో కూడా హీరో చనిపోయాక దెయ్యంగా మారి పగ తీర్చుకుంటాడని డైరెక్టర్ చెప్పాడు కదా. కొంపదీసి అలాగే జరుగుతోందా?" భయంతో వణికిపోతూ అన్నాడు మోహన్.

"దెయ్యం లేదు, గియ్యం లేదు. దీని సంగతి ఇప్పుడే తేలుస్తానుండు!" అంటూ రాంబాబు తూలుతూ లేచి బీరువాలోని ఓ రహస్య అరలో దాచిన పిస్తోలు బయటికి తీశాడు. కిటికీని సమీపించి పిస్తోలు దెయ్యానికి గురి పెట్టాడు. "ఎవరు నువ్వు?

తిక్క వేశాలేస్తే కాల్చి పారేస్తాను!" అన్నాడు కటువుగా.

కాని దెయ్యం బెదరలేదు. భయంకరంగా నవ్వింది. "ఒరేయ్ రాంబాబు, దమ్ముంటే కాల్చరా!" అంది.

రాంబాబు ఆవేశంగా రెండు మూడు రౌండ్లు కాల్చాడు. కాని దెయ్యానికి ఏమీ కాలేదు. అది పకపక నవ్వుతూ "ఒరేయ్ పిచ్చోడా, నీ చేతిలో ఉన్నది నకిలీ పిస్తోలురా! దీని స్థానంలో నువ్వు పెట్టిన నిజం పిస్తోలు వల్ల నేనెప్పుడో చచ్చి దెయ్యంగా మారాను. ఇప్పుడు మీ మీద పగ తీర్చుకోవటానికి వచ్చాను!" అంటూ దెయ్యం చేతుల్ని ముందుకు చాచింది. దాని ఒక్కో చేతికి పది వేళ్ళు వుండటం చూసి మిత్రులిద్దరు హడలిపోయారు.

మోహన్ గజగజ వణికిపోతూ "దెయ్యం సార్, తప్పు చేశామని ఒప్పుకుంటున్నాం! మమ్మల్ని క్షమించి వదిలేయ్" చేతులు మొక్కుతూ వేడుకున్నాడు.

"దుర్మార్గుల్లారా, మిమ్మల్ని చంపే వరకు వదిలిపెట్టను!" అంటూ దెయ్యం ఆవేశంగా కిటికీ వూచల్ని పట్టుకుంది. సరిగ్గా అప్పుడే మెరుపులు మెరిశాయి. ధడాల్న పిడుగు పడిన చప్పుడయింది. దాంతో ఇల్లంతా దద్దరిల్లింది. మిత్రులిద్దరు ప్రాణభయంతో ఇంటి వెనక వైపు పరుగుతీశారు. పెరటి వాకిలి తెరిచి బయటికొచ్చారు. అక్కడ మాటు వేసివున్న పోలీసులు వారిని చుట్టుముట్టారు. పోలీసుల్ని చూడగానే వారి మత్తు అంతా దిగిపోయింది.

ఇంటరాగేషన్‌లో రాంబాబు, మోహన్ తమ నేరాన్ని అంగీకరించారు. రాంబాబు జరిగినదంతా వివరించాడు. "నేను, మహేష్ మంచి నటులం అయినా మాకు అవకాశాలు దొరకలేదు. దాంతో ఖర్చుల కోసం చిల్లర దొంగతనాలు చేసేవాళ్ళం. ఆ రోజు ఆడిషన్‌లో పాల్గొనటానికి వస్తున్నప్పుడు దారిలో ఓ కోటీశ్వరుడి జేబు కొట్టేశాం. కాని అతని జేబులో పర్సుకు బదులు పిస్తోలు దొరికింది. అది లోడెడ్ పిస్తోలు. తర్వాత దాన్ని దొంగ మార్కెట్లో అమ్ముకోవచ్చనుకొని స్టూడియోకి చేరుకున్నాం! ఆడిషన్‌లో బాగా నటించినా మాకు హీరో, విలన్ పాత్రలు లభించలేదు. ఆ పాత్రలు రవి, మధులకు దొరకటంతో నిరాశ కలిగింది. అప్పుడే నాకో ఐడియా తట్టింది. ఆడిషన్‌లో వాడిన పిస్తోలు మేం కొట్టేసిన పిస్తోలు అచ్చం ఒకేలా వున్నాయి. రహస్యంగా ఆ పిస్తోళ్ళను తారుమారు చేస్తే, దానివల్ల ఏదో ఒక రోజు షూటింగులో హీరో చనిపోతాడు. విలన్ జైలు కెళతాడు. వారిద్దరి తర్వాత ఎక్కువ మార్కులు మాకే వున్నాయి కాబట్టి, ఆ రోల్స్ డైరెక్టర్ మాకే ఇస్తాడనిపించింది. ఈ ఆలోచన రాగానే నేను బాత్రూం సాకుతో స్టూడియోలోని స్టోర్ రూం దగ్గరికెళ్లాను. అదృష్టవశాత్తు దాని తలుపు తెరిచి వుండటంతో చప్పుడు కాకుండా లోపలికి దూరి పిస్తోలుని మార్చేసి, బయటికొచ్చాను. నన్నెవరూ చూడలేదు. తర్వాత జరిగిన షూటింగులో మేం ఆశించినట్టే ఆ పిస్తోల్ వల్ల హీరో రవి చనిపోయాడు, మధు జైలుకెళ్ళాడు. వూహించినట్టే వారి పాత్రలను డైరెక్టర్ మాకు ఇచ్చాడు. కాని సినిమా కథలో లాగే రవి దెయ్యంగా మారి మా వెంట పడతాడని మేం కలలో కూడా ఊహించలేదు!" విచారంగా అన్నాడు. రాంబాబు మాటలు విని ఇనస్పెక్టర్ విజయ్‌తో పాటు అక్కడే వున్న డైరెక్టర్ వినోద్ ముసిముసిగా నవ్వుకున్నారు.

"నీ కథ కూడా ఓ సినిమా స్టోరీలా వుందోయ్. కాని నువ్వు తయారుచేసిన స్క్రిప్టును మేం ముందే పసిగట్టి మాకు అనుకూలంగా నీ స్క్రిప్టును మార్చేశాం. మారిన స్క్రిప్ట్ గురించి డైరెక్టర్ వినోద్ వివరంగా చెబుతాడు, వినండి!" అంటూ ఇనస్పెక్టర్ విజయ్ నవ్వుతూ వినోద్ వైపు చూశాడు.

వినోద్ కూడా చిరునవ్వు నవ్వి చెప్పటం మొదలెట్టాడు. "ఆడిషన్ రోజు అందరూ వెళ్ళిపోయాక నేను స్టోర్ రూం తలుపు లాక్ చెయ్యలేదన్న సంగతి గుర్తొచ్చింది. యథాలాపంగా అక్కడి వస్తువుల్ని పరీక్షించినప్పుడు, పిస్తోలు కాస్త బరువుగా వున్నట్టు అన్పించింది. ఓసారి దాన్ని గాలిలో పేల్చి చూశాను. దాంతో అది నిజం పిస్తోలని అర్థమైంది. దాన్ని ఎవరు మార్చారో, ఎందుకు మార్చారో నాకు అంతు పట్టలేదు. వెంటనే నా మిత్రుడైన ఇనస్పెక్టర్ విజయ్‌ని కలసి జరిగినదంతా చెప్పాను. ఇది హీరో పాత్రధారి రవి హత్య కోసం జరిగిన కుట్ర అని విజయ్ నిర్ధారణ కొచ్చాడు. కాని రవికి శత్రువులు ఎవరూ లేరని తెలిసింది. ఆడిషన్‌కి వచ్చిన నలభై మందిలో పిస్తోలు మార్చింది ఎవరో తెలియాలంటే మరోసారి ఆ నలభై మందిని స్టూడియోకి పిలిచి వారి ముందు షూటింగ్ జరిపి విలన్ హీరోని నిజం పిస్తోలుతో కాల్చి చంపినట్టు సీన్ క్రియేట్ చెయ్యాలన్నాడు విజయ్. అలా చేసినప్పుడు పిస్తోలు మార్చిన వ్యక్తి గురించి ఏదైనా క్లూ దొరికే అవకాశం ఉందన్నాడు. దానికి నేను ఒప్పుకొని రహస్యంగా రవి, మధులను పిలిచి విషయమంతా చెప్పాను. విజయ్ వారికి తన ప్లాన్ వివరించాడు. వాళ్లిద్దరు దానికి ఒప్పుకున్నారు. సోమవారం షూటింగ్‌కి నేను మొత్తం నలభై మందిని మరోసారి ఆహ్వానించాను. ఆ రోజు మరో నకిలీ పిస్తోలుతో షూటింగ్ జరిపి, రవి చనిపోయినట్టు అందరికీ చూపించాం. ఇనస్పెక్టర్ విజయ్ స్టూడియోలోని మరో గదిలో కూర్చొని షూటింగ్ చూస్తున్న వారి కదలికల్ని, హావభావాల్ని సీసీ కెమెరాల ద్వారా పరిలీశించాడు. మధు పిస్తోల్ పేల్చాక రవి చనిపోయాడని తెలియగానే అందరు భయాందోళనలకు గురయ్యారు.

కాని మీరిద్దరు మాత్రం రిలాక్స్‌గా కనిపించారు. దాంతో పిస్తోలు మీరే మార్చి వుండొచ్చు అనిపించింది. కాని బలమైన ఆధారం లేకుండా మిమ్మల్ని అరెస్ట్ చెయ్యటం సాధ్యం కాదు కాబట్టి, దాని కోసం మరో నాటకమాడాం. దాని ప్రకారమే నేను రవి, మధుల రోల్స్ మీకు ఇస్తున్నట్టు చెప్పి అడ్వాన్సుగా కొంత డబ్బు ఇచ్చాను. మేం ఊహించినట్టే ఆ రోజు రాత్రి మీరు ఇంట్లో సెలబ్రేట్ చేసుకున్నారు. మీకు బాగా మత్తు ఎక్కినప్పుడు మా యూనిట్‌తో రహస్యంగా మేం అక్కడికి చేరుకున్నాం. అప్పటికే మా మేకప్‌మెన్ రవిని భయంకరమైన దెయ్యంగా మార్చాడు. సినిమా షూటింగ్ కోసం చేయాల్సిన మేకప్‌ను అతను ముందే చేయవలసి వచ్చింది. ఇక మా సినిమా తెర వెనక పనిచేసే సాంకేతిక బృందం మీ ఇంటి వరండాలో రహస్యంగా దాక్కొని కృత్రిమంగా ఉరుములు, మెరుపుల వాతావరణం సృష్టించి సన్నివేశాన్ని బాగా రక్తి కట్టించింది. అదంతా చూసి మత్తులో వున్న మీరిద్దరు రవిని నిజంగానే దెయ్యం అనుకున్నారు. రాంబాబు అంతవరకు రహస్యంగా దాచిన నకిలీ పిస్తోలు బయటికి తీసి రవిని బెదిరించాలనుకున్నాడు. స్టూడియోకి చెందిన ఆ పిస్తోలు బయటపడటంతో పోలీసులు వెంటనే మిమ్మల్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు!" అంటూ చెప్పటం ముగించాడు వినోద్.

"ఆ దెయ్యం నకిలీదంటే నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను సార్!" ఇంకా భయంలోంచి తేరుకోని మహేష్ అన్నాడు.

"అదే రవి నటన ప్రత్యేకత! మీలాంటి సహనటుల్నే బోల్తా కొట్టించాడంటే అతను సహజ నటుడని ఒప్పుకోక తప్పదు. అతను మరణించిన పాత్రలోనూ జీవించాడు. ముప్పైమంది నటుల్లో అతన్నే హీరో పాత్రకి నేను ఎందుకు ఎన్నుకున్నానో ఇప్పుడైనా మీకు అర్థమైందా!" విజయగర్వంతో అన్నాడు వినోద్.

రాంబాబు, మోహన్ సిగ్గుతో తలలు వంచుకున్నారు.

"అంతా బావుంది వినోద్. కాని నీలాంటి ఆధునిక భావాలున్న డైరెక్టర్ దెయ్యం సినిమా తియ్యటమే నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది!" నవ్వుతూ మిత్రుడితో అన్నాడు విజయ్.

"నిజమే. నా కథలో బలం లేదు. అయితే వీరిద్దరు దుర్మార్గులు నా స్క్రిప్టులోకి బలవంతంగా దూరటం వల్ల కథలో నాకు మంచి ట్విస్ట్ దొరికింది. పాత కథను పక్కన పెట్టి, నకిలీ పిస్తోలు, నకిలీ దెయ్యంతో ఇదే కథను సస్పెన్స్ థ్రిల్లర్‌గా మార్చేస్తాను! ఒక్కోసారి కల్పన కన్నా వాస్తవమే విచిత్రంగా ఉంటుందంటారు పెద్దలు. ఈ సినిమా విషయంలో అదే మాట నిజమైంది!" ఉత్సాహంగా అన్నాడు డైరెక్టర్ వినోద్.

# ప్రవంతి

పెండ్యాల ఆరవింద్
✆ 9492120264

> ***"చెడ్డపేరు పచ్చబొట్టులాంటిది.. అది జీవితాంతం మనల్ని వెంటాడుతుంది! మన ఆలోచనలు మన ప్రవర్తనను నిర్ణయిస్తాయి... ఆ ప్రవర్తనే మన మనోనిబ్బరాన్ని పెంచి వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుంది. కాబట్టి మన ఆలోచనలెప్పుడూ మంచివై ఉండాలయ్యా"***

నేను కాలేజి నుండి ఒకింత ఆలశ్యంగా ఇంటికి వచ్చాను. మా వాడు బయట ఆడుకుంటూ... నన్ను చూసి 'నాన్నొచ్చాడు' అంటూ నా దగ్గరకు వచ్చాడు. నేను కాళ్ళు కడుక్కొని ఇంట్లోకి వెళ్లి మంచంపై కూర్చొని, మా చిన్నుగాడిని ముద్దు చేస్తుండగా... పకోడి ప్లేట్ తెచ్చిపెట్టి ఎదురుగా కూర్చుంది వాళ్లమ్మ. అవి తింటూ...

"చిన్నూ! ఇంటిపని చేశావా?" అడిగాను.

"ఇంటిపని చేయటానికి నేనున్నానుగా..." అంది వాళ్లమ్మ కల్పించుకుంటూ..

నేను తీక్షణంగా ఓ చూపు విసిరి కోపాన్ని నిగ్రహించుకొని ఊరుకున్నాను.

"ఓహోహో! హోమ్‌వర్కా..." అని నవ్వుతూ, అంతటితో ఆగకుండా "చాల్లే ఆపండి, మీరు... మీ తెలుగూనూ..." అంది.

నాకు చిర్రెత్తుకొచ్చింది. నా కోపం చూసి నవ్వు ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ, మొఖం పక్కకు తిప్పుకున్న వాళ్ళమ్మ వైపు చూస్తూ... 'అయినా నా పిచ్చిగానీ... చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా... సంస్కారపూరిత నమస్కారాన్ని, వినమ్రపూర్వక వీడ్కోలును విడిచి, 'హాయ్ బాయ్' వంటి ఆంగ్ల మద్యం మరిగిన అర్భకులకు ఆవకాయవంటి ఆంధ్రా రుచి ఏమి తెలియును' అనుకుంటూ ఉండగా..

ఇంతలో మావాడు అందుకొని దీర్ఘంతీస్తూ... "హోమ్‌వర్కా! ఓ! చేశానాన్నా!" అన్నాడు నవ్వుతూనే.

ఎప్పుడూ వాడి చదువు గురించి పట్టించుకోని నేను 'ఏదీ! నీ పుస్తకాల సంచీ తీసుకురా' అనబోయీ, మళ్లీ నవ్వుతారేమోనని నన్ను నేను సంబాళించుకొని, "ఏదీ! నీ బ్యాగ్ తీసుకొనిరా!" అన్నాను యథాలాపంగా.

నాస్థితిని గమనించి మళ్లీ నవ్వబోయి...ఎర్రబడ్డ నా మొఖం చూసి తమాయించుకొని, "ఈ రాత్రికి తుఫాను వచ్చేలావుందిరా, చిన్నూ!" అంది వ్యంగ్యంగా వాళ్ళమ్మ.

నిజానికి ఆ బ్యాగే మా మధ్యలో తుఫాను రేపుతుందని మాకెవ్వరికీ అప్పుడు తెలియదు.


ఇంతలో చిన్నూ వెళ్లి బ్యాగ్ పట్టుకొచ్చాడు.

నేను వాళ్లమ్మవైపు చూస్తూ... "పానకంలో పుడకలా నువ్వెందుకిక్కడ, పని చూసుకో పో!" అన్నాను మళ్లీ మళ్లీ నవ్వుతుందని ఉడుక్కుంటూ.

“అబ్బో! గొప్ప” అని తిప్పుకుంటూ ముంగిట్లోకి వెళ్ళింది, పాత సినిమాల్లో నాయకురాల్లా.

చిన్ను బ్యాగ్‌లోనుంచి ఏదో చేతికొచ్చిన పుస్తకమొకటి బయటకు తీశాను.

ఆ పుస్తకం చూడగానే “ఈ బుక్ కాదు నాన్న ఈ బుక్ కాదు...” అన్నాడు తత్తరపడుతూ..



అది గమనించిన నేను “ఉండరా” అంటూ పుస్తకాన్ని తిరగేస్తూవుంటే.. అందులోంచి కొత్తవి రెండు యాభై రూపాయల నోట్లు క్రింద పడ్డాయి. అవి చూడగానే ఏవో అనుమానం, ఆవేదన మదిలో మెదిలాయి.

“ఎక్కడివిరా ఇవి?” అడిగాను సౌమ్యంగా.

“నావే నావే” అన్నాడు వాడు బెరుగ్గా.

“నిజం చెప్తావా... లేదా!” అంటూ అక్కడనుండి బయటకు పోబోతున్న వాడి చెయ్యి పట్టుకున్నాను.

“నావే నాన్న! నావే!” అంటూ అరుస్తున్నాడు వాడు.

ఎందుకో వాడు చెప్పేది నిజమని అనిపించలేదు నాకు. దాన్తో వాణ్ణి పట్టుకొని వీపు మీద నాలుగు వాయించాను. దాన్తో వాడు “రాము బ్యాగ్‌లోవి కొట్టేశాను” అన్నాడు వెక్కుతూనే.

వాడి అరుపులకు వాళ్లమ్మ వచ్చి వాణ్ణి నా చేతుల్లోంచి విడిపించి తీసుకువెళ్లింది.

వాడు దొంగతనం చేశాడన్న కోపమో, వాణ్ణి నా చేతులతో కొట్టానన్న వేదనో... అలా మంచంపై కూలబడి వెనక్కి వాలిపోయాను. గుండెల్లో సుడులు తిరిగే బాధ కళ్ళలోకి ఉబికివచ్చి, మోచేతి క్రిందుగా ధారలు కట్టాయి. అదిగో... అప్పుడే నాలోని అంతరాత్మ మేల్కొని ‘పాతికేళ్ళ క్రిందట నువ్వు చేసిందేమిటి?’ అని నన్ను ప్రశ్నించింది.

★★★

అవి ఆరో ఏడో చదువుతున్న రోజులు, ఊహలకు ఈకలు పుడుతున్న రోజులు, కొత్త స్నేహాలతో... క్రొంగొత్త లోకాలను సృష్టి చేసుకొనే రోజులు! ఒకనాడు నేను వెళ్లేసరికి మా కుర్రకుంకల కూటమి ఏదో తాగుతున్నారు.

"ఏంట్రా... తాగుతున్నారు!" అడిగాను వాళ్లు ఖాళీ చేసిన గ్లాసులవంక చూస్తూ..

"కూల్‌డ్రింక్" అన్నాడు బండోడు.

"మరి నాకేదిరా?" అన్నాను నేను.

"నువ్వు టూ లేటు" అన్నాడు బక్కోడు.

నాకు కోపం వచ్చి వచ్చేస్తుంటే... "ఒరే బొంగూ! రేపు నువ్వు కొనుక్కురారా... మనం తాగుదాం!" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన గుండోడు.

నేను గాలిలో అడుగులు వేసుకుంటూ ఇంటికి చేరాను. సాయంత్రం అమ్మ పాలల్లో బెల్లం కలిపి తాగమని ఇచ్చింది.

అప్పుడు "అమ్మా! నాకు కూల్‌డ్రింక్ కొనీవే!" అడిగాను గోముగా.

అమ్మ పాల యొక్క లాభాల గురించి, కూల్‌డ్రింక్ చేసే హాని గురించి వివరంగా చెప్పింది. ఊహూ! ఆ విషయాలు నా బుర్రకి ఎక్కలేదు! ఎలాగైనా కూల్‌డ్రింక్ తాగాలనే కోరిక నాలో మానులా పెరిగింది. తరువాత ఒక రోజు, నాన్న జేబులోనుంచి ఓ ఇరవై తీసుకొని మా వాళ్ళతో  కలిసి  థమ్సప్ తాగాను. తొలిసారి తాగడమో ఏమో... అది గొంతు పట్టుకుంది, దాని టేస్ట్ కూడా నాకు అంతగా నచ్చలేదు కానీ... కూల్‌డ్రింక్ తాగామన్న ఊహే సంతోషాన్నిచ్చింది.

ఆరోజు రాత్రి అమ్మ నాకన్నం పెడుతూ... "కూల్‌డ్రింక్ బాగుందా నానీ?" అడిగింది.

ఆ మాటకు నా గుండెలో రాయిపడింది. కంగారుతో పొలమారి దగ్గువచ్చింది. నా తలపై తడుతూ అమ్మ నాకు మంచినీళ్ళు తాగించింది.

"దాని టేస్ట్ నీకు నచ్చలేదు కదూ!" అని అడిగింది మళ్ళీ.

ఈసారి నేను మరింత ఆశ్చర్యపోయి... నేలచూపులు చూస్తూ అవునన్నట్టుగా తలాడించాను. అమ్మ నవ్వింది. దాంతో నాకు కొంత ధైర్యం వచ్చినప్పటికీ నాన్నకు చెప్తుందేమోనన్న భయం నన్ను వీడలేదు.

అలా రోజులు గడుస్తున్నాయి. కానీ... అమ్మ నవ్విన ఆ ఒక్క నవ్వుతో, నా ఎదక్షేత్రంపై కురిసిన జల్లు, నాలోని ఆలోచనా బీజాలకు వివేకాన్ని అంకురింపజేసింది. ఒడిదుడుకులకు తడబడినా, కాలంతో కలిసి ప్రయాణించే కుటుంబ పల్లకీలో కూర్చొని కేరింతలుకొట్టే వయసది. ఎంత రక్తం ఆవిరై చెమటగా చిందితే ఆ విత్తం ఆవిర్భవించిందో నా చిత్తానికందే వయసు కాదది!

ఒకనాడు మా కుంకలతో కలిసి ఎగురుతుండగా అమ్మ పిలిచింది. నేను లోపలికి రాగానే తలుపు దగ్గరకు వేసి, కర్ర తీసుకొని, "చెప్పు.. డబ్బులేంచేశావ్?" అడిగింది.

“ఏం డబ్బులమ్మా? నాకు తెలియదు!” అన్నాను.

“రేయ్! చంపేస్తాను. కూల్‌డ్రింకంటే, ఏదో ఇరవై రూపాయలు కదా, బిడ్డ సరదా పడ్డాడని వదిలేశాను! దాన్ని అలుసుగా తీసుకొని వందలు తీస్తావా?” అని నా చొక్కా పుచ్చుకొని గర్జించింది.

అపర కాళికలా వున్న అమ్మను చూసి నాకు తొలిసారి భయం వేసింది.

“నేను తియ్యలేదమ్మా!” అన్నాను వణుకుతూ.

“మళ్లీ అదేమాట, చెప్తావా లేదా...” అంటూ, వంగదీసి నాలుగు బాదింది.

ఎందుకనో అప్పుడు ఏడుపు రాలేదు. అలా కింద కూర్చుండిపోయాను. అమ్మ ఏదో గుర్తువచ్చినదానిలా డబ్బులు మళ్లీ లెక్కపెట్టింది. ఒక్కపరుగున వచ్చి నన్ను వాటేసుకొని ఏడవడం మొదలుపెట్టింది. అప్పటి వరకు ఎక్కడుందో గానీ... నాకూ దుఃఖం పొంగుకొచ్చింది. మాటలు మాయమైన ఆ సమయంలో మా మనసులు మేలిమై మరింత దగ్గరయ్యాయి..

“నేను కొడుతుంటే పారిపోలేదెందుకయ్యా!” తప్పు చేయకుండానే కొట్టాననన్న బాధ గొంతుకడ్డంపడుతుండగా అడిగింది అమ్మ.

ఆ మాట నా గుండెలోంచి దూసుకుపోయి మదిలోని మలినాన్ని తుడిచి మరింత కాంతివంతమయ్యేలా హృదయమనే అద్దాన్ని స్పష్టంగా, స్వచ్ఛంగా మార్చింది.

కొంతసేపటికి అమ్మ తేరుకొని, తన ఒడిలో వున్న నా తలని పైకెత్తి నా కళ్ళు తుడుస్తూ... “చెడ్డపేరు పచ్చబొట్టులాంటిది. అది జీవితాంతం మనల్ని వెంటాడుతుంది! మన ఆలోచనలు మన ప్రవర్తనను నిర్ణయిస్తాయి... ఆ ప్రవర్తనే మన మనోనిబ్బరాన్ని పెంచి వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుంది. కాబట్టి మన ఆలోచనలెప్పుడూ మంచివై ఉండాలయ్యా!” అంటూ నా నుదుటిపై ముద్దు పెట్టుకుంది అమ్మ.

ఆ మాటలలోని అంతరార్థం అప్పుడు నాకర్థం కాకపోయినా... ఏదో చైతన్యం నాలోకి ప్రవహించి, ఆ క్షణంలో మా ఇల్లే ఒక దేవాలయంగా... మా అమ్మే ఒక దేవతలా తోచింది నా కళ్ళకు!

★★★

‘ఏది నేరము? ఏది శిక్ష? పక్కవాడి బ్యాగ్‌లో డబ్బులు తీసిన చిన్నూది నేరమైనప్పుడు, నా ఇంట్లో నేను చేసింది నేరం కాకపోతుందా? చిన్నూ వలన డబ్బులు పోగొట్టుకొని, తన తల్లిదండ్రుల ముందు దోషిగా నిలబడ్డప్పుడు వాడనుభవించిన క్షోభ వీడికి తెలియాల్సిన అవసరంలేదా? నాలుగు దెబ్బలు కొట్టగానే నా బాధ్యత తీరిపోతుందా? వాడిలో పరివర్తన అంకురిస్తుందా? అన్న సంఘర్షణలోంచి తేరుకొని, కళ్ళు తుడుచుకొని కూర్చున్నాను.

బయట గదిలో వద్దని హఠం చేస్తున్న వాడికి అన్నం తినిపించే ప్రయత్నంలో ఉంది వాళ్లమ్మ.

“చిన్నూ!” పిలిచాను నేను.

వాడు నావంక ఒకసారి చూసి తలొంచుకున్నాడే కానీ, నా దగ్గరకు రాలేదు.

“నాన్నా, చిన్నూ!” మళ్ళీ పిలిచాను నేను.

ఏమనుకున్నాడో ఏమో నా దగ్గరకు వచ్చాడు. వాడి చేతులని నా చేతుల్లోకి తీసుకొని మెత్తగా పట్టుకున్నాను. వాడు నా కళ్ళల్లోకి చూశాడు. ఎర్రబడ్డ నా కళ్ళల్లో వాడికేం కనిపించిందో... మెత్తని వాడి చేతుల్లోకి నా చేతుల్లోంచి ఏం ప్రవహించిందో... నాకు తెలియలేదు కానీ, పాతికేళ్ళ క్రితం మా అమ్మలోంచి నాలోకి ప్రవహించిన చైతన్యం ఇప్పుడు చిన్నులోకి కూడా ప్రవహించిందన్న భావన... వాడు ‘నాన్నా’ అంటూ నన్ను చుట్టేసి బావురుమన్నప్పుడు నాకు కలిగింది. తరాలు మారినా తరతరానికీ ఆ చైతన్య స్రవంతిని ప్రవహింపజేస్తూ ఉండాలన్న విషయం స్పష్టమైంది.

# అయిష్టం

డా. మృణాళిని
✆ 9849065147

**విశిష్ట అతిథి కథ**

***"నీ జీవితంలో ఎంతో ముఖ్యమైన సంఘటనకు నీ వాళ్లు ఎవ్వరూ లైక్ కొట్టలేదురా... అయినా నువ్వు పట్టించుకోలేదు...." షూ లేస్ కట్టుకుంటున్న మధు చెయ్యి ఆగిపోయింది. తలెత్తి నాకేసి చూసాడు.***

మధు ఈ మధ్య చాలా అన్యమనస్కంగా ఉంటున్నాడు. అది గమనించాను గానీ, చెప్పే విషయమైతే తనే చెప్తాడులే, నేనెందుకు గుచ్చి గుచ్చి అడగడం అనుకుని ఊరుకున్నాను. ఇద్దరం బాంక్ ఆఫీసర్లం. కలిసి ఆఫీసుకు వచ్చి, కలిసి వెళ్తాం! పెట్రోలు దండగ చేయకూడదని, ఒక్కొక్కరోజు ఒక్కొక్కరి కారులో వెళ్తూ, కాలుష్యాన్ని అరికట్టడానికీ, రోడ్డు ఇరుకు తగ్గడానికీ మేం చేయగలిగింది చేస్తున్నాం. అంటే దాదాపు మేమిద్దరం కలవని దినం ఉండదు. ఆఫీసులో ఏ గొడవలైనా ఉన్నా నాకు తెలీనివేమీ కావు. నాకు తెలిసి ఈ మధ్య గొడవలేమీ లేవు కూడా. మరి ఎందుకు దల్‌గా ఉంటున్నాడు?

మూడు రోజులు గడిచాక ఆలోచన వచ్చింది! ఆరోగ్యం బాగాలేదేమో... డాక్టర్ ఏవైనా చెప్పలేని రోగాలను చెప్పాడేమో! ఈ మధ్య డాక్టర్లకు గాభరా పెట్టడం హౌస్ సర్జెన్సీ నుంచే నేర్పిస్తున్నట్టున్నారు. గట్టిగా తుమ్మినా బయోప్సీ చేస్తున్నారు. అదే అయ్యుంటుంది. కానీ ఆ ఆలోచనను కూడా కొట్టిపారేసాను. అతనిలో అనారోగ్య లక్షణాలు ఏమీ లేవు. ఆఫీసుపని దివ్యంగా చేస్తున్నాడు! విచిత్రమేమిటంటే ఆఫీసునుంచి వెళ్లేటప్పుడు బాగానే ఉంటాడు. కానీ ఉదయం ఆఫీసుకు వచ్చేప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్టు చికాగ్గా ఉంటాడు. రోజూ వాళ్లావిడ సరోజతో పోట్లాడుతున్నాడా?

ఇదేదో పొద్దున్నే మాత్రమే వచ్చే జబ్బా? మగవాడి మార్నింగ్ సిక్‌నెస్‌కి కారణాలు తెలీడం కష్టమే. ఆ రోజు ఇద్దరం నా కారులో వెళ్తున్నాం.

"మధూ. ఒకటడగనా?" ప్రారంభించాను.

"ఊ"

"ఎందుకు ఈ మధ్య దల్‌గా ఉంటున్నావు?'

"లేను..."

'ఉన్నావు..."

"లేను..."

మరికొన్ని ఉన్నావులూ, లేనులూ అయ్యాయి. తను బాగానే ఉన్నాడంటున్న మనిషిని ఎందుకు బాగాలేవని ఎలా అడగడం?

ఆ తర్వాతి రోజు అతని కారు డ్యూటీ! నేను పావుగంట ముందు అతనింటికి నడిచివెళ్లాను. మా ఇద్దరి ఇళ్లకూ మధ్య మరో రెండిళ్లు మాత్రమే. అతను లోపల ఉన్నట్టున్నాడు. సరోజ టేబిల్ మీద టిఫిన్ ప్లేట్లు తీస్తోంది.

"ఓ శ్రీరామ్! ఇవాళ త్వరగా వచ్చేసావే! కూర్చో... మధు బట్టలు మార్చుకుంటున్నాడు. వస్తాడు!" అంది.

నేను టేబిల్ దగ్గరకు వెళ్లి సరోజతో గొంతు తగ్గించి అన్నాను

"సరోజా! ఈ మధ్య మధుకి ఒంట్లో బాగుండడం లేదా? డల్‌గా ఉంటున్నాడేం?"

సరోజ నాకేసి ఆశ్చర్యంగా చూసింది




"మధుకి ఆరోగ్యం బాగాలేదా?"

"ఏడ్చినట్టుంది. నేను నిన్ను అడుగుతున్నాను. అతనికి బాగా లేకపోతే నీకంటే బాగా ఎవరికి తెలుస్తుంది?" అన్నాను కొంత చికాగ్గా. మేం ముగ్గురం చిన్నప్పటి స్నేహితులు కావడం వల్ల, మధును తిట్టేన్ని తిట్లూ నేను సరోజని కూడా తిట్టగలను.

"నాకెందుకు తెలుస్తుంది?" లోపలికి వెళ్లి కాఫీ కలుపుతోంది. నాకే కాబోలు. "మధు నీతో గడిపే సమయమే ఎక్కువ! అసలు నువ్వు చూస్తున్నావు కదా... ఆఫీసుకు వెళ్లేప్పుడు నాకు 'బై' చెప్పడం కూడా మానేసాడు. అయినా నేనూ అంతేలే! ఇంటికి వచ్చాక నేనూ అలిసిపోయి వుంటాను. ఇద్దరం పిల్లలతో కాస్సేపు కబుర్లు చెప్తాం. నేను రేపటి వంటకు ఏర్పాట్లు చేసుకుంటాను. కాస్సేపు టీవీ! నాకైతే తొమ్మిదిన్నరకు నిద్రపోవడం అలవాటు. కష్టపడి పదిదాకా లాగగలను. అప్పుడు పలకరిద్దామని ప్రయత్నించినా, తను ఆ టైముకి కంప్యూటర్ ముందు సెటిలవుతాడు. ఎప్పుడు పడుకుంటాడో కూడా తెలీదు! ఆదివారాలు మా బలవంతం మీద ఎక్కడికైనా వచ్చినా, ఎక్కువ సేపు తన కంప్యూటర్‌తోనే గడుపుతాడు. తనకేదైనా అనారోగ్యం ఉంటే తను చెప్పాల్సిందే. నేనంత గమనించను!" నిర్మొహమాటంగా అంది.

అదీ నిజమే! జర్నలిస్టుగా పనిచేసే సరోజకు, అటు ఆఫీసు పనీ ఎక్కువగానే ఉంటుంది.

"ఇంతకూ నువ్వు ఎప్పట్నుంచి గమనించావు తన మూడ్‌ని?" కాఫీ కప్పు ఇస్తూ, సరోజ మళ్ళీ అడిగింది. నాకప్పుడు కాఫీ

తాగాలని లేకపోయినా, తాగకపోతే అలుగుతుందని తీసుకున్నాను.

సరోజ చాలా తొందరగా అలకపాన్పు ఎక్కుతూంటుంది. అది కూడా చిన్నచిన్న విషయాలకే. పెద్ద విషయాల్లో చాలా పరిణతితో ఉంటుంది. పురాణాల్లోలా ఒక అలకాగృహం కట్టిస్తే, కాస్త సేపు ఆమె నుంచి రిలీఫ్ దొరుకుతుందని అపుడపుడూ మధు అంటాడు కూడా!

“ఈమధ్యే. ఒక వారం రోజుల నుంచి అనుకుంటున్నాను! మేం పొద్దున్నే కార్లో వెళ్తున్నప్పుడు ఆ రోజు పేపర్, టీవీ న్యూస్‌ల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఈ మధ్య నేను స్వగతాలు చెప్పుకోవాల్సివస్తోంది. వాడు ‘ఊ’ ‘ఆ’ అంటూ చంపుతున్నాడు. చివరికి వాడి ఫేవరెట్ అర్ణబ్ గోస్వామిని తిట్టినా రెచ్చిపోవడం లేదు!”

‘ఓ... అర్ణబ్ గోస్వామిని తిడితే ఊరుకోవడం ... నిజంగా ఏదో ప్రమాదమే” సరోజ నవ్వింది.

నేనూ నవ్వాను. మధు వచ్చాడు. ముఖం సీరియస్‌గా ఉంది.

“ఏమిటీ ఇద్దరూ నవ్వుతున్నారు?” అన్నాడు.

“నీమీదే జోక్ వేసుకుంటున్నాం” అతని ముఖం పరిశీలనగా చూస్తూ అన్నాను. అతను నవ్వలేదు.

“సరేగానీ పద. లేటవుతోంది” అన్నాడు నాతో.

సరోజ కూడా అతనికేసి పరిశీలనగా చూస్తోంది. ఇటీవల అతని ముఖం ఎక్కువగా చూస్తున్నట్టు లేదు తను. వెంటనే అనేసింది “నీకేదైనా సమస్య ఉందా?”

నేను నుదురు కొట్టుకున్నంత పని చేసాను. ఎవరైనా ఇలాంటి ప్రశ్నలు కాస్త సమయం, సందర్భం చూసి అడుగుతారు. సరోజ అంతే, ఎప్పుడు ఏం అనాలనిపిస్తే, అది అనేస్తుంది!

“సమస్యా, నాకా?” మధు నిర్ఘాంతపోయినట్టు చూసాడు.

“ఆహా... నువ్వు డల్‌గా ఉంటున్నావన్నాడు శ్రీరామ్! నేనైతే గమనించలేదనుకో... ఆరోగ్యం బాగాలేదా? ఎవరైనా అమ్మాయిని ప్రేమిస్తున్నావా?”

నేనీసారి నిజంగానే నుదురు బాదుకున్నాను! మధు ఫకాల్న నవ్వాడు. వాడు నవ్వడం చూసి చాలా రోజులైందేమో... నేను కూడా కృత్రిమంగా ‘హె హె హె’ అంటూ నవ్వాను. సరోజ మామూలుగానే నాకేసి చూసింది.

“చూసావా? బాగానే ఉన్నాడు. జోకులేస్తే నవ్వుతున్నాడు. నీ దోస్తుకు ఏమీ కాలేదు!” తన కర్తవ్యం నెరవేర్చినట్లు లేచి లోపలికి వెళ్లిపోయింది.

నేను మధు కేసి చూసాను. అతని ముఖం మళ్లీ గంభీరంగా ఉంది. కారులో మామూలే! నేను మాట్లాడ్డం, అతను ఊ కొట్టడం!

★★★

ఆరోజు తర్వాత, నేను సరోజతో మధు విషయం మాట్లాడలేదు. కానీ మధు ప్రవర్తనలో పెద్ద మార్పు రాలేదు. ఒకరోజు మధ్యాహ్నం లంచ్ సమయంలో మా కొలీగ్స్ విజయ, వర్ధని ఒకే కంప్యూటర్ ముందు కూర్చుని తెరకేసి చూస్తూ గుసగుసలాడుతున్నారు. నేను మంచినీళ్ల సీసా నింపుకోడానికి వాళ్ల వెనకనుంచి వెళ్తూ, వాళ్లు చూస్తున్న స్క్రీన్ కేసి చూసాను. ఫేస్‌బుక్. ఇద్దరూ తెగ మురిసిపోతున్నారు. విజయ అంటోంది.

"అది నా 18 ఏళ్లప్పటి ఫోటో! ఎన్ని లైకులు తెలుసా? ఎన్ని కామెంట్స్. మీనాకుమారిలా ఉన్నానని ఒకరూ, కాదు సావిత్రని మరొకరూ... ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో!'

"విజయగారూ..." నేను గట్టిగా అన్నాను. ఆవిడ ఉలిక్కిపడి, కంప్యూటర్ స్విచ్చి కాస్తా నొక్కేసింది.

"ఆఫీసులో ఫేస్‌బుక్ చూడడం నిషిద్ధమని మరిచిపోయారా?' తాపీగా అన్నాను.

"మేనేజర్‌కు చెప్పరు కదా" గాభరాగా అంది.

"నేనేమైనా స్కూలు పిల్లాణ్నా చాడీలు చెప్పడానికి? అయినా ఒక రూలంటూ ఉన్నాక దాన్ని గౌరవించాలండీ!" చికాగ్గా అని నా సీటు దగ్గరికి వెళ్లాను. అక్కడ మధు తినడం ఆపి లేచి నించుని వున్నాడు. విజయ క్యూబికల్ వైపే చూస్తున్నాడు. చాలా ఉద్వేగంగా ఉంది ముఖం. నేను ఏదో అనబోతూండగా నన్ను తోసుకుని విజయ దగ్గరికి వెళ్లాడు.

"మీరు ఫేస్‌బుక్‌లో ఉన్నారా? మీకు లైకులు వచ్చాయా?" అడిగాడు.

నా మాటల వల్ల వాడిపోయిన విజయ ముఖం ఇప్పుడు వెలగడం గమనించాను.

"అవునండీ. నా చిన్నప్పటి ఫోటో... చాలా గ్లామరస్‌గా ఉండేదాన్నిలే! అది పెడితే వందలకొద్దీ కామెంట్స్, లైకులు!"

మధూ 'కంగ్రాచ్యులేషన్స్' ఉత్సాహంగా అంటూ చేయి చాపాడు. అతని ఎంగిలి చేతికేసి చూసి తన చెయ్యి వెనక్కి తీసేసుకుంది విజయ. తను కూడా నాలిక్కరుచుకుని 'సారీ' అంటూ రెస్ట్‌రూంలోకి వెళ్లిపోయాడు.

నేను నిర్ఘాంతపోయి చూసాను. నాకేమీ అర్థం కాలేదు. మామూలుగా విజయకూ, మధుకు పెద్దగా పడదు. ఆవిడ పని చాలా నెమ్మదిగా చేస్తుంది. మధు విసుక్కుంటూ ఉంటాడు. ఇవాళ ఆవిడతో అంత ఆనందంగా మాట్లాడ్డం...

మరుసటిరోజు నుంచి విజయతో మధుకు కబుర్లు ఎక్కువయ్యాయి. నాకు వింతగా, అనుమానంగా కూడా ఉంది. సరోజతో చెప్దామా అనుకున్నాను కూడా! ఛ. అని మళ్లీ నా మీద నాకే విసుగేసింది. నేనో గాసిప్ గాడిదలా తయారవుతున్నానేమిటీ అని! ఒకరోజు మధు విజయతో మాట్లాడుతుంటే దొంగలా పక్క క్యూబికల్‌లో దూరి కూర్చుని విన్నాను.

మధు గొంతులో దిగులు. "ఇంకా రాలేదు విజయగారూ. ఇప్పటికి పది రోజులైంది ఆ కవిత పోస్టు చేసి..."

"నేను పెట్టాను కదా లైక్?" అనునయంగా అంటోంది విజయ.

"మీరు, వర్ధనిగారు పెడితే సరిపోతుందా? ఉన్నదే తక్కువమంది ఫ్రెండ్స్. వాళ్లలో మీరిద్దరే నాకు సమాధానం ఇస్తున్నారు. అది కూడా నేను అడిగాక!" కొంత నిష్టూరంగా అన్నాడు.

'పోనీ ఫ్రెండ్ రిక్వెస్టులు పెట్టండి. కొత్తవాళ్లు చేరతారుకదా!"

"పెడుతూనే ఉన్నా! కొంతమందికైతే అయిదారు సార్లు పంపివుంటాను... నాకిష్టమైన రచయితలకూ, పాపులర్ మనుషులకూ. ఊహూ. ఎవ్వరూ నన్ను ఆక్సెప్ట్ చేయడంలేదు!" దుఃఖం ఒక్కటే తక్కువ మధుకి.

"మొన్నయితే ఒక సినిమా రివ్యూ కూడా పెట్టాను. కవిత్వమంటే అందరూ చదవరు కదా. సినిమా అంటే చదువుతారని... ఊహూ... ఎవ్వరూ పట్టించుకోలేదు!"

నాకు మెల్లిగా అర్థమవుతోంది. రాత్రిపూట అతను కంప్యూటర్ ముందు ఎందుకు సెటిలవుతున్నాడో... పొద్దున్న ఎందుకంత దిగాలుగా ఉంటున్నాడో! ఒకప్పుడు ఎన్ని పుస్తకాలు చదివేవాడు! నాకిష్టం లేదు మొర్రో అన్నా హిందుస్తానీ సంగీతం రికార్డులు నాకు బలవంతంగా వినిపించి, ఎలా చంపుకు తినేవాడు? ఎంత ఉత్తేజంగా ఉండేవాడు! అసలు దాని కంటే ముఖ్యంగా...

మరుసటిరోజు నా వంతు కారు తేవడం. మధు ఇంటి ముందు కారు ఆపాను. లోపలికి వచ్చాను. మధు బూట్లు వేసుకుంటున్నాడు.

"వస్తున్నాను పద" అన్నాడు. సరోజ ఎప్పటిలాగే టేబిల్ శుభ్రం చేస్తోంది. ఆవిడన్నీ టైము ప్రకారం చేస్తుంది. నేను కూర్చున్నాను.

"మధూ... నీకు నీ పెళ్లి గుర్తుందా?"

"తెలివితక్కువ ప్రశ్నా నువ్వూనూ. పొద్దున్నే లేచి..." అన్నాడు. సరోజ నాకేసి అర్థం కానట్టు చూసింది.

"అహ... అలా కాదు. విను! నీ పెళ్లి మీ ఇంట్లో ఎవ్వరికీ ఇష్టం లేదు... సరోజ ఇంట్లో కూడా. అప్పటికింకా కులాంతర వివాహాలు అంత కామన్ కాదు కదా..."

"అయితే? ఇప్పటికీ మా నాన్న నాతో మాట్లాడ్డు. సరోజ ఇంటి వాళ్లయితే రానే రారు. తెలిసిందేగా!" మధు చికాగ్గా అన్నాడు.

"నీ జీవితంలో ఎంతో ముఖ్యమైన సంఘటనకు నీ వాళ్లు ఎవ్వరూ లైక్ కొట్టలేదురా... అయినా నువ్వు పట్టించుకోలేదు..."

షూ లేస్ కట్టుకుంటున్న మధు చెయ్యి ఆగిపోయింది. తలెత్తి నాకేసి చూసాడు.

తటపటాయిస్తూనే మళ్లీ అన్నాను "నువ్వు విజయతో మాట్లాడుతుంటే విన్నాలే! ఒక ఫోటోకు, ఒక కవితకు లైక్స్ రాలేదనీ, ముక్కూమొహం తెలీని వాళ్లు నీతో 'స్నేహం' చెయ్యలేదనీ జీవితేచ్ఛ నశించినవాడిలా తయారయ్యావు. నువ్వు నమ్మిన నీ ప్రేమకోసం, నీ స్వంతవాళ్లను అన్‌ఫ్రెండ్ చేసేసిన మధు ఏమయ్యాడా అని చూస్తున్నా!" లేచి కారు దగ్గరికి వెళ్లాను. మధు ఇంకా రాలేదు.

సరోజకు బై చెబుతున్నాడేమోనని నా ఆశ.

# గుడిలో పువ్వు

జీడిగుంట రామచంద్రమూర్తి

**కథా మార్గదర్శి కథ**

***"బొడ్డు కోయకుండానే తనువు చాలించే పసిబిడ్డలా– చెట్టుకొమ్మనుంచి విడివడకుండానే నా జీవితం ముగిసిపోతుందేమోనని తల్లడిల్లిపోయాను స్వామీ. అలాంటి నేను, ఎలాగో ఓ మాలలో చేరి నీ కంఠసీమను అలంకరించి, నీ స్పర్శతో తరించబోతున్నానని సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. తీరా ఆలయంలోకి వచ్చాక గర్భగుడిలోకైనా రాలేక కిందపడిపోయాను. అయినా నీ కనులముందు తనువు చాలించబోతున్నాననుకుంటూ సంతృప్తి చెందాను. ఈ చివరి క్షణాల్లో, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఆ భక్తుడెవరో నన్నుచూసి జాలిపడి నీ దగ్గరకు చేర్చాడు. ఇంతకుమించిన అదృష్టం నాకు అవసరంలేదు.***

అది భద్రగిరి!

భద్రుని ప్రార్థనకు ప్రసన్నుడైన శ్రీమన్నారాయణుడు, అతని కోరిక మేరకు చతుర్భుజాలు ధరించి, వామాంకాన సీతను హత్తుకొని, వామపార్శ్వాన లక్ష్మణుడు ఉండగా, పశ్చిమాభిముఖుడై – శ్రీ సీతారామచంద్రమూర్తిగా వెలసిన మహా పుణ్యక్షేత్రం!

అది పుష్యమాసం!

శుక్లపక్ష ఏకాదశీ పర్వదినం... వైకుంఠ ద్వారాలు తెరచుకున్న శుభఘడియలు... రాత్రి పదకొండు గంటల సమయాన... రామదాసుగా కీర్తించబడిన భక్తశిఖామణి కంచర్ల గోపన్న ఆ పుణ్యక్షేత్రంలో నిర్మించిన రామాలయం, దీపాల తోరణాలతో దేదీప్యమానమై అలరారుతోంది.

గర్భగుడిలో పరివేష్ఠితులైన సీతారామలక్ష్మణమూర్తులకు పవళింపు సేవ జరిపిన అర్చకులు, తలుపులు మూసి గృహోన్ముఖులయ్యారు. ఆలయ ప్రాంగణంలోనూ పరిసరాల్లోనూ కూడా భక్తుల కలకలం సద్దుమణిగింది.

ఆరోజు తెల్లవారుజామునే నిద్రలేచి, భక్తిప్రపత్తులతో పవిత్ర మంత్రోచ్చాటనల మధ్య అర్చకులందించిన అభిషేకాది పూజలకు రవ్వంత అలసిపోయి, అటుపై – ఛత్ర చామరాది దివ్యరాజ లాంఛనాల నడుమ గరుడవాహనంపై పురవీధుల్లో జరిపిన ఊరేగింపుకీ అక్కడి భక్తుల తాకిడికీ మరింత సొలసిపోయిన శ్రీరామచంద్రుడు – ఒకింత సేపు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు, సీతాసమేతుడై ఆలయ సమీపంలో ఉన్న పావన గౌతమీ నదీ తీరానికి వచ్చాడు.

దాశరథి రాకతో ఆ నదీమతల్లి ఆహ్లాదభరితయై ఉప్పొంగిపోతూ ఆయన పాదాలు కడిగింది. నది లోపలి కెరటాలపై హేమంత ఋతు వెన్నెల మరింత చల్లగా జాలువారుతూ మురిసిపోతోంది. ఆ వెండివెన్నెల కాంతుల్లో తళతళా

మెరిసిపోతున్న నదీజలాలపై, తన కళలన్నింటినీ ప్రదర్శిస్తూ నింగిలోని చంద్రుడు రాగరంజితుడై సీతారాములకు నీరాజనాలు పలుకుతున్నాడు.

అప్పటికి భద్రాద్రి యావత్తూ నిద్రలోకి జారుకుంది... అంతటా నిశ్శబ్దం అలుముకుంది... ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ, పదమంజీరాలు ఘల్లుఘల్లున సన్నటి సవ్వడి చేస్తూండగా జారిపోతున్న మేలిముసుగును సవరించుకుంటూ శ్రీరాముని చేయి పట్టుకుని, సీతమ్మతల్లి నదీతీరం వెంబడి నెమ్మదిగా నడుస్తోంది.

ఆమె పదాల చిరుపల్లవింతలు వింటున్న భూమాత పుత్రికాగమన పరవశురాలై కనులనిండా ఆనందాశ్రువుల్ని నింపుకుంటోంది.



చుట్టుపక్కల తోటల్లో అరవిరిసిన బంతులూ చామంతులూ తమ సుగంధ పరిమళాలతో ఆ లక్ష్మీ శ్రీమన్నారాయణ స్వరూపులకు సుస్వాగతం పలుకుతున్నాయి. పూలతోటలకు పహారా కాస్తున్నట్టుగా నిలబడివున్న మహావృక్షాలు– ఆ దంపతుల దివ్యదర్శనం లభించినందుకు పొంగిపోతూ కొమ్మలు వంచి నమస్కరిస్తున్నాయి. వారిని తమ పత్రాలతో అభిషేకిస్తున్నాయి.

అక్కడి పరిసరాల్ని తదేకంగా పరికిస్తూ– ఆ ప్రకృతి సౌందర్యాల్ని తనివితీరా ఆస్వాదిస్తూనే, చాలాసేపు నడిచి నడిచి, వారిద్దరూ నది ఒడ్డున ఉన్న ఓ ఇసుకతిన్నె చేరుకుని దానిపై ఆసీనులయ్యారు.

"ఈరోజు ఎంతో సుదినం!!" శ్రీరాముని సరసనే కూర్చున్న జానకీమాత, ఆయన వక్షస్థలంపై తలవాల్చి, అరమోడ్పు కన్నులతో స్వామిని చూస్తూ అంది.

"అవును సీతా! ఈరోజు వైకుంఠ ఏకాదశి కదా... మహాపర్వదినం మరి!" స్వర్ణకాంతులీనుతున్న ఆమె కపోలాలను సుతారంగా స్పృశిస్తూ అన్నాడు శ్రీరామచంద్రుడు.

"పర్వదినాలూ పండుగలూ మీకు! నాకు మాత్రం, ఈ నదీతీరాన ఇలా ప్రకృతిమాత ఒడిలో ఒకింతసేపు విశ్రమించే మహద్భాగ్యం కలిగినందుకు, ఇది శుభదినం" చెప్పిందామె.

శ్రీరాముడు ఆమె మనోగతాన్ని గ్రహించాడు.

"నిజమే! పదునాలుగేండ్లు నాతో వనవాసం నెరపిన నీకు– అంతఃపురంలోని ఆడంబరాలకంటే, అమూల్యమైన ఆభరణ సంపదకంటే, చెలికత్తెల సపర్యలకంటే– ఈ నదీతీరం పొడవునా ఉన్న అరణ్యప్రాంతం లోని కొండలూ కోనలూ... వాగులు వంకలూ... పక్షులూ వృక్షాలూ... పండ్లూ పువ్వులూ... నెమళ్ళూ జింకలూ... ఇవే ప్రీతిపాత్రమని నాకు తెలుసు" ఆమెను ఆప్యాయంగా మరింత చేరువకు తీసుకుని, చిరుగాలులకు ఆమె నుదుటిపై నాట్యంచేస్తున్న ముంగురుల్ని ముద్దాడుతూ చెప్పాడు.

"ధన్యురాలను! నా మనసు గ్రహించి, అపురూపమైన ఈ అవకాశాన్నికల్పించారు. ఇందుకు కృతజ్ఞతగా మీ గాఢపరిష్వంగంలో కరిగిపోగలనే తప్ప మరే కానుకా సమర్పించుకోలేని సామాన్యురాల్ని" సంపంగి తరువుకి అల్లుకుపోయే మల్లెతీగలా, ఆమె శ్రీరామచంద్రుని మెడచుట్టూ చేతులు బిగించి ఆయన కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది.

వారి ఏకాంతానికి అడ్డురాకూడదన్న ఆలోచనతో కాబోలు– చంద్రుడు మబ్బుల చాటుకి తప్పుకున్నాడు, వాయుదేవుడు కూడా తన దారి మరల్చుకుని, వారిమధ్య నుంచి దూరంగా జరిగిపోయాడు. ఇంతలోనే, ఏదో గుర్తుకువచ్చినవాడిలా శ్రీరాముడు ఆమె పరిష్వంగం నుంచి విడివడి అన్నాడు– "అపురూపమైన ఈ అవకాశంకంటే, అరుదైన కానుకను నీకు ఇవ్వబోతున్నాను".

ఆ కానుక 'ఏమైవుంటుందా?' అని ఆత్రంగా చూసింది వైదేహి.

అప్పుడు కోదండపాణి, తన అంబులపొదిని చేతిలోకి తీసుకున్నాడు. అందులోని దివ్యాస్త్రాల్ని పక్కకు ఒత్తిగించి, లోపలనున్న ఓ 'పువ్వు'ని తీశాడు.

"ఈ పుష్పాన్ని నీ సిగలో అలంకరించుకో సీతా!" అంటూ దాన్ని ఆమెకు అందించాడు. అది మామూలు ముద్దబంతిపువ్వు! కానీ ముద్దుగా మాత్రంలేదు. రేకులు పూర్తిగా విచ్చుకోకుండానే, వడిలిపోయినట్టుగా... వాసననూ వర్ణాన్నీ కూడా కోల్పోయి నిస్సారంగా కనిపిస్తోంది. నెలలు పూర్తిగా నిండకముందే, అంగవైకల్యాన్ని కూడా జతచేసుకుని పుట్టిన పసిబిడ్డలా– కొంత విచిత్రంగా కనిపిస్తోంది.

దానివైపు ఆశ్చర్యచకితయై అలాగే చూస్తూండిపోయిందామె. వజ్రవైడూర్యాలు పొదిగిన అంగుళీయాన్నో, మాణిక్యాలనడుమ ముత్యాలసరాలను పేర్చికూర్చిన కంఠాభరణాన్నో కానుకగా ఇవ్వగల తన దైవం– అతి సాధారణమైన అలాంటి పువ్వును ఇవ్వటం, దాన్ని తన సిగలో అలంకరించుకొమ్మని కోరటం విడ్డూరమనిపించింది.

“ఏమిటి దేవీ? దానివైపు అలా వింతగా చూస్తున్నావెందుకూ?” అడిగాడు శ్రీరాముడు.

“ఇది అరుదైన కానుక ఎలా అయిందా– అని చూస్తున్నాను.”

“చెప్తాను... విను” అంటూ ఆ ‘పువ్వు’ని మళ్ళీ తన చేతిలోకి తీసుకుని, ఆప్యాయంగా దాని పత్రాలను నిమురుతూ చెప్పసాగాడు శ్రీరామచంద్రమూర్తి.

“...... ఈ నదీతీరానికి సమీపంలో ఓ పూలతోట ఉంది. బంతి, చామంతి, మల్లె, మందార పూలచెట్లతో తోటంతా ఎప్పుడూ పరిమళిస్తూ ఉంటుంది. ఆ తోటలోని ఓ చెట్టుకి పూసిన పువ్వు ఇది. ప్రతిరోజూ ఆ చెట్టుకొమ్మలకు కొన్ని మొగ్గలు పుట్టుకొస్తూంటాయి. ఆ మొగ్గలన్నీ రెండుమూడు రోజుల్లోనే పువ్వులై వికసిస్తూంటాయి. వాటినన్నింటినీ తోటమాలి ఎప్పటికప్పుడు కోసి, తన భార్యతో మాలలల్లించి, నా ఆలయ ప్రాంగణంలో అమ్మిస్తూంటాడు. గుడికి వచ్చే భక్తులు కొందరు ఆ మాలల్ని కొని, మన విగ్రహాలకు అలంకరింప చేయిస్తూంటారు. ఇంకొందరు స్త్రీలు ఆ మాలల్ని విడదీసి, అందులోని పూలను తమ జడల్లో తురుము కుంటారు. అయితే ఆ అవకాశం, అదృష్టం ఈ పువ్వుకి దొరకలేదు. ఆ చెట్టుకి ఈ పువ్వు పుట్టటమే జవజీవాలు కోల్పోయినదానిలా పుట్టింది. రెండుమూడు రోజులు గడిచినా రెక్కలు విప్పుకుని పూర్తిగా వికసించలేకపోయింది. తనతోపాటే పుట్టుకొచ్చిన పువ్వులన్నీ పసిడికాంతులీనుతూ విరిసిపోయి, పరిమళాల్ని కురిపిస్తూ– తోటమాలి దృష్టిలో పడటం, అటుపై అవన్నీ మాలలై తమ జన్మను సార్థకం చేసుకోవటం– ఈ పువ్వు గమనించి, ఆ అదృష్టం తనకు రానందుకు ఎంతో చింతించేది. తనను కూడా కొమ్మనుంచి తెంపి, మాలలో చేర్చమంటూ ఆ తోటమాలిని మూగగానే ప్రార్థించేది. కానీ, ఆ ప్రార్థన అతనికి వినిపించలేదు. ఇది అతన్ని ఆకట్టుకోలేక క్రమేపీ తన రూపురేఖల్ని కోల్పోసాగింది. తక్కిన పువ్వులన్నీ దీన్ని చూసి జాలిపడకపోగా– అపహాస్యం చేస్తూంటే భరించలేకపోయింది. తనకు తానుగా నేలరాలి, ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకుంది. ఇవాళ వైకుంఠ ఏకాదశి కావటంతో, తోటలోని పువ్వులన్నింటినీ తొందరగా కోసి, మాలలల్లించి– ఆలయం దగ్గర ముందుగా తనే అమ్మించాలన్న ఆశతో– తెల్లవారుజామునే తోటకు వచ్చాడు మాలి. ఆ చీకట్లో, ఏ పువ్వు ఎంతగా విరిసిందో కూడా చూడక గబగబా చెట్లనున్న పూలనన్నింటినీ తెంచి బుట్టలో వేసుకున్నాడు. అప్పుడే ఇది కూడా అతని బుట్టలోకి చేరుకుంది. తర్వాత అతని భార్య అల్లిన ఒక మాలలో, మధ్యన ఒదిగిపోయింది. జీవితపు ఆఖరి నిమిషాల్లోనైనా తన పుట్టుకకు పరమార్థం చేకూరిందని ఎంతో సంబరపడిపోయింది. తెలతెలవారుతూండగానే, తోటమాలి భార్య పూలమాలల్ని విక్రయించేందుకు ఆలయ ప్రాంగణాన్ని చేరుకుంది. వచ్చిన గంట వ్యవధిలోనే ఆమె బుట్టలోని మాలలు చాలావరకూ అమ్ముడైపోయాయి. ఈ పువ్వుని కూర్చిన దండ మాత్రం చాలాసేపు అలాగే ఉండిపోయింది. అందులో ఉసూరుమంటూ కనిపిస్తున్న ఈ పువ్వుని చూసి, ఎవరూ కొనకుండానే పక్కన పెడుతున్నారు. ‘దిష్టిబొమ్మలా మనమధ్యన చేరింది. దీనివల్ల మనక్కూడా మోక్షం లేకుండా పోతోంది,’ అంటూ దండలోని తక్కిన పువ్వులు దీన్ని ఈసడించుకున్నాయి. సరిగ్గా ఆ సమయంలోనే, ఓ వృద్ధుడు హడావుడిగా ఆలయంలోకి వెడుతూ ఆ పూలమాలను కొన్నాడు. నా నామస్మరణ చేస్తూ భక్తజన సందోహం వెంట వరుసలో నడుస్తూ– గర్భగుడి ముందుకు వచ్చాడు. ఒకవైపు మంత్రోచ్చారణ చేస్తూనే, గుడిలో పూజారి మరోవైపు భక్తులిచ్చే మాలల్ని

అందుకుంటూ వాటిని మనకు అలంకరిస్తున్నాడు. అదిగో... అప్పుడే, అలా అందుకుంటున్నపుడే అసలే నిస్సత్తువగా ఉన్న ఈ పువ్వు– ఆ విసురుకీ అప్పటి తాకిడికీ తట్టుకోలేక అక్కడే– గర్భగుడిముందు నేలపై రాలిపోయింది. పూజారి గమనించలేకపోయాడు. పైగా అటూఇటూ నడుస్తున్నపుడు– ఈ పువ్వుమీద అడుగులు వేస్తున్నాడు. ఆ భారాన్నీ బాధనీ తట్టుకోలేక విలవిల్లాడి పోయింది ఈ పువ్వు. ఎలాగో ఊపిరి బిగపట్టుకునే ప్రయత్నం చేసింది. అంతలోనే అక్కడ నిలబడి ఉన్న ఓ భక్తుడు దీన్ని చూశాడు. 'అయ్యో, పువ్వుని తొక్కేస్తున్నారు స్వామీ', అంటూ పూజారిని మందలించి, దీన్ని తన చేతిలోకి తీసుకుని పక్కనే ఉన్న కుళాయి దగ్గరకు తీసుకెళ్ళి దీని పత్రాల్ని నీటితో శుద్ధిచేసి కొత్త ఊపిరిపోశాడు. తర్వాత మళ్ళీ తీసుకొచ్చి నా పాదాలమీద ఉంచాడు". చెప్పటం ఆపి, ఆ పుష్పాన్ని తిరిగి ఆమెకు అందించాడు శ్రీరాముడు.

"పోన్లెండి... ఈ చిట్టితల్లి ఆశ నెరవేరింది." అంటూ దాన్ని తన అరచేతిలో ఉంచుకుని ముద్దాడింది సీతమ్మ. "అప్పుడు ఆ పువ్వు నన్ను ఏమని ప్రార్థించిందో తెలుసా జానకీ?" అటే చూస్తూ అడిగాడు మళ్ళీ.

"ఏమని ప్రార్థించిందీ?"

"బొడ్డుకోయకుండానేతనువుచాలించేపసిబిడ్డలా–చెట్టుకొమ్మనుంచివిడివడకుండానేనాజీవితంముగిసిపోతుందేమోనని తల్లడిల్లిపోయాను స్వామీ. అలాంటి నేను, ఎలాగో ఓ మాలలో చేరి నీ కంఠసీమను అలంకరించి, నీ స్పర్శతో తరించబోతున్నానని సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. తీరా ఆలయంలోకి వచ్చాక గర్భగుడిలోకైనా రాలేక కిందపడిపోయాను. అయినా నీ కనుల ముందు తనువు చాలించబోతున్నాను అనుకుంటూ సంతృప్తి చెందాను. ఈ చివరి క్షణాల్లో, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఆ భక్తుడెవరో నన్ను చూసి జాలిపడి నీ దగ్గరకు చేర్చాడు. ఇంతకు మించిన అదృష్టం నాకు అవసరంలేదు. కానీ, నన్ను నీ పాదసన్నిధికి చేర్చిన ఆ భక్తుడెవరో ఒక్కసారి గమనించు... అతని కోరిక తీర్చు... అతనికి ముక్తిని ప్రసాదించు– అంటూ కనులనిండా నీరు నింపుకుని తుది శ్వాస విడిచింది."

శ్రీరామచంద్రుడు చెప్పిన కథ యావత్తూ విన్న తర్వాత సీతమ్మతల్లి కళ్ళు చెమ్మగిల్లాయి. చేతిలో ఉన్న పువ్వును తన హృదయానికి గాఢంగా హత్తుకుంది.

"ఆహా... దీని మనసెంత గొప్పదో కదా! తాను మోక్షాన్ని ఆశించకుండా– మరుజన్మలో మంచి పుట్టుకనిమ్మనో మానవజన్మను ప్రసాదించమనో కోరుకోకుండా, నిస్వార్థబుద్ధితో ఆ భక్తుడెవరికో ముక్తినివ్వమంటూ ప్రార్థించిన దీని జన్మ ధన్యం కావాలి. పరమపావనమైన మీ పాదస్పర్శతో పునీతమైన ఈ పువ్వు నిజంగానే నాకు అరుదైన కానుక" అంటూ దాన్ని తన సిగలో అలంకరించుకుందామె.

అంతే!

ఆ క్షణాన– అక్కడి పరిసరాలన్నీ దివ్య తేజస్సుతో వెలిగిపోయాయి. జీవరహితమైన ఆ పువ్వు– సీతమ్మతల్లి సిగలో వేయి రేకులు విప్పుకుని, ధగద్ధగాయమానంగా మెరిసిపోతూ సువర్ణమంత్ర పుష్పమై భాసించింది!!







పూర్వకాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అయిదేళ్లు రాగానే అక్షరాభ్యాసమనే పవిత్రమైన విధిని పెద్దల సమక్షంలో నిర్వర్తించేవారు. ఇది పిల్లల విజ్ఞానసముపార్జనకు నాంది పలికే ఓ ప్రధానఘట్టం. ఆ తర్వాత .. పిల్లల్ని బడిలో చేర్చి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారి చదువు కొనసాగేలా చూసేవారు.

ఇక ఇంటిలో అమ్మో, అమ్మమ్మో, నానమ్మో 'చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ' లాంటి అలతి పద్యాలు... ఇంకా వేమన, సుమతి వగైరా శతకపద్యాలు, పురాణాలు, నీతి, న్యాయం, సమాజం, కుటుంబ జీవనం, జంతుజాలం గురించి చిన్నచిన్న కథలు చెబుతూండేవారు. అలా ఓ పద్ధతిలో కొనసాగే విద్యాబోధన పిల్లలకు కుటుంబం పట్ల, సమాజంలో సత్ప్రవర్తన పట్ల, జంతువుల పట్ల కరుణ, ప్రకృతి గురించి అవగాహన ఏర్పడేటట్టుగా ఉండేది.

కాని, ఆధునికతను సంతరించుకుని కాలం పెనుమార్పులకు లోనయ్యింది. పాపం .. పిల్లలకు పాఠాలు తప్ప పాఠ్యేతర కార్యక్రమాలకు సమయం లేకుండా పోయింది. వారు క్రమంగా బాల్యానికి దూరమై పోసాగారు.

ఇన్ని నిరాశ, నిస్పృహ ఘటనల మధ్య మిణుగురు దీపంలా ఓ వార్త భాషాసాంప్రదాయాలకు, బాల సాహిత్యానికి ఇంకా కాలం చెల్లలేదని నిరూపించింది.

హైదరాబాద్ లో ఇటీవల ముగిసిన పుస్తకప్రదర్శనలో దశాబ్దాల పాటు తెలుగుబాలలను తమ కథలతో కట్టిపడేసిన చందమామ పుస్తకాలను సంపుటాలుగా ముద్రించి ప్రదర్శనలో ఉంచితే, వాటిని ఎక్కువమంది కొనుగోలు చేసారని, అదే కాకుండా బాలలకు వినిపించడానికి కాశీమజిలీ కథలు, తెనాలి రామలింగడి కథలు, భాగవత కథలు, రేపటితరం సైంటిస్టు పుస్తకాలు కొనడానికి తల్లిదండ్రులు చాలా ఆసక్తి కనబరచారంటూ నిర్వాహకులు తెలిపారని వార్తాపత్రికల భోగట్టా. ఇది చాలా ఆహ్వానించదగ్గ పరిణామం. బాలల వికాసానికి తోడ్పడే సాహిత్యానికి మళ్లీ మంచిరోజులొస్తున్నాయని ఆశలను రేపే సమాచారం.

కథామంజరి కూడా బాలవికాసానికి తోడ్పడే చిన్నచిన్న కథలతో బాల కథామంజరిని ప్రారంభించాలనే సదాశయాన్ని గత నెలలో మీ ముందు ఉంచడం జరిగింది. మీ సూచనలు, సలహాలను కోరింది. బాల సాహిత్య పురోగతికి మాతో చేయి కలిపి, మీ అమూల్య సూచనలను, సలహాలను అందించండి. పిల్లలు ఇష్టపడి చదివే సాహిత్యాన్ని అందిద్దాం.